సోమవారం
04 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 316

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA STATE | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



క్రికెటర్‌తో ఎఫైర్? 10

ఉత్సవ విగ్రహాల
కిరీటాలు మాయం

- గోవిందరాజస్వామి ఆలయంలో అణువణువు గాలించిన పోలీసులు
- అర్చకుల విచారణ
- బీజేపీ నాయకుల నిరసన

7



ఉద్వేగాన్ని అదుపు చేయండిలా..

11



'పనిచేసే వారితోనే ఫలితం'

- బీజేపీ కొత్త నినాదం
- అభివృద్ధిపై ప్రచారం
- ప్రజలతో మమేకం
- వారి భాగస్వామ్యంతో 'మెనిఫెస్టో'
- 4 వేల అసెంబ్లీలో అభిప్రాయ సేకరణ

8



చందా కొచ్చర్‌పై ఈడీ కేసు

- భర్త దీపక్‌తోపాటు, వీడియోకాన్ గ్రూప్ అధినేతపైనా ఈసీఐఆర్ నమోదు
- మనీల్యాండరింగ్ చట్టం కింద కొనసాగుతున్న దర్యాప్తు

12





మళ్లీ నేనే పీఎం

- కశ్మీర్‌ను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించింది
- విభజన రాజకీయాలకు పాల్పడింది
- నిర్లక్ష్య సంస్కృతిని దేశం నుంచి తరిమికొట్టాం
- కశ్మీర్ పండిట్ల గౌరవం కాపాడుతాం
- అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాం
- పదేళ్లలో రైతుల ఖాతాల్లో రూ.7.50 లక్షల కోట్లు జమ చేస్తాం
- జమ్మూకశ్మీర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ప్రధాన మంత్రి మోదీ

జమ్ము: మళ్లీ తానే ప్రధానిగా బాధ్యతలు చేపడుతానని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎయిమ్స్, ఐఐఎంసీ, జల విద్యుత్ ప్రాజెక్టు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం లేహ్‌లో జరిగిన సభలో మోదీ మాట్లాడారు. 'ఈ రోజు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశాను. ఎన్నికల తర్వాత ప్రధాని హోదాలో వచ్చి ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తాను' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ జమ్ము కశ్మీర్‌ను పూర్తిగా విస్మరించిందని, విభజన రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ తరహా నిర్లక్ష్య సంస్కృతిని, విభజన రాజకీయాలను ఈ ఐదేళ్లలో దేశం నుంచే పారిపోయేలా చేశామని మోదీ తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నామని చెప్పారు.

అధికారం కోసమే కాంగ్రెస్ రైతులను వాడుకుంటోంది..

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ప్రధాని మోదీ మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి మాత్రమే కాంగ్రెస్ పార్టీ రైతులను వాడుకుందని ఆయన ఆరోపించారు. 2009–09 సంవత్సరంలో రైతులకు రూ. 6 లక్షల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించి.. కేవలం రూ. 52 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని వెల్లడించారు. తమ ప్రభుత్వం రైతును ఆర్థికంగా అభ్యున్నతి చేయాలన్న లక్ష్యంతో కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించామన్నారు. ఐదు ఎకరాలలోపు భూమి ప్రతి రైతుకు పంట పెట్టుబడి కింద ఎకరాకు రూ. 2 వేలు చొప్పున ఏటా మూడుమార్లు వారి ఖాతాలో వేస్తామని తెలిపారు. రానున్న పదేళ్లలో రూ. 7.50 లక్షల కోట్లు రైతుల ఖాతాలో వేస్తామని ప్రకటించారు. పథకం అమలు కోసం అర్హుల పేర్లు, ఆధార్ నెంబర్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేశామని చెప్పారు. ప్రజలకు మా ట్రాక్ రికార్డ్ తెలుసని, ఎన్నికల ముందే వారికి ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి సాయం అందుతుందని మోదీ తెలిపారు.

కశ్మీర్ పండిట్ల జీవితాల్లో మార్పు తెస్తాం

కశ్మీర్ పండింట్లకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ తాము కశ్మీర్ పండిట్ల ఆత్మాభిమానం, గౌరవం, హక్కుల అమలుకు నిబద్ధతగా కట్టుబడి ఉన్నట్లు మోదీ తెలిపారు. హింస, ఉగ్రవాదం చెలరేగిన కాలంలో కశ్మీర్ పండిట్లు తమ నివాసాలను ఒదిలి బయటికి పారిపోవలసి వచ్చిందని, ఇది దేశ చరిత్రలో చీకటి అధ్యాయమని ఆయన అన్నారు. కశ్మీర్ ప్రజలు అనేక ఇబ్బందుల్లో నివసిస్తున్నారని, వారి జీవితాల్లో మార్పు తేవడానికి తాము మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు. లడఖ్ స్వయంప్రతిపత్తి కోసం కొండ అభివృద్ధి మండలి చట్టానికి సవరణలు చేసిన సంగతిని ప్రస్తావిస్తూ ఈ మండలి ద్వారా నిధులు విడుదల అవుతాయని ప్రకటించారు. ఇప్పటి వరకూ మెడికల్ కళాశాలల్లో కేవలం 500 సీట్లు మాత్రమే ఉన్నాయని, కొత్తగా నిర్మిస్తున్న 5 కళాశాలతో మరో 500 సీట్లు అందుబాటులోకి రానున్నాయని మోదీ ప్రకటించారు. కొత్తగా నిర్మిస్తున్న 700 పడకల ఎయిమ్స్ కోసం రూ. 750 కోట్లు మంజూరు చేశామని ఆయన వివరించారు.



ఎన్నికల ప్రచారం కోసమే..

మోదీ గొప్పల బడ్జెట్

- రైతాంగానికి ఒరిగేదేమీ లేదు
- బీహార్ వెనుకబాటుకు నితీష్, బీజేపీ కారణం
- అధికారంలోకి వస్తే పట్నా సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు
- జన్ ఆక్రోశ్ ర్యాలీలో రాహుల్ గాంధీ

విజయక్రాంతి, పట్నా: ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పుకోవడం కోసమే ప్రధాని నరేంద్ర మోదీ రైతు పథకాన్ని బడ్జెట్‌లో పెట్టారని, దాని ద్వారా రైతాంగానికి ఒరిగేదేమీ లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివారం బిహార్‌లో ఆయన పర్యటించారు. పట్నాలోని గాంధీ మైదానంలో జన్ ఆక్రోశ్ ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత పట్నాలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతూ రైతులకు మాత్రం రోజుకి కేవలం 17 రూపాయలు చెల్లిస్తోందని విమర్శించారు. బీహార్ అభివృద్ధిలో వెనుకబడి పోవడానికి ఆ రాష్ట్ర సీఎం నితీష్, మోదీనే కారణమని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల్లో రైతులకు రుణమాఫీ చేసిందని రాహుల్ వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. బీహార్‌లో విద్యావ్యవస్థ దారుణంగా మారిపోయిందని, నిరుద్యోగుల సమస్య పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వం (తరువాయి 4లో)

సంస్కృతి, సంస్కారానికి

ప్రతీకగా యాదాద్రి

- ఆగమ శాస్త్రానికి అనుగుణంగా పునఃనిర్మాణం
- అభివృద్ధి పనుల కోసం 173 ఎకరాల భూమిని గుర్తించాం
- ఆలయ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ సమీక్ష
- ఏరియల్ సర్వే ద్వారా పనుల పరిశీలన



విజయక్రాంతి, హైదరాబాద్: యాదాద్రి ఆలయం సంస్కృతి,సంస్కారాల నిలయం గా తీర్చిదిద్ది భావతరాలవారికి ఆదర్శంగా ఉండేవిధంగా అభివృద్ధి పరుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు తెలిపారు. ఆలయాన్ని ఆగమ శాస్త్రానికి అనుగుణంగా పునర్నిర్మాణం చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం వారాంతపు రోజులలో రోజుకి 50 వేల నుంచి 70 వేల దాకా భక్తులు దర్శనానికి వస్తున్నారని, ఆలయం అభివృద్ధి చెందిన తరువాత రోజుకు రెండు లక్షల వరకు భక్తుల వస్తారని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం యాదాద్రి భువనగిరిజిల్లా లోని యాదగిరి గుట్ట దేవస్థానం అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. హైద్రాబాద్ నుంచి హెలికాప్టర్ లో బయలుదేరిన ఆయన దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం యాదగిరిగుట్టలోని బాలాలయంలో లక్ష్మి నరసింహ స్వామీ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మి నర్సింహచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ముఖ్యమంత్రికి ఆశీర్వాద వచనం చేశారు.

30 ఎకరాల్లో స్వామి వారి పుష్కరిణి

అనంతరం యాదాద్రి అభివృద్ధి అథారిటి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిపనులుపై సీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తరువాత విలేఖర్ల సమావేశంలో (తరువాయి 4లో)

న్యాయవ్యవస్థ

ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది

- వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు
- ఏపీకి కొత్త హైకోర్టు రావడం సంతోషకరం
- సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్
- సీఎం చంద్రబాబుతో కలిసి ఏపీ హైకోర్టు శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపన
- జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనం ప్రారంభం



విజయక్రాంతి, అమరావతి: న్యాయవ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావు ఉండరాదని స్పష్టం చేశారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఏపీ హైకోర్టు శాశ్వత భవన నిర్మాణానికి ఆదివారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏపీ హైకోర్టు శాశ్వత భవన సముదాయాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైకోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన గ్యాలరీని సీజేఐ పరిశీలించారు. హైకోర్టు భవన నిర్మాణంపై అధికారులు వీడియో ప్రజంటేషన్ ఇచ్చారు. మొత్తం 450 ఎకరాల్లో బౌద్ధ స్థూపాకృతిలో న్యాయ నగరం నిర్మితమవుతుందని వివరించారు. రూ.819 కోట్లతో 12.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు శాశ్వత భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం ఆధునిక వసతులతో, అత్యంత ఆకర్షణీయంగా నిర్మించిన జ్యుడీషియల్ కాంప్లెక్స్ (హైకోర్టు) భవనాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ప్రారంభించారు. (తరువాయి 4లో)

బెంగాల్‌లో హైడ్రామా

- శారదా చిట్ ఫండ్ కుంభకోణం కేసులో సీబీఐ దూకుడు
- కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ అరెస్ట్‌కు యత్నం
- సీబీఐ అధికారులను అదుపులోకి తీసుకున్న రాష్ట్ర పోలీసులు
- గవర్నర్‌ను సంప్రదించే యోచనలో సీబీఐ
- రాజ్యాంగ పరిరక్షణకు ధర్నా చేస్తానని మమతా హెచ్చరిక




విజయక్రాంతి, కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఆదివారం మరో హైడ్రామాకు తెరలేచింది. సీబీఐ అధికారులను ఆ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనం రేపింది. రోజ్ వ్యాలీ, శారదా చిట్ ఫండ్ కుంభకోణం కేసులో ప్రమేయముందన్న ఆరోపణలపై కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను అదుపులోకి తీసుకునేందుకు ఆదివారం సాయంత్రం సీబీఐ అధికారులు నగరానికి వచ్చారు. ఈ కేసు విచారణలో భాగంగా చివరి ప్రయత్నంగా రాజీవ్ కుమార్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో సీబీఐ అధికారులను కోల్‌కతా పోలీసులు నిలువరించారు. సీబీఐ బృందాన్ని అడ్డుకోవడంతోపాటు రాజీవ్‌ను విచారించేందుకు (తరువాయి 4లో)

జీహెచ్‌ఎంసీ వైఫల్యం

నగరంలో నాసిరకం మాంసం

- నిబంధనలు బేఖాతరు
- చోద్యం చూస్తున్న అధికారులు
- కబేళాల ఆధునికతకు కోట్లలో వ్యయం–పర్యవేక్షణ లోపం
- ప్రైవేట్ కబేళాలకు అడ్డాగా పాతబస్తీ



విజయక్రాంతి, హైదరాబాద్: నగరంలోని మాంసాహారుల ఆరోగ్యం గాలిలో దీపంలా తయారైంది. అక్రమ వధశాలల నుంచి మార్కెట్లోకి వస్తున్న ధృవీకరించని మాంసం మార్కెట్ లో యథేచ్ఛగా చలామణి అవుతుండటంతో మాంసాహార ప్రియులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం నగర ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసం అందే విదంగా చర్యలు తీసుకోవాలి. సర్కిల్ వారీగా ఉన్న పశువైద్యులు కబేళాలకు వస్తున్న గొర్రెలు, మేకలు, ఎద్దులను అన్నివిధాలా పరిశీలించాలి. ఏదైనా జబ్బులున్నట్లు తేలితే వాటి నుంచి మాంసం సేకరించకుండా చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యంగా ఉన్నట్లు తేలిన తరువాతే కబేళాలో మాంసం తయారీకి అనుమతించాలి. (తరువాయి 4లో)




శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం	ఉత్తరాయణం
హేమంత ఋతువు	పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:47	కరణం	: చతుష్పాద 13:12 నాగవ 26:33
సూర్యాస్తమయం	: సా. 06:12	రాహుకాలం	: ఉ. 08:15, 09:40
పక్షము	: కృష్ణ పక్షం	యమగండం	: ప. 11:15, మ. 12:30
తిథి	: అమావాస్య 26:33	వర్జ్యం	: ఉ. 07:26, 09:15
నక్షత్రం	: శ్రవణం 30:02	అమృతకాలం	: సా. 06:17, 08:05
యోగం	: సిద్ధి 07:59		





సూక్తి సుధ

భక్తి అనేది కేవలం లౌకికమైన ఈతి బాధలు తీరడానికి కాదు. మనం ఎవరో, మన స్వస్వరూపం ఏమిటో తెలుసుకొని, నిజమైన 'నేను'లో రమించి శాంతిని పొందుట కోసం మాత్రమే భక్తి.

– భగవాన్ రమణమహర్షి

సంస్కృతంలో సంకలన గ్రంథాలు

వేద విజ్ఞానం

భాగం-90

శక.1795లో వచ్చిన యంత్రకరణంపై మలయేంద్రసూరి వ్యాఖ్యానానికి ప్రతిభా బోధకమనే పేరుతో శక.1804లో వ్యాఖ్యానం రాశారు. శక.1800లో భాస్కరుని లీలావతిని క్రొత్త దృక్కోణంతో ముద్రించారు. భాస్కరుని 'బీజ'పై కొత్త వ్యాఖ్యానం రాసి, ముద్రణ చేయించారు. కరణ కుతూహలంపై వాసనా విభూషణ వ్యాఖ్యానాన్ని రాసి, 1803లో ముద్రించారు. శక.1810లో వరాహమిహిరుని 'పంచ సిద్ధాంతిక' గ్రంథానికి, 'పంచ సిద్ధాంతిక ప్రకాశిక' అనే వ్యాఖ్యానాన్ని రాశారు. ఈ వ్యాఖ్యానంతో పాటు వారణాసి సంస్కృత కళాశాల అధ్యక్షుడు డా.జి. థిబౌ రాసిన ఆంగ్ల అనువాదాన్ని కలిపి క్రీ.శ. 1899లో ముద్రించారు. ఈ వ్యాఖ్యానాలన్నీ సంస్కృత భాషలో కూర్చబడ్డాయి. ఇవే కాకుండా కృష్ణ రాసిన, 'ఛాదకనిర్ణయము' కమలాకరుని 'సిద్ధాంతతత్వ వివేకం', లల్లాచార్యుని 'ధీవృద్ధిద తంత్రము'ను 1806,1807,1808 సంవత్సరాలలో వరుసగా ముద్రించారు. ప్రస్తుతం ఉత్పలుని వ్యాఖ్యానంతో కూడిన 'బృహత్సంహిత'ను ముద్రించడంలో నిమగ్నమయి ఉన్నారు. సంస్కృత భాషపై 'భాషాబోధకము' అనే గ్రంథాన్ని ముద్రించారు. అంతేకాక హిందీలో 'చలనకలనగణితం' హిందీ వ్యాకరణ గ్రంథాలను రాశారు.

ద్వివేది రాసిన గ్రంథాలలో గణక తరంగిణి చాలా ఉపయోగపడే గ్రంథం. దీనిద్వారా వీరికి గల యూరోపియన్, భారతీయ గణితంపైన, సిద్ధాంత గణితంపైన, సాధికారితను తెలియచేస్తాయి. అయినప్పటికి కొన్ని సందర్భాలలో నిరాధారమైన, ఊహాతీతమైన వ్యాఖ్యలను చేశారు. "ఆర్యభటు దైవంగా భావించే ఒక గ్రీకు పండితుడు తెలియచేసిన గ్రమభగణాది మూల విషయాలను రహస్యముగా ఉంచుటచే, ఆర్యభటుడు కటపయాది (సంఖ్యలను సూచించే నూతన) పద్ధతిని ప్రవేశపెట్టాడని, భాస్కరుడు జ్యా మూలాన్ని తన గ్రంథంలో చివరలో తెలియచేసాడని, దీని సిద్ధాంతాన్ని ఏ మాత్రం వివరించలేదని చెప్పడం జరిగింది. ఈ వచనం ప్రకారం, భాస్కరుడు ఎవరో పండితుడైన గ్రీకు సంచారి వద్ద ఈ పద్ధతులను తెలుసుకున్నారే కాని దాని వెనుకగల సిద్ధాంతాన్ని తెలుసుకోలేదని చెప్పినట్లు అయ్యింది. ఆంగ్లేయుల నాటికల్ ఆల్మనాక్‌ను సంకలనం చేయడానికి వినియోగించే ఫ్రెంచి గ్రంథాల్లోని విషయాన్ని సంస్కృతములో సంకలనం చేయగల సమర్థత వీరికి ఉంది. అటువంటి గ్రంథాన్ని ఆయనే రాయాలని మనం కోరుకోవచ్చును.

– డా|| రేమళ్ల అవధానులు

భోజనమందు మంచినీరు ఎలా సేవించాలి?



చాణక్యం

శ్లో॥ అజీర్ణే బేషజం వారి జీర్ణే వారి బలప్రదమ్।
భోజనే చామృతం వారి భోజనాన్తే విషప్రదమ్॥

జీర్ణం కానివానికి నీరు మందువంటిది. జీర్ణమైన వానికి నీరు బలాన్ని ఇస్తుంది. భోజనం చేస్తూ మధ్యలో నీరు త్రాగిన అమృతంతో సమానమైన గుణాన్ని ఇచ్చును. భోజనానంతరం నీరు త్రాగిన యెడల అది విషముతో సమానమైన హానిని కలిగిస్తుందని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. ఇంకా వివరంగా చెప్పాలంటే జీర్ణం కానప్పుడు, భోజనం చేయకుండా నీరు త్రాగినచో ఔషధం వలె ఉపయోగపడుతుంటున్నారు. భోజనం జీర్ణమైన తరువాత అనగా భోజనానంతరం మూడు గంటల తరువాత నీరు త్రాగిన యెడల బలదాయకంగా ఉంటుందంటున్నారు. భోజనం చేస్తూ మధ్యలో నీరు త్రాగినచో ఆ నీరు రుచిని కలిగించడమే కాకుండా అమృతంతో సమానమైన గుణాన్ని కలిగిస్తుందంటున్నారు. అన్నం తినగానే వెంటనే నీరు త్రాగినయెడల జీర్ణరసాన్ని పలుచనపరిచి భోజన పదార్థాన్ని శీఘ్రంగా జీర్ణ కోశము నుండి కిందకు దిగిపోవటం వల్ల ఆ పదార్థం సరిగా జీర్ణం కలుగక విషంతో సమానంగా హాని కలిగిస్తుందంటున్నారు. ఈ దిగువ శ్లోకంలో ఇంకా ఇలా వివరిస్తున్నారు.

అత్యమ్బుపానాన్న విపచ్యతేఽన్నం నిరమ్బుపానాచ్చ న ఏవ దోషః।
తస్మాన్నరో వహ్ని వివర్ధనాయ ముహుర్ముహుర్వారి పిబేధభూ

నీరు ఎక్కువ త్రాగినచో ఆహారం సరిగా అరగదు. అసలు నీరు త్రాగకున్నచో దోషం సంభవిస్తుంది. అందువలన జఠరాగ్నిని ప్రదీప్తం చేయటానికి మనుషుడు భోజన మధ్యలో మాటి మాటికి కొంచెం కొంచెం నీరు తాగుతుండాలంటున్నారు. భోజనం చేసేటప్పుడు మనం హడావుడిగా తినకుండా నెమ్మదిగా నమిలి నమిలి తినాలి. అలాకాకుండా తిన్నచో పదార్థం కంఠం మధ్యలోనే ఒకసారి ఉండిపోవచ్చు. అప్పుడు కొంచెం కొంచెంగా నీరు త్రాగినయెడల ఆ పదార్థం జీర్ణకోశంలోకి చేరుతుంది. అక్కడ జీర్ణరసాల వల్ల పచనమై గ్లూకోజ్ తయారై రక్తంలో కలిసి శరారీనికి కావలిసినంత కేలరీలను విడుదల చేస్తుంది. అలాకాకుండా మొత్తం భోజనం చేసిన తర్వాత అప్పుడు మంచినీరు త్రాగితే మనం సేవించిన పదార్థం కూడా పలుచనై జీర్ణరసాలు కూడా పలచనైపోయి ఆహారం సరిగా జీర్ణం కాకుండాపాడైపోయి విషతుల్యంగా మారుతుందని తెలియచేస్తున్నారు. ఒక్కొక్కప్పుడు మృత్యువాత కూడా పడే ప్రమాదం ఉంటుందంటున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

కుంభమేళాలో ఒకేసారి లక్షలాది మంది

నాగసాధువులు ఎలా ప్రత్యక్షమవుతారు?



మీకు తెలుసా

నాగసాధువులకి ఎలాంటి శక్తులు కలిగి ఉంటారో ఒక్కసారి చూద్దాం. హరిద్వార్ లోనూ, త్రివేణి సంగమం లోనూ జరిగే కుంభమేళా లలో లక్షలాది మంది నాగసాధువులు రావటం మనం టీవీల్ల, పేపర్లలో చూశాం. నాగ సాధువులు దిగంబరంగా వుంటారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఎక్కడో హిమాలయ గుహలలో, కొండల్లో, నదీ తీరాల్లో వుంటారు. మామూలు రోజుల్లో వారు ఎవరికీ కనిపించరు. హిమాలయాల నుంచి కుంభమేళా జరిగే ప్రదేశాలు కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో వుంటాయి.

ఇక్కడ మనకు మనమే ఒక ప్రశ్న వేసుకుందాం. కొన్ని లక్షల మంది దిగంబరులు ఒకేసారి కొన్ని వందల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే, వాళ్ళు ప్రయాణం చేసిన మార్గం అంతా ట్రాఫిక్ జామ్ అవ్వాలి కదా. ఇప్పటి దాకా ఎక్కడైనా అలాంటి సంఘటన రికార్డ్ అయ్యిందా? ప్రయాణ మార్గంలో ఎన్నో పల్లెలు, పట్టణాలు, నగరాలు వుంటాయి. ఎక్కడైనా,ఏ ఫోటోగ్రాఫర్ కు అయినా ఇన్ని లక్షల మంది దిగంబరులు కన్పించారా? ఎక్కడైనా ఇంతమంది ప్రత్యేక విమానాల్లో, ఇతర రవాణా సాధనాల్లో ప్రయాణం చేసిన దాఖలాలు కన్పించాయా?లేదే? సరిగ్గా అందరూ ఒకేసారి, కుంభమేళా జరిగే ప్రదేశంలో ఎలా ప్రత్యక్షమవుతారు? కుంభమేళా ముగిశాక, తిరుగు ప్రయాణంలో ఒక కిలోమీటర్ దూరం వరకే కన్పించి హఠాత్తుగా ఎలా మాయమైపోతారు? ఆ ప్రాంతంలో తప్ప మరెక్కడా వారి జాడ ఎందుకు కన్పించదు? వీటన్నింటికీ సమాధానం ఒకటే అదే సూక్ష్మ శరీర యానం. నాగసాధువులు తమ సుదీర్ఘ ప్రయాణానికి ఉపయోగించే ప్రయాణ సాధనం. ఎన్నో ఏళ్ళుగా మన కళ్ళ ముందు ఇంత సజీవ సాక్ష్యం కన్పిస్తుంటే దాన్ని మనం నమ్మం. అమెరికా వాడు, రష్యావాడు, చైనావాడు, జపాన్‌వాడు, జర్మనీ వాడు చెప్పే సొల్లు అంతా విని చంకలు ఎగరేస్తుంటాం. ఒక్కసారి మనసు పెట్టి మన శాస్త్రాలు చదవండి. వాటిని అనుసరించి,అమలు చేసే ప్రయత్నం చెయ్యండి. ప్రపంచానికి మళ్ళీ మనం పాఠాలు చెప్పొచ్చు.

– సాధిక్ అలీ

ధర్మ సందేహాలకు సమాధానాలు

శైవాగమాలెన్ని? అవి ఏవి?

1. కామికాగమం 2. యోగజాగమం 3. చిన్త్యాగమం 4. కారణాగమం 5.అజితీగమం 6.దీప్తాగమం 7.సూక్ష్మాగమం 8. సహస్రాగమం 9. అంశుమదాగమం 10. సుప్రభేదాగమం 11. విజయాగమం 12. నిశ్వాసాగమం 13. స్వాయంభువాగమం 14. అనలాగమం 15. వీరాగమం 16. రౌరవాగమం 17. మకుటాగమం 18. విమలాగమం 19.చన్ద్రజ్ఞానాగమం 20. బింబాగమం 21. ప్రోద్గీతాగము 22. లలితాగమం 23. సిద్ధాగమం 24. సంతానాగమం 25. శర్వోక్తాగమం 26. పారమేశ్వరాగమం 27. కిరణాగమం 28. వాతూలాగమం

–డా॥ పి.భాస్కరయోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..


1. భగీరథుని తండ్రి పేరు?
2. విశ్వామిత్రుని అస్త్రశస్త్రాలన్నీ వశిష్ఠుడు దేనితో నిరోధించాడు?
3. శ్రీకృష్ణుని గద పేరు?
4. ఖాండవవనం ఎవరిది?
5. బృహద్రదుని కుమారుడి పేరు?
6. ఖాండవ దహనం చేసిన వారెవరు?
7. విశ్వరూపుని తల ఖండించగా ఇంద్రునికి కలిగిన దోషం
8. ఖాండవ దహనాన్ని నిర్విఘ్నంగా జరిపించింది ఎవరు?
9. బ్రహ్మం నుండి పుట్టినవాడు?
10. వృత్తుడు ఎవరి గురించి తపస్సు చేశాడు?

జవాబులు

[illegible]



మనసు యానం.. రాగద్వేషాలకతీతం



మానవ శరీరయాత్రలో జాగ్రతు స్వప్నము సుషుప్తి అనే అనుభవాలు కలుగుతుంటాయి. ఇవి మనస్సుచే ఏర్పడ్డవే. జాగ్రదావస్థ అహంకారం పూర్తిగా వ్యక్తమయ్యే స్థితి. దీన్లో జ్ఞాపకాలు అనే వాసనలు చిదాభాసునితో కలసి బాహ్యప్రపంచంలో వ్యక్తులను, వస్తువులను జ్ఞానేంద్రియాలతో మనకంటే బయట ఉన్నట్లు ఊహించుకుంటాం. ఇలా జాగ్రదావస్థలో ప్రాపంచికజ్ఞానం నిరంతరము కలుగుతూ ఉంటుంది. ఈ అవస్థలో అహంకారం సూక్ష్మశరీరంతోను, స్థూలశరీరంతోను తాదాత్మ్యం చెంది జీవుని వ్యక్తిత్వం పూర్తిగా వ్యక్త మవుతుంది. దీన్లో జీవుడిని విశ్వుడు / వైశ్వానరుడని అంటాం. ఒకోసారి మనం సుషుప్తి స్వప్న జాగ్రదావస్థల మధ్య ఉంటుంటాం. మెలకువలో స్వప్నము, నిద్రలో మెలుకువతోను ఉండటం జరుగుతూంటుంది. అలాంటప్పుడు అహంకారం పాక్షికంగా స్థూలశరీరంతో తాదాత్మ్యం పొందుతుంది. ఈఅవస్థలు అహంకారానికి సంబంధించినవే కాని శుద్ధచైతన్యానికి సంబంధించినవి కావు. మనకు జాగ్రదావస్థ వాస్తవంగాను స్వప్నావస్థ భ్రాంతిగాను తోస్తుంది. జాగ్రదావస్థలో సగటు మానవుడు తన ప్రపంచాన్ని తనే సృష్టించుకుంటాడు. కాని జ్ఞాని భగవతుని సృష్టిలో ఆనందం అనుభవిస్తూ జీవిస్తుంటాడు. మనస్సు , అహంకారంతో కూడిన జడమైన స్థూలశరీరమే ఈ మూడు అవస్థలను, జనన మరణాలను పొందుతోంది. పంచభూతములు జడమైనవి. అలాగే వాటి కార్యమైన స్థూల సూక్ష్మ శరీరాలూ జడమైనవే. సూక్ష్మశరీరానికి శుద్ధచైతన్యాన్ని ప్రతిబింబించే గుణము ఉంది. దీని ద్వారా మరొక దాన్ని తెలుసుకొనే వీలుంటుంది గనుక దీన్ని లింగశరీరం అంటారు. లింగము అంటే చిహ్నము. స్థూలశరీరం సూక్ష్మశరీరంతో కలసినపుడు అది చైతన్యవంత మవుతుంది. సూక్ష్మశరీరంనుంచి విడిపోతే జడముగా ఉంటుంది. ఆత్మచైతన్యమే జననమరణాలకు సాక్షిగా ఉండేది. ఎందుకంటే ఆత్మ జన్మించలేదు, మరణించలేదు. అది లేని కాలమేలేదు. అహంకారము, ఈ మూడు అవస్థలు, సూక్ష్మ స్థూలశరీరాలు, ప్రపంచమూ ఇలా చూడబడేవన్నీ జడములు. ఈ మూడు అవస్థలూ మనచేత మాయవల్ల అనుభవించబడుతున్నాయి. జడమైన చూడబడే వాటికీ, చూసే చైతన్యవంతమైన వానికీ మాయచేత విడదీయలేని బంధం ఏర్పడింది. వాస్తవానికి మాయకు అస్తిత్వం లేదు. ఇది కేవలం ప్రాపంచిక అనుభవాలు పొందడానికే. స్వప్నంలో మనస్సు తనకున్న శక్తితో ఏ విషయము, వస్తువూ లేకున్నా ఒక ప్రపంచాన్ని సృష్టించి దాని అనుభవాలను పొందుతుంది. అలాగే జాగ్రదావస్థలోనూ ఈ ప్రపంచం మనస్సుచేతనే కల్పించబడిన దవుతోంది. స్వప్నావస్థలో అహంకారం పాక్షికమైన మార్పులు చెందుతుంది. దీన్లో అహంకారం సూక్ష్మశరీరంతో తాదాత్మ్యం చెందుతుంది గాని స్థూల శరీరంతో కాదు. ఇంద్రియాలు నిర్లిప్తమై మనస్సుతో కలసి ఉంటాయి. ఈ దశలో మనస్సే పనిచేస్తుంది. భూమిగాని, సముద్రంగాని, జంతుజాలం మొదలైనవి గాని ఏవీ ఉండవు. మనస్సే జాగ్రదావస్థలో అనుభవాలనుండి వీటిని సృష్టించుకుంటుంది. మనస్సే ఇలా మార్పుచెందుతూ కర్తగాను, విషయముగాను వ్యవహరిస్తూ అదే చూసేదిగాను, చూడబడేది గాను స్వప్నంలో వ్యవహరిస్తుంది. స్వప్నంలో జీవుడిని తైజసుడు అంటారు. అంటే స్వప్న విషయాలను ప్రకాశింప చేసేవాడు. స్వప్నంలో మనకు అనుభవానికి వచ్చే విషయాలన్నీ ఆత్మప్రకాశం వల్లే అనుభవానికి వస్తున్నాయి. దీనివల్ల ఆత్మస్వయం ప్రకాశమని తెలుస్తుంది. జాగ్రత్తులో మనస్సు బాహ్య విషయాలపై ఆధారపడితే, స్వప్నంలో తనంత తానే జాగ్రదావస్థలోని అనుభవాల ఆధారంగా విషయాలను సృష్టించుకొని ఆనందము లేక దుఖాన్ని పొందుతుంటుంది. మెలకువ రాగానే కలలో అనుభవాలు మాయమవుతాయి. ఐనా అవి పోయాయనే బాధ ఉండదు. ఎందుకంటే అవి వాస్తవం కాదు, కలలో విషయానుభవాలని తెలియడం వల్ల. ఇదే విశ్లేషణ ఆధారంగా బ్రహ్మమును తెలుసుకొంటే జాగ్రత్తులో కన్పించే జగత్తు భ్రమ అని అనుభవమవుతుంది. అపుడు ప్రపంచమే స్వప్నతుల్యం అని అనిపిస్తుంది. జాగ్రదావస్థ కూడ సుదీర్ఘస్వప్నమే అనిపిస్తుంది. మనస్సులో ఇదివరకే ముద్రించబడిన జ్ఞాపకాలపై చైతన్యము యొక్క ప్రకాశం పడి స్వప్నప్రపంచంగా వ్యక్తమవుతోంది. అంటే స్వప్నం మన వాసనలచేత కల్పించబడుతోంది. సుషుప్త్యావస్థలో అహంకారం లీనమై దేహం అచేతనంగా అవుతుంది. వేదాంతంలో ఈ గాఢనిద్రను అహంకారం తన వ్యవహారాల నుండి తప్పుకున్న స్థితిగా చెప్పబడింది. అహంకారం నాశనం కాదు గాని అది బీజావస్థలో కారణశరీరంతో తాదాత్మ్యం చెంది ఉంటుంది. సూక్ష్మశరీరం స్థూలశరీరంతో కలవక విడిగా ఉంటుంది. అందుకే ప్రాపంచిక వ్యవహారాలన్నీ తాత్కాలికంగా ఆగిపోతాయి. స్థూలశరీరం జడమైనదిగా ఉంటుంది. సుషుప్తిలో రాగద్వేషాలుండవు. మనస్సు దానికి కారణమైన అధిష్టానంలో లీనమై ఉంటుంది. కాని ఆత్మ ఉంటుంది. నిద్ర నుంచి లేవగానే నిద్రాసుఖాన్ని అనుభవించేనని తెలుసుకుంటాడు. సుషుప్తి రెండవదే లేని అద్వైతస్థితి. సుఖంగా నిద్రించానని తెలియడంవల్ల ఆత్మచైతన్యం ఎల్లప్పుడూ ఉండేదేనని తెలుస్తుంది. నిద్రపోయాడు అంటే అతడు తన సత్‌లోకి వెళ్ళేడని ఛాందోగ్యోపనిషత్తు చెబుతుంది. ద్వైతమంతా జాగ్రత్ స్వప్నాలలోనే. స్వప్నంలో సంఘటనలు మనలను మోహపరుస్తాయి. ఆధ్యాత్మిక సాధనకు స్వప దృష్టాం తము , జాగ్రదావస్థ రెండూ మిధ్య అని చెప్పడానికి ఉపయోగ పడుతుంది. జాగ్రదావస్థలోను స్వప్నావస్థలోను మనస్సే నేను నీవు, నాది నీది, నావారు పైవారు, సుఖదుఃఖాలు , కులభేదాలు, లింగభేదాలు సృష్టించుకుంటుంది. పరమాత్మ జీవులలో విశ్వుడు, తైజసుడు , ప్రాజ్ఞుడు అనే నామాలతో విలసిల్లుతున్నాడు.విశ్వుడు/వైశ్వానరునికి కుడికన్ను, తైజసునికి మనస్సు కంఠస్థానమునను, ప్రాజ్ఞుడు/ ప్రజ్ఞకు హృదయము వరుసగా జాగ్రత్తు, స్వప్నము, సుషుప్త్యావస్థలలో స్థానములని చెప్పబడింది. సుషుప్తి నుండే స్వప్న జాగ్రదావస్థలు ఏర్పడుతాయి.

– డా|| బాలుశర్మ పన్నాల, వేదపండితులు

భువనేశ్వరిదేవి



మూలాధారపు ఆకృతిలో అలంకారం మొదలై, భక్తితో జాగృతమై దీపం వలె తేజోవంతమై సత్కర్మాచరణ వంటి పువ్వులను సర్వ ఆశా పరిపూరక చక్రంగా నాతో మాల కట్టించినందుకు నీకునా పాదాభివందనం. ఆజ్ఞాకారిణివై బుద్ధితత్వ పరివర్తనమనే మంత్రిణీ స్వరూపమై స్వయాలం కృతవుకా! ఇల్లాలికి పరిపూర్ణ వ్యక్తిత్వం ఉండాలి. ఈ వ్యక్తిత్వానికి గుర్తుగా వృత్తాకారవలయంగా మణిపుర చక్రమై ఆవిష్కరింప బడుతున్నది. ఈ దీపవలయం ఆరోగ్య, ఐశ్వర్యాలను వెదజల్లే చిహ్నంగా ఉంది. ఇదే ప్రథమశక్తి నిరూపణకు గుర్తు. ఇదే స్త్రీ జీవితంలాగా ఎన్ని ఒడిదొడుకులున్నా త్రైలోక్యమోహన చక్రమై విజ్ఞాన, ఆహ్లాదాన్ని సమాజానికి వర్తింపచేస్తున్నది. దీక్షా, ఏకాగ్రత, స్వయం సమృద్ధి కలిపి అనాహత చక్రం లాగా తాపత్రయాలను నివారింపచేస్తున్నది. ఇటువంటి శక్తిశాలిని పవిత్రమై కోశనాథునిగా వికసించి, వైభోగంగా అష్ట సిద్ధులతో స్థిరపడుతున్నది. ఈ వైభవ మహిమ పవిత్రత కలగలిసిన ఆనందంతో సర్వజన సమ్మోహితమై అందరి హృదయాలకు తృప్తిని కలిగించుగాక!

ఈ ఆవిష్కరణతో హ్రీంకార రూపం షోడషమంత్ర స్వరూపిణియై నాకు అనంతశక్తిని ప్రసాదించు గాక! ప్రకృతి నియమాలకు, నీ సంకల్పానికి అనుగుణంగా ప్రవర్తించే శక్తినిచ్చి, నన్ను ఉజ్వల భవిష్యత్తులోకి నడిపించుదువుగాక! నన్నే కాదు, అనంత ప్రజావాహినికి కూడా అదే బలాన్నిస్తూ వారిని కూడా సన్మార్గంలో నడిపింతువుగాక!

జీవితపు ప్రతి నిమిషాన్ని ఆనంద భరితం చేసుకునే శక్తిని సూర్యుడు మనందరికీ ఇచ్చి ఉజ్వల భవిష్యత్తును ప్రకాశింపచేయుగాక! ఓ త్రిపుర సుందరీదేవి! నన్ను నీ చేత పరిపాలించే దాసిగా చేసి నీ సేవా భాగ్యాన్ని పొంది, తద్వారా తాపత్రయమనే అగ్ని నుండి, విముక్తి కలిగించుము. మహిమాన్వితమైన నీ పాదపద్మాలు నా హృదయపీఠంపై స్థిరంగా ప్రతిష్ఠించుకొనే అదృష్టాన్ని నాకు ఇవ్వు. ఈ వరలక్ష్మీ వ్రతం రోజున మా ఇంటికి వచ్చే ముత్తైదువలందరూ పసుపు కుంకుమలతో పరిపూర్ణులై సర్వసౌభాగ్యదాయక చక్రంలో స్థిరపడుదురుగాక! హృదయంలో త్రిపురసుందరి స్థిరపడి మనలను పరిపాలించుగాక! సంపూర్ణ ఆరోగ్యం, సంపూర్ణ సౌభాగ్యం, సంపూర్ణ సేవా తత్పరతలను ఇచ్చి దీవించుగాక! ఆ లలితా త్రిపుర సుందరి శ్రీ వరలక్ష్మీ దేవియై 'హ్రీం' కార రూపంలో భువనేశ్వరిగా అవతరిస్తున్న శుభసందర్భమే ఈ వేడుక. ఈ అద్భుత క్షణాలలో మనమంతా త్రికోణాంతర దీపిక ఆవరణలోకి చేరుకుందాం. ఆ అమ్మవారి ఛత్రఛాయలో ఆమె అనుగ్రహానికి పాత్రులమవుదాం.నీవే సర్వాంతర్యామివి గదా! కర్మసాక్షివి, నీకు తెలియనిది ఏముంది? బాహ్యంగానే కాక అదృశ్యంగా ఉండి కూడా మాకు అన్ని రకాల అధికారాలను, యోగ్యతలను ప్రసాదించే శక్తిని కూడా నీవే! మా మనోభీష్టాన్ని నెరవేర్చు. సుమంగళినై భర్తతో కలిసి సకల భోగభాగ్యాలను అనుభవిస్తూ, నిన్నే నమ్ము కుంటున్నా. నీవిచ్చిన ఊపిరినే స్ఫూర్తిగా మార్చుకునే శక్తినివ్వు! కర్తవ్య పాలనలో, బాధ్యతల నిర్వహణలో (గృహపరంగా, సమాజ పరంగా) భావశుద్ధినిచ్చి ధర్మసిద్ధినీ కలిగించు. మహిళాలోకానికి ఈ సేవాపరంగా చైతన్యాన్నిచ్చి వారిని అనుగ్రహించు. అణిమాధి సిద్ధులు కూడా నీ ఆజ్ఞానుసారం వచ్చి ఇక్కడ నా ఇంట్లో స్థిరపడుదురుగాక! ఈ ప్రయత్న సంకల్పమే నావంతు. ఫలితం నీ కుడికంటి కరుణ. ఈ క్షణం నుండి అన్నీ నీవే జరిపించు కోవాలి. నీ కాలగమన పరమార్థం నీ భక్తులను ఆదుకోవడమే గదా! నీ స్మరణతో నీ ధ్యానంతో నిన్నే ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. అలంకృతవు కావడానికి వైకుంఠాన్ని దిగిరా తల్లీ! నా హృదయ పీఠం మీద కూర్చో.

త్రిగుణాత్మక స్వరూపిణి

నన్ను నాతోపాటు నీ భక్తులనూ పరిపాలించు, మురిపించు. మనోవాక్కాయ కర్మణలను ప్రక్షాలన చేసి నీ పూజార్హతనిచ్చి పునీతులుగా మమ్ములను దీవించు. నీ చల్లని నీడలో ఎలా పరిపాలించబడినా మా కిష్టమే. ఇక నుండి ఇదే నీ సంచాలనం కావాలి. నీవే నా తాపత్రయం అయినపుడు నా ప్రయత్న ఫలితం కూడా నీవే గదా! పూర్ణఫలంగా 'హ్రీం'కార రూపంతో నీవే సాక్షాత్కరించినపుడు నాకింకా ఏమి కావాలి తల్లీ! నాతో సహా నిన్ను దర్శించిన వారందరినీ సుమంగళులుగా దీవించు. నీ స్నేహహస్తాన్ని అందించు. నన్ను ఉద్ధరించి నీ మిత్రధర్మాన్ని చాటుకో! నీవే మా అభివృద్ధికి సూర్యవర్చస్సులా ప్రకాశించాలి. అన్ని చక్రాలూ ఒకదాని తర్వాత ఒకటి దాటి త్రికోణాంతర దీపికగా నీ సన్నిధిలో హృల్లేఖ స్వరూపానికి నన్ను దాసినిగా చేసుకుంటానని మాటఇవ్వు. ఇదే నన్ను అనుగ్రహించిన గ్రహగమనం కావాలి.

దుర్లభమైన నీ అనుగ్రహంతో నన్నూ, నా జన్మభూమిని సుభిక్షంగా మార్చి, ప్రజలందరికీ నీ అనుగ్రహ ఆనందాన్ని ప్రసాదించు. సకల జీవకోటిని నీ కంటిచూపుతో శాసించు. నీ చూపు కాంతి కిరణమై మమ్ములను తాకేలాగా చేయి. అదే నా ఈ వ్రతానికి ఫలితం, సార్థకం.

నా భక్తి కవచానికి ఆ భువనేశ్వరీదేవి మంత్ర మహిమను పెంచి, సాకారమిచ్చిన రూపమే ఈ వరలక్ష్మీ వ్రతం.

॥ సర్వేజనా సుఖినోభవంతు ॥



–సి. విజయలక్ష్మీ రాజు

ప్రజా సంక్షేమ బడ్జెట్ బీజేపీ ధ్యేయం

విజయక్రాంతి, నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై దేవరకొండలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెజవాడ శేఖర్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెజవాడ శేఖర్ మాట్లాడుతూ ప్రజా ఆమోద్యయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడంతో దేశ ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ నరేంద్రమోడి ప్రధాన మంత్రిగా ఎంపిక కావడం ఖాయం అని ఆయన అన్నారు.

నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు



- 2 డిపోల్లో చార్జింగ్ స్టేషను
- తొలి విడతగా 40 బస్సులు

విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్ రోడ్లపై మరో రెండు రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీయనున్నాయి. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు గ్రేటర్లో దశలవారీగా ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చేలా టీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 5న 40 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించే దిశగా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే నగరంలో ట్రయల్‌రన్స్ ప్రారంభించిన అధికారులు ఎలక్ట్రిక్ బస్సుల పనితీరును పూర్తిస్థాయిలో పరిశీలించారు. గ్రేటర్లో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెంచుకునే దిశగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2019 చివరి నాటికి 500 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అద్దె ప్రాతిపదికన మొదట ఎలక్ట్రిక్ బస్సులను నగరంలో నడుపుతోంది. ఏసీ బస్సుల చార్జీలనే ఎలక్ట్రిక్ బస్సుల్లో అమలు చేయనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. .

2 డిపోల్లో చార్జింగ్ స్టేషన్లు

ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకొస్తున్న ఆర్టీసీ వాటికి తగినట్లుగా చార్జింగ్ స్టేషన్లు సిద్ధం చేసింది. మియాపూర్ 2 డిపో, కంటోన్మెంట్ డిపోలో చార్జింగ్ స్టేషన్లను చార్జ్ చేశారు. ఒక్క డిపోలో 1012 బస్సులకు ఒకేసారి చార్జింగ్ చేసుకునేలా చార్జింగ్ పాయింట్లు సిద్ధం చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లోనూ ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్ బస్సుకు 4గంటలు చార్జింగ్ చేస్తే 300 కిలో మీటర్లు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

నేటి నుంచి మోకాళ్ల మొక్కు యాత్ర



విజయక్రాంతి, మిర్యాలగూడ: మిర్యాలగూడ నుంచి చెర్వుగట్టు వరకూ మోకాళ్ల మొక్కు యాత్ర చేయనున్నట్లు టీఆర్‌ఎస్ నాయకులు సరికొండ రుషి కేశ్వర్‌రాజు తెలిపారు. ఆదివారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారం చేపట్టాలని, ఎమ్మెల్యేగా భాస్కర్‌రావు గెలవాలని, అలా జరిగితే చెర్వుగట్టు వరకూ మోకాళ్లపై యాత్ర చేస్తానని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆ మొక్కు తీర్చుకోనున్నట్లు చెప్పారు. ఈ యాత్రకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్‌గౌడ్, సరస్వతి, వేణు, మురళీయాదవ్, శివ, అమీర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

గంజాయి మాఫియా దిష్టిబొమ్మ దహనం

విజయక్రాంతి, రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పెట్రేగిపోతున్న గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, యువతను కాపాడాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో నిరసన చేపట్టింది. గంజాయి మాఫియా దిష్టిబొమ్మను సంఘ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఈ మాఫియాలో కొందరు అక్రమార్జన కోసం యువతను గంజాయికి బానిసలు చేస్తున్నారన్నారు. వారి జీవితాలను నాశనం చేస్తున్నారని అన్నారు. ఈ మాఫియా ఆగబాలను పోలీసు అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు మద్దెల దినేశ్, విజయ్, ప్రీతం, రాంచంద్ర, బలరాం, రాము, లెనిన్, మహేశ్, శ్రీనివాస్, సాగర్ తదితరులు ఉన్నారు.

లోక్‌సభపై బీజేపీ కసరత్తు

- 5న గడ్కరీ
- 13న అమిత్ షా రాక
- 11 నుంచి నిధి సేకరణ
- మార్చి 2న బైక్‌ర్యాలీ



విజయక్రాంతి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ తెలంగాణ శాఖ దృష్టి సారించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదురుకావడంతో లోక్‌సభ ఎన్నికల్లో ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తంపై పార్టీ కార్యాలయంలో కోర్‌కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వచ్చిన లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్, కర్ణాటక ఎమ్మెల్యే అరవింద్ లింబావళి దిశానిర్దేశం చేశారు. పార్టీకి బలమైన శక్తిగా ఉన్న బూత్ కమిటీల సమావేశాలు నిత్యం జరిగే విధంగా చూడాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. పార్టీ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యయ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 11 నుంచి వచ్చే నెల 2 వరకూ రూ. 50 నుంచి రూ.1000 వరకూ కార్యకర్తలు, అభిమానుల నుంచి పార్టీ నిధిగా సేకరించాలన్నారు. మార్చి 2న రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కే లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్‌రావు, నల్లు ఇంద్రసేనారెడ్డి, జీ కిషన్‌రెడ్డి, యెండెల లక్ష్మీనారాయణ, మంత్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

5న గడ్కరీ, 13న అమిత్ షా

లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ నెల 5న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ హైదరాబాద్‌కు వస్తున్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాలకు సంబంధించిన క్లస్టర్ సభలో ఆయన పాల్గొంటారు. అదే విధంగా 13న నిజామాబాద్‌లో జరిగే క్లస్టర్ సమావేశానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హాజరవుతున్నారు. ఈ సభలో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, జహీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన బూత్ స్థాయి కార్యకర్తలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పాల్గొంటారు. కాగా ఈ నెల 10 లేదా 11న కేంద్రమంత్రి స్మృతి ఇరాని వచ్చే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి.

400 సీట్ల లక్ష్యం– దత్తాత్రేయ

లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400 సీట్లు సాధించాలన్న లక్ష్యంతో నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎంపీ బండారు దత్తాత్రేయ తెలిపారు. నవభారత నిర్మాణం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ అంశాలకే ప్రాధాన్యముంటుంది కాబట్టి.. ప్రజలు బీజేపీని ఆదరిస్తారని నమ్మకముందని ఆయన తెలిపారు.

ఆదర్శ రైల్వే స్టేషన్‌గా మౌలాలి



- మెరుగైన అదనపు సౌకర్యాలు

విజయక్రాంతి, హైదరాబాద్: మౌలాలి స్టేషన్ రైల్వే స్టేషన్‌ను ఆదర్శ స్టేషన్‌గా తీర్చిదిద్దారు. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వే మెరుగైన అదనపు సౌకర్యాలను సమకూర్చింది. మౌలాలి స్టేషన్ నాన్ సబర్బన్ గ్రేడ్ – 5 కేటగిరీకి చెందిన ముఖ్యమైన స్టేషన్. సికింద్రాబాద్ డివిజన్‌కి చెందిన ఈ స్టేషన్ రద్దీగా నిత్యం రద్దీగా ఉండే సికింద్రాబాద్ – కాజీపేట సెక్షన్‌లో ఉంది. ఇటీవలి కాలంలో ఈ స్టేషన్ పరిసర ప్రాంతాలలో అధిక జనాభా గల కాలనీలు ఏర్పడి వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రతి రోజు సగటున 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, పలు ప్యాసెంజర్ రైళ్ల ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 2500 మంది ఈ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్నారు.

పెరుగుతున్న రైలు ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.3.5 కోట్లు ఖర్చు చేసి వారి కోసం వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో మౌలాలి రైల్వే స్టేషన్ ఆదర్శ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చెందింది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఆదర్శ స్టేషన్‌గా రూపొందించే పనులు మంజూరు చేశారు.

మౌలాలిలో అభివృద్ధి చేసిన సౌకర్యాలు

- అభివృద్ధి చేసిన స్టేషన్‌ను సుందరీకరించారు
- ప్రయాణికులు వేచి ఉండే గది
- వికలాంగులు, ఇతర ప్రయాణికులకు ప్రత్యేక పార్కింగ్
- పార్కింగ్ స్థలం నుండి స్టేషన్ భవనం వరకు చక్కని రహదారి
- వికలాంగులు, వృద్ధుల ప్రవేశానికి ర్యాంపులు
- ఆధునిక, అందమైన సూచికల బోర్డులు
- పే అండ్ యూజ్ టాయిలెట్లు
- ప్లాట్ ఫారాల ఉపరితల నేల అభివృద్ధి
- ప్లాట్ ఫారాల గోడలపై అందమైన ప్రకృతి దృశ్యాలు
- సరిపడిన తాగునీటి ఏర్పాట్లు
- బుకింగ్, విచారణ కార్యాలయాల అభివృద్ధి నిర్మాణంలో
- ఇప్పటికే అభివృద్ధి చేసిన వాటికి అదనంగా రూ.1.6 కోట్లతో నిర్మిస్తున్న పాదాచారుల వంతెన త్వరలోనే పూర్తి కానుంది. ఈ వంతెన చాలాకాలంగా వాయిదాలో ఉన్న ఈ ప్రాంత వాసుల డిమాండ్.

రూ.260 కోట్లతో నగర చెరువులకు మహర్దశ

- తొలి విడతలో 20 చెరువుల అభివృద్ధి
- రూ.20కోట్లతో బోయిని గూడ చెరువు పనులను ప్రారంభించిన మేయర్



విజయక్రాంతి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోని చెరువులను పరిరక్షించే కార్యక్రమంలో బాగంగా తొలివిడతలో రూ.260 కోట్లతో 20 చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు మేయర్ బొంతు రామ్మోహన్ వెల్లిడించారు. ఆదివారం రూ.20కోట్లతో హస్మత్ పేట బోయిని చెరువు పరిరక్షణ పనులను ఆయన ప్రారంభించారు. కృష్ణా బేసిన్ లోని 76.37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు లోతు 2.50 మీటర్లు. పరివాహక ప్రాంతం 20.20 చ,కి,మీ. నీటి నిలు సామర్థ్యం 48.76 క్యుసెక్కులు, కట్టపొడవు 600 మీ, చెరువు పరిధి 3,216 మీ. ప్రవాహ వచ్చే మార్గాలు మూడు ఉండగా, ఒక కతువ, ఒక తూము ఉన్నాయి.

తొలి దశలో చెరువులోకి వస్తున్న మురుగును మళ్ళించటానికి ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్లు,ఇతర నిర్మాణాలు చేపడతారు. రెండో దశలో పూడిక తీయటం, కట్టను పటిష్టం చేయటం, చెరువు చుట్టూ రక్షణ కంచె నిర్మాణం, చెరువులోకి నీళ్ల రావటానికి, వదలటానికి మార్గాలను నిర్మించటం, సందర్శకులకు సదపాయం కోసం ఒక పుటోవర్ బ్రిడ్జ్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేస్తారు. ప్రవేశం, నిష్క్రమణం కోసం ప్రత్యేక ద్వారాలు నిర్మిస్తారు. చెరువు వద్ద ఆహ్లాదంగా గడపటానికి బోటింగ్, ఆటస్థలం, యోగా కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఇతర సుందరీ కరణ పనులు ప్రతిపాదనలో ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారమందించాలి



విజయక్రాంతి, మిర్యాలగూడ : గ్రామాభివృద్ధికి సహకారమందించాలని ఆలగడప సర్పంచ్ చెన్నబోయిన శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆలగడప ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నిమ్మల వీరమ్మ ముత్తయ్య, ప్రస్తుత సర్పంచ్ సర్పంచ్‌ల అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా నిరుద్యోగ యువతకు గ్రంథాలయ నిర్మాణం చేపడతానని, అట్టి గ్రంథాలయానికి తమ వంతు సహకారమందించాలని కోరారు. గ్రామాభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఈఎ అధ్యక్షులు ఇంద్రపల్లి లక్ష్మయ్య, ఉప్పల సురేందర్, నర్సింహా, అమరారపు సైదయ్య, ప్రశాంత్, గ్రామస్తులు భవాని, రామన్న, ఎంపీటీసీ సత్యప్రసాద్, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

విజయక్రాంతి, మిర్యాలగూడ: ప్రణాళికాబద్ధంగా చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆర్డీవో జగన్నాధరావు కోరారు. విజేత డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షల ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు ఈ కోచింగ్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. పోటీ ప్రపంచంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండి ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని కోరారు. ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఉచిత శిక్షణనందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవోను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తెడ్ల మధుకర్, నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, కొండలు, అధ్యాపకులు శేఖర్, వీరశేఖర్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో మానవీయత



విజయక్రాంతి, రామగుండం: సేవా ధృక్పదమే మానవీయతను ఆవిష్కరిస్తుందని పలువురు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని స్వచ్ఛంద సంఘాలు ఏర్పాటు చేసుకున్న ఐక్య వేదిక సమావేశం ఆదివారం గోదావరిఖనిలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...సామాజిక సేవా కార్యక్రమాలు సమాజంలో మంచిని నెలకొల్పుతుందన్నారు. ప్రతి ఒక్కరిలో ఈ సంకల్పం ఆపదలో ఉన్నవారికి అపన్నహస్తం అందిస్తుందన్నారు. ఒకే వేధికగా ఏర్పాటైన ఐక్యవేదిక కార్మిక ప్రాంతంలో సామూహిక కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఐక్య వేదికకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, చీఫ్ ప్యాట్రన్‌గా పెంట రాజేశ్, అధ్యక్షులుగా ఎండి.రహ్మత్‌పాష, ఉపాధ్యక్షులుగా ఆడెపు కవిత, గోషిక శ్యాం, ప్రధానకార్యదర్శిగా పల్లెర్ల రమేష్‌గౌడ్, సమన్వయ కర్తగా చాతబోయిన శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురభి శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా ఇందారపు సునీత, మాతంగి కనకరాజు, గౌరవ కార్యవర్గ సభ్యులుగా దామెర శంకర్, మాలిక్, లింగమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలు స్వచ్ఛంధ సంఘాల బాధ్యులు పిఎస్.అమరేందర్, గడ్డం శ్యాంకుమార్‌గౌడ్, ముల్కల ప్రసాద్, నరేశ్, రఘుసింగ్, జమీల్, సనత్‌కుమార్, వాహిద్, రహ్మాన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మంథనిలోని మహాలక్ష్మీ ఆలయంలో సహస్ర దీపాలంకరణ, అమ్మవారికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. విజయక్రాంతి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి విజయా రాజం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



- 7 వేల మందితో అవేర్‌నెస్ రన్

విజయక్రాంతి, హైదరాబాద్: క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పలువురు వైద్యులు, నటులు, ప్రముఖులు సుచించారు. యశోద హాస్పిటల్స్ – యశోద క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నగరంలో ఏడు వేల మందితో క్యాన్సర్ అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో సినీ హీరో నవదీప్, యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, మెడికల్ డైరెక్టర్ లింగయ్య, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, మెఇడకల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వి.కె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసుపత్రులు చికిత్సలకే పరిమితం కాకుండా ముందస్తు నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. వేలాది మందితో జరిగిన అవగాహనా 5కె రన్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు వైద్యులను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

సరైన సమయంలో సరైన చికిత్స ముఖ్యం: డాక్టర్ విశేష్

క్యాన్సర్‌కు సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోవడం ముఖ్యమని గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ విశేష్ తెలిపారు. సోమవారం వరల్డ్ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ప్రజల్లో అవగాహన లేకపోవడంతో రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 లక్షల 75 వేల క్యాన్సర్ కేసులో ఉండగా ప్రతి సంవత్సరం దాదాపు 50 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయన్నారు. మహిళల్లో 40 శాతం రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లతో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పొగాకు వాడకాన్ని మానివేయాలని ఆయన సూచించారు. కాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని విశేష్ సూచించారు.



ముషీరాబాద్ నియోజకవర్గంలోని పద్మశాలి సంఘం సభ్యులు ముషీరాబాద్ టిఆర్ఎస్ శాసన సభ్యులుగా గెలుపొందిన ముఠా గోపాల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామ్ నగర్ కార్పొరేటర్ మరియు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ వి శ్రీనివాస్ రెడ్డి, మరియు సిల్వర్ విశ్వనాథ్, మంతిని దశరథ్, నరహరి, ఆర్ మోజెస్, ముచ్చ కుర్తి ప్రభాకర్, డిటి రామచందర్, ప్రకాష్ రెడ్డి, సీనియర్ తెరాస నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. –విజయక్రాంతి, ముషీరాబాద్

నరేంద్రమోదీ నాయకత్వం వైపే దేశ ప్రజలు



విజయక్రాంతి, నల్లగొండ: ప్రధానమంత్రి సమ్మాన్ నిధి ద్వారా పేద రైతులకు ఎకరానికి 6 వేల రూపాయలు ఇవ్వడం హర్షించదగ్గ విషయం అని బిజెపి జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం గడియారం సెంటర్‌లో బిజెపి ఆద్వర్యంలో నరేంద్రమోడి చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రభుత్వం ఓటాన్ బడ్జెట్‌లో దేశంలో ఉన్న పేద రైతులకు నేరుగా ఖాతాలోకి సొమ్ము బదిలీ చేయడం ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు వరాలు ప్కటించడం అభినందనీయం అని ఇది సామాన్యుడి బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని నరేంద్రమోడి నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందని దీంతో నిరుద్యోగులకు మేలు జరిగిందన్నారు. రైతుల కోసం పంట పెట్టుబడి కోసం సాయం అందిస్తున్నారని చెప్పారు. అనంతరం నల్లగొండ మండలం చిన్న మాదారం గ్రామంలో నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, గడ్డం అశోక్, పట్టణ కార్యదర్శి పెరిక మునికుమార్, చందనపల్లి లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జీహెచ్‌ఎంసీ కార్మికురాలి మృతి

విజయక్రాంతి, హైదరాబాద్: నగరంలోని సంజీవరెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జీహెఎంసీ మహిళా కార్మికురాలు మృతి చెందింది.

విధుల్లో ఉన్న మహిళా కార్మికురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెరగాలి

విజయక్రాంతి, హైదరాబాద్: రోడ్డు భద్రతపై పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరముందని కిమ్స్ వైద్యులు సూచించారు. కిమ్స్ హాస్పిటల్ న్యూరోసర్జరీ, ప్లాస్టిక్ రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం ముఖంపై చోటు చేసుకునే గాయాలు (క్రానియోఫేసియల్ ఇంజ్యూరీస్) అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్లు మానస్ పాణిగ్రహీ, కృష్ణారెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ హేమంత్‌కుమార్, కిమ్స్ హాస్పటల్స్ సీఈఓ డాక్టర్ భాస్కర్ రావు తదితరులు మాట్లాడుతూ, రేపటి తరానికి నేడు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1,50,000 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని, దాదాపు 5 లక్షల మంది అనారోగ్యం పాలౌతున్నారన్నారు. మృతుల్లో ఎక్కువ మంది 15 నుంచి 29 వయస్సులోపు వారుంటున్నారన్నారు.

హత్యకేసును ఛేదించిన పోలీసులు

విజయక్రాంతి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యకేసును పోలీసులు ఛేధించారు. మద్యానికి బానిసైన భర్త వేధింపులు తట్టుకోలేక కుటుంబసభ్యులతో కలిసి భార్య హత్య చేసింది. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. శామీర్‌పేట మండలం అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన బోణి శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన స్వప్నతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కూలిపని చేసే శ్రీనివాస్ మద్యానికి బానిసై తరచూ భార్యను వేధిస్తున్నాడు. దీంతో శ్రీనివాస్ అడ్డు తొలగించుకోవాలని అనుకున్నారు. స్వప్న మేనమామ తీగళ్ల యాదగిరి అతడి స్నేహితుడు రమేష్ ఆమె తల్లి లక్ష్మి, తండ్రి మల్లేశం కలిసి హత్యకు ప్లాన్ వేశారు. గత నెల 29న యాదగిరి, రమేష్ శ్రీనివాస్‌కు మద్యం తాగించి ధర్మవరం ప్రాంతంలోని రవలకోలు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యం మత్తులో ఉన్న శ్రీనివాస్‌ను హత్య చేసి మృత దేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. శ్రీనివాస్ కనిపించకపోవడంతో ఇతడి తల్లి శామీర్‌పేట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు సంఘటనా స్థలంలో దొరికిన ఓ మద్యం సీసా మూతతో కేసును ఛేధించారు. దానిపై ఉన్న బార్ కోడ్ ఆధారంగా పూడూరు వద్దనున్న జై దుర్గ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసినట్లు తేల్చారు. అక్కడి సీసీటీవీ పుటేజ్‌ను పరిశీలించగా మృతుడు శ్రీనివాస్‌ను యాదగిరి, రమేష్, బైక్‌పై తీసుకెళుతున్నట్లు బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించారు. దీంతో శ్రీనివాస్ భార్య స్వప్న, అత్త మామలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

- సీపీఎం నియోజకవర్గ స్థాయి సమావేశంలో జూలకంటి

విజయక్రాంతి, మిర్యాలగూడ: నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ఏజెండాగా పని చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లి ఎస్ఎన్‌డీ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజాయితీపరులకు ఓట్లు రాలేదని, సంతలో కొనే విధంగా కార్పొరేట్ రాజకీయాలు డబ్బు, మద్యం పంపిణీ చేసి ఓట్లను కొన్నారని ఆరోపించారు. గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చాలన్నారు.

గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. స్వార్థం కోసం పార్టీలు వీడే వారందరూ నిజమైన కమ్యూనిస్టులు కాదని, కష్టాల్లో పార్టీలోనున్న వాడే నిజమైన కమ్యూనిస్టు అన్నారు. అవినీతి, కార్పొరేట్ రాజకీయాలకు స్వస్తి చెప్పేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలని, ఆ దిశగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక పథకాలు ప్రవేశపెట్టి ఓట్లు దండుకోవాలన్నారు. కనీస నైతిక విలువలు, ప్రజాస్వామ్య విలువలు పాటించకుండా ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ రూపంలో తీసుకున్న రూ.10 వేల కోట్ల ధనాన్ని కేసీఆర్ ఎన్నికల్లో పోలీసుల సహకారంతో పంపిణీ చేసి ఓట్లు కొని అధికారం చేపట్టారని విమర్శించారు. ప్రజల అభిప్రాయాలకను గుణంగా భవిష్యత్తు లో కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. వచ్చే పార్లమెంటు, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు డి. మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాలి పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, రాంమ్మూర్తి, రవినాయక్, మహ్మద్‌బీన్‌సయీద్, మల్లు గౌతమ్‌రెడ్డి, జగదీశ్‌చంద్ర, గాదె పద్మ, ఊర్మిళ, సీతా రాములు, బీబమ్మ పాల్గొన్నారు.

సంస్కృతి, సంస్కారానికి ప్రతీకగా యాదాద్రి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధి చేపడుతున్న పనులను తెలియజేశారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యాల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని,అభివృద్ధి పనులకోసం 173 ఎకరాల భూమిని గుర్తించామని, అందులో 30 ఎకరాల్లో స్వామి వారి పుష్కరిణి ని అభివృద్ధిచేస్తామన్నారు. ఈ కోనేటిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారని,సమీపంలోని గండిపేట చెరువు నిర్మాణం జూన్ నెలనాటికి పూర్తి అవుతుందని, అక్కడ నుంచి వచ్చే మంచి నేటితో స్వామివారి పుష్కరణి భక్తులకు అందుబాటులో ఉంటుందని సీఎం వివరించారు. మిగిలిన 143 ఎకరాల విస్తీర్ణంలో భక్తులకు అవసరమైన కర్యాలు, అన్నదాన సత్రం, ఇతర ప్రాంతాలనుంచి వచ్చే పీఠాధిపతులు, స్వామీజీలు నివాసం ఉండటానికి మ ఠం నిర్మిస్తామన్నారు. అలాగే భక్తులకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతి సముదాయాలను నిర్మాణం చేపడతామని, ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదంగా ఉండే విధంగా తీర్చి దిద్దుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

ఆలయ ప్రతిష్టకు ముందు మహాయాగం

ఆలయ పునర్నిర్మాణం చాలా ప్రణాళికతో, ఆగమ శాస్త్రాల అనుగుణంగా జియ్యర్ ట్రస్టు స్వామిజి చిన్నజియ్యర్ స్వామి సూచనలు సలహాల ప్రకారం అభివృద్ధికార్యక్రామాలు అమలు జరుగుతూన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. అన్ని నిర్మాణాలు పూర్తి అయినా తరువాతే శాస్త్రోక్తంగా ప్రతిష్ట జరుగుతుందన్నారు. అయితే ఈ కార్యక్రం ఎప్పుడనేది ప్రచారం చేయవద్దన్నారు. తానే ఇక్కడికి వచ్చి ప్రతిష్ట జరిగే సమయాన్ని ప్రకటిస్తానని కేసీఆర్ అన్నారు. మరో పది,పదిహేను రోజులలో ఇక్కడికి మళ్ళీ వస్తానని, అప్పుడు చిన్నజియ్యర్ స్వామిజి కూడా వస్తారని, నిరంతరం స్వయంగా సమీక్ష జరుపుతానని సీఎం తెలిపేరు. ప్రతిష్ట జరగడానికి ముందు చిన్నజియ్యర్ స్వామి ఆధ్వర్యంలో మహాయాగం జరుగుతుందన్నారు. బదిరీనాథ్‌కు చెందిన రుత్వికులు కూడా పాల్గొంటారని, ప్రధాన వేదపండితుల సహాయకులతో కలిసి మొత్తం 10 నుంచి 15 వేల మంది రుత్వికులు దీన్లో పాల్గొంటారని కేసీఆర్ వివరించారు.

ప్రతిష్ట సమయంలో సుమారు ఐదు నుంచి 15 లక్షల మంది ప్రజలు హాజరు అయ్యే అవకాశం ఉందన్నారు. ఉద్యమ సమయం నుంచే మన దేవాలయాలు అభివృద్ధి జరగాలని ఆకాంక్ష ఉందని 18 అష్టాదశ శక్తీ పీఠాలలో ఒకటి మన రాష్ట్రంలో ఉందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జోగులాంబ ఆలయం అని తెలిపారు. కృష్ణా పుష్కర స్నానం అక్కడే ఆచరించానని ఆయన గుర్తు చేశారు. ఇక్కడికి సమీపంలోని బస్వాపూర్ వద్ద 265 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, దానిలో 250 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ ను నిర్మిస్తామని,ప్రపంచ స్థాయి సౌకర్యాలతో దీనిని నిర్మిస్తామన్నారు.



అన్నదాన సత్రం కోసం రాజు వెగెస్నా రూ. 10 కోట్ల విరాళం

యాదాద్రిలో అన్నదాన సత్రం నిర్మించడం కోసం హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజు వెగెస్నా ఫౌండేషన్ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్ కు రూ.10 కోట్ల విరాళం అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అనంత కోటి రాజు, కార్యద ర్శి ఆనందర రాజుల ఆధ్వర్యంలో యాదాద్రిలో ముఖ్యమంత్రిని కలుసుకున్న సభ్యులు చెక్కు రూపంలో విరాళం అందించారు. అన్నదాన సత్రం నిర్మాణానికి ఇంతకంటే ఎక్కువ వ్యయం అయినా భరిస్తామని వారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. యాదాద్రిలో సత్రాలు, గెస్ట్ హౌస్‌లు నిర్మించడానికి చాలా మంది దాతలు ముందుకు వస్తున్నారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికి 43 మంది దాతలు తలా రూ.2 కోట్లు ఇవ్వడానికి ముందుకొచ్చారన్నారు. వారందరికీ సిఎం ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎంపీలు జె.సంతోష్ కుమార్, బూర నర్సయ్య గౌడ్, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, పైళ్ల శేఖర్ రెడ్డి, గ్యాదరి కిశోర్, మర్రి జనార్ధన్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీలు క్రిష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు, కలెక్టర్ అనితా రామచంద్రన్, రాచకొండ సిపి మహేశ్ భగవత్, ఆలయ ఈవో గీత తదితరులున్నారు.

జీహెచ్‌ఎంసీ వైఫల్యం నగరంలో నాసిరకం మాంసం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రక్రియ ప్రకారం ఉత్పత్తి చేసిన మాంసానికి స్టాంప్ వేసిన తరువాతే మార్కెట్ కు తరలించాలి. దీన్ని స్టాంప్‌డ్ మాంసం గా పేర్కొంటారు. కాని చాలావరకు మార్కెట్లో స్టాంపు లేకుండానే మాంసాన్ని విక్రయిస్తున్నారు. గతంలో గ్రేటర్ ప్రజలు ఈ స్టాంపును చూసి మాంసం నాణ్యతను సులబంగా గుర్తించేందుకు వీలుండేది. కాని ఇటీవల ఈ విధానం సక్రమంగా అమలు కాకపోతుండటంతో ఏది ఆరోగ్యకరమైందో, ఏది అనారోగ్యకరమైందో వినియోగదారులు తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కాని ఈ ప్రక్రియ మొత్తం ఓ ప్రహసనంలా తయారు కావటంతో నగర ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసం అందటంలేదనే ఆరోణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో మాంస ప్రియులు మాంసాహానికి దూరం అవుతున్నారు. ప్రోటీన్లు ఎక్కువగా అవసరమైన వారికి మాంసాహారం అలవాటు ఉన్నవారికి మాంసాన్ని తీసుకోవాలని సూచించటం జరుగుతుంది. పిల్లల ఎదుగుదలకోసం మాంసాహారాన్ని అందించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుంటారు. క్రీడాకారులు, ఎక్కువ శారీరక శ్రమ చేసేవారు, కార్మికులు, కర్షకులు, కూలీలు వారంలో ఒకసారి తప్పనిసరిగా మాంసాహారం తీసుకుంటారు. వీరందరికి ఆరోగ్యకరమైన మాంసం అందేవిదంగా చూడటం జీహెచ్‌ఎంసీ బాధ్యత. దాంతో దీని పరిదిలో కబేళాలు ఉంటాయి. ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందించే క్రమంలో జీహెచ్‌సీకి సైతం వివిధ రూపాల్లో ఆదాయం వస్తుంది. మాంసం తీసి అమ్మేవారికి జీవనోపాధిగా ఉంటుంది. దాంతో ఏటా ఈ రంగంలో కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. కాని వాటిపైన నియంత్రణ మాత్రం సరైన రీతిలో లేకపోవటంతో దళారుల రాజ్యంగా తయారైంది. ఈ రంగం ఇంతగా వృద్ధి చెందటానికి, ప్రోటీన్లు మాంసంలో సమృద్ధిగా ఉండటమే కారణం. కాని ఇప్పుడున్న పరిస్థితిలో ఈ నిబంధన పాటించాలనుకునే వారు సైతం వెనకడుగువ వేసే పరిస్థితి. నగరంలో నాణ్యమైన మాంసం దొరకక పోవడంతో గతంలో వారానికి ఒకటి, రెండు సార్లు మాంసాహారం తీసుకునే వారు క్రమంగా నెలకోసారి నామమాత్రంగా తీసుకునే పరిస్థితి వస్తోందని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు.

వెటర్నరీ విభాగం వైఫల్యం: జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం నగర ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసం అందించేందుకు పశు వైద్యులతో ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేయటం జరిగింది. ఇందులో కేంద్ర స్థాయిలో డైరెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది. క్షేత్ర స్థాయిలో అసిస్టెంట్ డైరెక్టర్లు ఉంటారు. వీరు నగర వధశాలల వద్దకు వచ్చే మేకలు, గొర్రెలు, గొడ్లు, చికెన్ సెంటర్లలోని కోళ్లను,చేపలను పరిశీలించి, అవి ఎలాంటి జబ్బులతో లేకుండా ఆరోగ్యకరమైన స్దితిలో ఉన్నాయా లేవా అనే విషయాన్ని ధృవీకరించాలి. వాటిని వదించి మాంసం తీసే పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. ఆ తరువాతే వాటి వధించి మాంసాన్ని మార్కెట్లకు తరలించాలి. వీటికోసం నగరంలో గతంలో జియాగూడ, అంబర్ పేట, బోయిగూడ, గౌలిపురా, రాంనాస్ పురా ప్రాంతాల్లో ప్రభుత్వ జంతు వధశాలలు ఏర్పాటయ్యాయి. కాగా అవి శిధిలావస్థకు చేరుకొని కాలుష్య పూరితంగా మారటంతో పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. దాంతో ప్రభుత్వం చర్లపల్లిలో ప్రవేటు బాగస్వామ్యంతో ఆధునిక వధశాలను నిర్మించింది. కాగా ఇది నగరంలోని వధశాలల కార్మికులకు, వ్యాపారులు, దుకాణాదారులకు దూరంగా ఉండటంతో ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. వారి జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని పాత వధశాలల స్థానంలో ఆధునిక వధశాలలను నిర్మించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

పూర్తి కాని ఆధునిక కభేళాలు: దాంతో గత ఐదు పాత వధశాలల స్థానంలో ఆధునిక స్లాటర్ హౌస్ లు నిర్మించ తలపెట్టినా వాటిలో రూ.69 కోట్లతో బోయిగూడ, అంబర్ పేట, రామ్‌నాస్ పురాలో మాత్రమే పూర్తికాగా మిగతా చోట్ల పనులు నత్తన నడకన సాగుతున్నాయి. మరోవైపు ఇదే అదనుగా ప్రైవేటు స్లాటర్ హౌస్ లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అక్రమంగా జంతువులను వధించి మాంసాన్ని అమ్ముతూ సొమ్ము చేసుకుంటుండటంతో ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకం అవుతోంది. అంతేగాక నగరపాలక సంస్థకు ఫీజుల రూపంలో రావాల్సిన ఆధాయానికి సైతం గండి పడుతోంది. ఇంత జరుగుతున్నా సంభంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్ల వ్యవహరించటం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లు తీసుకొని నామమాత్రంగా దాడులు జరిపి, జరిమానాలతో సరిపెడతున్నారని బాహాటంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వీరికి కొందరు రాజకీయ నేతలు మధ్యవర్తులు గా వ్యవహరిస్తూ సహకరిస్తున్నట్లు సమాచారం. దాంతో మొత్తంగా నగరంలో మాంసాహారులు ఆరోగ్యకరమైన మాంసమేదో తెలియక, దొరికిన మాంసంతో సరిపెట్టుకొని అనారోగ్యాల పాలవుతున్నట్లు వాపోతున్నారు. భారీయెత్తున ఈ వ్యవహారం జరుగుతున్నా మొక్కుబడి దాడులు జరుపుతున్నారని చెప్పడానికి గత మూడేళ్లలో వారు నమోదు చేసిన కేసులను చూస్తే తెలుసుకోవచ్చు. 2017 నుంచి 2019 వరకు మూడేళ్లలో నమోదైన కేసులు 4,959 మాత్రమే. ఈ దాడుల్లో స్వాదీనం చేసుకున్న అక్రమ మాంసం మటన్ 8268 కిలోలు, బీఫ్ 23,619 కిలోలు. ఒకటో ఎం.ఎం కోర్టు ఈ కేసులను విచారించి రూ.6,42,022 ల జరిమానా విధించటం జరిగింది. ఆ తరువాత షరామామూలే . అక్రమ వ్యాపారం యధావిదిగా సాగుతూనే ఉంది. ఇప్పటికైన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మహావీర్ జయంతి, గాంధీ జయంతి, వర్థంతి రోజుల్లోనూ ఈ అక్రమం మాంసం వ్యాపారం యధేచ్ఛగా సాగుతూ చట్టాన్ని వెక్కిరిస్తోంది. గతంలో జరిపిన దాడుల్లో ఈ వ్యవహారం బయటపడిన తీరే ఇందుకు నిదర్శనం.

ప్రైవేటు కబేళాలకు అడ్డాగా పాతబస్తీ: జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండికొడుతూ, నాసి రకం మాంసంతో అక్రమార్జన చేసే ప్రైవేటు కబేళాలకు పాతబస్తీ అడ్డాగా మారిందని బలమైన ఆరోపణలున్నాయి. కొందరు రాజకీయనేతల అండదండలతో వీరి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. ప్రైవేటు కోల్డ్ స్టోరీజీలను సైతం వారు నిర్వహిస్తున్నారంటే వారి వ్యాపారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వీరు ఎక్కువగా హోటళ్లు, ఫంక్షన్లకు సరఫరా చేయటానికే మొగ్గు చూపుతుంటారని విశ్వసనీయంగా తెలిసింది.

నిషేదాజ్ఞలు బేఖాతరు

ఏడాదిలో మూడు రోజులు మాంస విక్రయాలపై నిషేదం ఉంటుంది. వాటిలో ఒకటి మహావీరుని జయంతి, జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, వర్థంతి రోజుల్లో అధికారికంగా నిషేదం ఉంటుంది. కాని అమలు జరిగిన దాఖలాలు మాత్రం లేవనే విమర్శలున్నాయి. పాతబస్తీలోనే ఈ పరిస్థితి ఎక్కవగా ఎదురవుతోందని తెలుస్తోంది.

న్యాయవ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఆధునిక టెక్నాలజీతో హైకోర్టును నిర్మించారని జస్టిస్ రంజన్ గొగొయ్ కొనియాడారు. ఏపీకి కొత్త హైకోర్టు రావడం ప్రజలందరికీ సంతోషకరమన్నారు. ప్రజల సంస్కృతి, ఆనందానికి హైకోర్టు ప్రతీకగా నిలుస్తుందన్నారు. రాజ్యాంగబద్ధమైన విధిని సీఎం చంద్రబాబు సకాలంలో నిర్వర్తించార ఆయన ప్రశంసించారు. ప్రతి ఏటా కేసుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. ఏడాదిలోపు 81 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండగా, పదేళ్లుగా 25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ తెలిపారు. కింది స్థాయి, జిల్లా స్థాయి కోర్టుల్లో 5 వేల ఖాళీలు ఉన్నాయన్నారు.

8 నెలల్లో జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనం నిర్మాణం

కాగా జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనం నిర్మాణాన్ని సీఆర్డీఏ ఎనిమిది నెలల రికార్డు సమయంలో పూర్తి చేసింది. రాజస్థాన్ నుంచి తెప్పించిన శాండ్‌స్టోన్‌తో తాపడం చే సి భవనాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. రాజధానిలోని న్యాయనగరంలో నిర్మించిన ఈ జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవనంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేస్తారు. శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక హైకోర్టును అందులోకి తరలిస్తారు.

రాజధాని డిజైన్లు పరిశీలించిన చీఫ్ జస్టిస్ గొగోయ్ దంపతులు

అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్ డిజైన్లను సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ దంపతులు పరిశీలించారు. ఈ సందర్భంగా అమరావతిలో నిర్మిస్తోన్న తొమ్మిది నగరాల గురించి గొగోయ్ దంపతులకు సీఆర్డీఏ కమిషనర్ వివరించారు. అలాగే హైకోర్టు ఐకానిక్ నమూనాను సీజే గొగోయ్, ఎన్వీ రమణ, చంద్రబాబు పరిశీలించారు. అమరావతి నగర నిర్మాణ డిజైన్లను నార్మన్ ఫాస్టర్ ప్రతినిధులు న్యాయమూర్తులకు వివరించారు.

పాలడుగును పరామర్శించిన హరీష్ రావు

విజయక్రాంతి, ముషీరాబాద్: టీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాలడుగు శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న హరీష్‌రావు ఆదివారం సికింద్రాబాద్ తార్నాకలోని తన సొంత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాస్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్‌రావు, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డిలు సందర్శించి పరామర్శించారు. శ్రీనివాస్ క్షేమ యోగక్షేమాలను అడిగి తెలుసుకొని వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట మహాజన మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మేరీ మాదిగ, ఎన్ఆర్ఐ జి. ప్రభాకర్, వివేక్ రెడ్డి, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

సింగరేణి అభివృద్ధి పనులను చేపట్టాలి

- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

విజయక్రాంతి, రామగుండం: మంథని నియోజకవర్గ పరిధిలోని కార్మిక ప్రాంతాల్లో సింగరేణి యాజమాన్యం అభివృద్ధి పనులను చేపట్టాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం యైటింక్లయిన్‌కాలనీలో ఆర్‌జీ–2 జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.నారాయణ మర్యాద పూర్వకంగా శ్రీధర్ బాబును కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఆర్‌జీ–2 ఏరియలో అభివృద్ధి చేయాల్సిన పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జానకి రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్లో బీసీలకు అన్యాయం

విజయక్రాంతి, మిర్యాలగూడ: కేంద్ర బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన రూ.27.84 లక్షల కోట్లలో 60 శాతం ఉన్న 70 కోట్ల మంది బీసీల సంక్షేమానికి కేవలం రూ.1270 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. బీసీ ప్రధానమంత్రిగా ఉన్న గత ఐదు సంవత్సరాలుగా బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో బిల్లు ఆమోదింపజేసిన కేంద్రం బీసీల కోసం ఒక పథకం ప్రవేశపెట్టడం గానీ నిధులు పెంచడం గానీ చేయకపోవడం బీసీలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. కేంద్రంలో బీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీలు కోరుతున్నప్పటికీ కనీసం కేంద్రం ఆ దిశగా ఆలోచించకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రీయ విద్యాసంస్థల్లో ఓబీసీ విద్యార్థులు సీట్లు వచ్చినా.. ఫీజులు చెల్లించలేక అడ్మిషన్లు పొందడం లేదని, యూనివర్శిటీల్లో చదివే విద్యార్థులకు ఫెలోషిప్‌లు కూడా మంజూరు చేయలేదన్నారు. ఆయన వెంట రమేష్, బంటు వెంకటేశ్వర్లు, కాకునూరి రామకృష్ణగౌడ్, రాంబాబుయాదవ్, నరేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం కోసమే.. మోదీ గొప్పల బడ్జెట్



(మొదటిపేజీ తరువాయి)

వస్తే పట్నా సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

బీహార్ ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రధాని నరేంద్ర మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన్ ఆక్రోశ్ ర్యాలీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజస్వీ మాట్లాడుతూ.. '2014లో బట్టతల ఉన్నవారికి మోదీ దువ్వెనలు అమ్మారు. జుట్టు లేకున్నా మాకు దువ్వెలు ఎందుకని వారు అడిగితే.. నేను అధికారంలోకి రాగానే మీకు జుట్టు తెప్పిస్తా అని మోదీ చెప్పారు. మోదీ మంచి సేల్స్‌మేన్ ' అని ఎద్దేవా చేశారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి దేశంలో లేదని, మోదీని ఎవరు నమ్మరని అన్నారు. మోదీ అసలు రంగును బీహార్ నిరుద్యోగులకు వివరించడానికి రాహుల్ ఇక్కడి రావడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిగా పోరాడుతామని తేజస్వీ తెలిపారు.

ఆ పోస్టర్లు మా పని కాదు

కాగా కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ర్యాలీకి ఒక రోజు ముందు ప్రధాని నరేంద్ర మోదీని మహిషాసురుడిగా, రాహుల్‌ను శివుడిగా వర్ణిస్తూ వెలిసిన పోస్టర్లపై కాంగ్రెస్ పార్టీ ప్రతిస్పందించింది. ఈ పోస్టర్లను కాంగ్రెస్ మద్దతుదారులే ఏర్పాటు చేశారని బీజేపీ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది.

రాహుల్‌ను రాముడిగా, ప్రియాంక గాంధీని దుర్గామాతగా అభివర్ణించే మరికొన్ని పోస్టర్ల ఏర్పాటు చేశారు. ఈ పోస్టర్లపై స్థానికుల ఫిర్యాదు మేరకు కోర్టులో కేసు నమోదు చేశారు. రాహుల్, బిహార్ కాంగ్రెస్ చీఫ్ మదన్ మోహన్ ఝాపై హిందువుల మనోభావాలను గాయపరిచారంటూ ఫిర్యాదు చేశారు. అయితే బీజేపీ నేతల ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఈ పోస్టర్లను కాంగ్రెస్ ఏర్పాటు చేయలేదని, ఎవరో రూపొందించిన పోస్టర్లపై తమను నిందించడం తగదని మదన్ మోహన్ ఝా వివరణ ఇచ్చారు. పార్టీ నేతలెవరైనా ఈ పోస్టర్ల ఏర్పాటు వెనుక ఉన్నట్టు తమ విచారణలో వెల్లడైతే వారిపై కఠిన చర్యలు చేపడతామని పార్టీ ఎమ్మెల్సీ ప్రేమ్ చంద్ర మిశ్రా వెల్లడించారు.

బెంగాల్‌లో హైడ్రామా

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత పత్రాలు ఉన్నాయా అంటూ ఆ రాష్ట్ర పోలీసులు ప్రశ్నించారు. తమకు వారంట్ చూపించాలని వారిని నిలదీశారు. అనంతరం సీబీఐ అధికారులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈనేపథ్యంలో సీబీఐ కార్యాలయం వద్ద భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. దీంతో తమ విధి నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆటంకాలు సృష్టిస్తోందని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ స్కామ్‌పై పోలీసుల తరుపున విచారణకు నేతృత్వం వహిస్తున్న కుమార్‌ను కేసులకు సంబంధించిన పత్రాల గల్లంతుపై ప్రశ్నించేందుకు సీబీఐ ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేసినా ఆయన స్పందించలేదని అధికారులు వెల్లడించారు. మరోవైపు ముగ్గురు సీబీఐ ఉన్నతాధికారులను బెంగాల్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. వీరిపై కౌంటర్ ఎఫ్ఐఆర్ దాఖలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యవహారాల్లో సీబీఐ జోక్యాన్ని నిషేధించిన రాష్ట్రాల్లో ఏపీ, కేరళతోపాటు బెంగాల్ కూడా ఉంది. అయితే ఓ రాష్ట్ర పోలీసులు, సీబీఐ మధ్య ఇటువంటి ఘర్షణ వాతావరణం నెలకొనడం ఇదే తొలిసారి. దీంతో గ వర్నర్‌ను ఆశ్రయించాలని సీబీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగ సంక్షోభం ఏర్పడినట్లు చెప్తూ జోక్యం చేసుకోవాలని కోరేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠిని సీబీఐ అధికారులు కలవనున్నట్లు సమాచారం.

రాజ్యాంగ పరిరక్షణకు తక్షణమే ధర్నా : మమత బెనర్జీ

సీబీఐ అధికారుల అరెస్ట్ నేపథ్యంలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసానికి చేరుకున్నారు. అనంతరం ఆమె కీలక అధికారులు, మంత్రులతో ఆంతరంగిక సమావేశం నిర్వహించారు. రాజీవ్ కుమార్ నివాసం నుంచి మమత బెనర్జీ మీడియాతో మాట్లాడారు. ఆయనను గట్టిగా సమర్థించారు. ప్రపంచంలోనే ఉత్తమ అధికారుల్లో కోల్‌కతా పోలీస్ కమిషనర్ ఒకరని ఆమె కొనియాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై మమతా బెనర్జీ మండిపడ్డారు. బీజేపీ చాలా నీచంగా రాజకీయ ప్రతీకారం తీర్చుకునే ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. వారి లక్ష్యం కేవలం రాజకీయ పార్టీలే కాదని, తమ అధికారాలను దుర్వినియోగపరుస్తూ పోలీసు వ్యవస్థను తమ అధీనంలో ఉంచుకోవాలని భావిస్తున్నారని, అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. వారి చర్యలను తాము ఖండిస్తున్నామన్నారు. దేశంలో ప్రస్తుతం అత్యవసర పరిస్థితి కన్నా దయనీయంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. సీబీఐ, ఈడీలకు ఆదేశాలిచ్చి తనను వేధిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సీబీఐకి ఆదేశాలిచ్చి, పశ్చిమ బెంగాల్‌కు పంపించారన్నారు. పోలీసులపై చర్యలకు తెగబడటం దారుణమన్నారు. తన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ఇది రాజ్యాంగంపై దాడి అని ఆమె పేర్కొన్నారు. తాను రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తక్షణమే ధర్నా చేస్తానని, రాష్ట్ర బడ్జెట్‌ను ధర్నా ప్రదేశం నుంచే ప్రవేశపెడతానని మమతా స్పష్టం చేశారు.


పోలీస్ కమిషనర్‌ను కాపాడేందుకు మమతా యత్నం

కాగా ఈ వ్యవహారంపై బీజేపీ మండిపడింది. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను కాపాడేందుకు మమత బెనర్జీ ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేత రూపా గంగూలీ ఆరోపించారు. ఆయన గురించి ఆమె మంచి మంచి మాటలు చెప్పడమేమిటని విమర్శించారు. సీబీఐతో ఎందుకు సహకరించడం లేదని, సీబీఐ విధి నిర్వహణలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు.

మాఘ అమావాస్యకు ముస్తాబైన ఏడుపాయల

- భక్తులకు దర్శనమివ్వనున్న వనదుర్గామాత
- ఉత్సవ ఏర్పాట్లు పూర్తి
- భక్తజనానికి చలువ పందిళ్లతో పాటు సత్రాలు
- ఆలయ ఈవో మోహన్‌రెడ్డి

విజయక్రాంతి, సంగారెడ్డి: మాఘ అమావాస్య ఉత్సవాలకు మెదక్ జిల్లాలోని ఏడుపాయల వేడుకగా మారింది. భక్తుల కొంగు బంగారంగా.. కోరిన కోరికలు తీర్చే తల్లిగా వనదుర్గామాతగా వర్ధిల్లుతున్న దుర్గామాత సన్నిధిలో మాఘ అమావాస్య ఉత్సవానికి ఘనంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశామని, నేడు ఒక్కరోజు జరిగే మాఘ అమావాస్యకు సుమారు 2లక్షలకు పైగా భక్తులు రానున్నారని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. మాఘమాసం తొలి సోమవారం జరిగే మాఘ అమావాస్య పండగకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందని, భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని ఈవో చెప్పారు.



ఉత్సవంలో పోలీసు పహారా

భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశామని, వారికి ఎటువంటి ఆటంకాలు సోలీసు భద్రతా(పబ్లిక్ అట్రాసింగ్ సిస్టమ్) ఏర్పాటు చేశామని ఈవో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భక్తుల పుణ్యస్నానార్థం ఆలయ సమీపాన ఉన్న మంజీరా జలాశాయం నుంచి బ్యాక్ వాటర్ వదిలారని సంబంధిత అధికారులు తెలిపారన్నారు. గజ ఈతగాల్లను రప్పించామని, జలాశయం లోతట్టు ప్రాంతంలో వద్ద గజ ఈతగాళ్లను అప్రమత్తంగా ఉండేలా చూశామన్నారు. ఉత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం చలువ పందిల్లతో పాటు సత్రాలు, టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. తాగడానికి నీరు, అందుబాటులో వైద్య శిబిరాలు, సిబ్బందిని నియమించామని తెలిపారు. భక్తుల రవాణా సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేశామని, అదనంగా ఆర్టీసీ బస్సులు, తదితర ప్రైవేటు వాహనాల సంఖ్య అధికంగానే ఉందని, పార్కింగ్‌కు సమస్య లేకుండా చేశామని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

అర్హులైన వారందరికి ప్రభుత్వ సహాయం

విజయక్రాంతి, అంబర్‌పేట్: అర్హులైన వారందరికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట్ ఎంఆర్‌ఓ పరిధిలో కల్యాణ లక్ష్మీ షాదిముబారాక్, చెక్కులను కార్పొరేటర్లు పుల్లిజగన్, పద్మావతిడిపిరెడ్డి, గరిగంటి శ్రీదేవిరమేష్, కాలేరు పద్మాలతో కలిసి పంపిణీ చేశారు. 35మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ కార్యాలయ అధికారులు సైయిద్ ముస్తాఫా, శివరంజని, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, టీఆర్‌ఎస్ నాయకులు ఆర్.కె.బాబు, టి.పల్లవి, ఆర్.రాము, లక్ష్మీ, దనలక్ష్మీ స్వప్న, రాజ్యలక్ష్మీ, వసంత, దాడిగే జగన్‌యాదవ్, పి.సంతోష్, బి.శ్రీకాంత్, నరేష్, రవీందర్, శ్రీనివాస్, కాలేరు శ్రవణ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: టీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రతి ఒక్క కార్యకర్త తమ తమ బస్తీలలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దుండిగల్ గండిమైసమ్మలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైలంగౌడ్ పాల్గొని కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతూ కార్యకర్తల పనితీరు ఇంకా మెరుగుపరుచుకోవాలని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని ఎవరూ కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను ఇతర పార్టీలకు చెందిన నాయకులు ఏమైనా ఇబ్బందులు పెడితే తన దృష్టి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో చూపించేందుకు కార్యకర్తలందరూ సిద్ధమవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,మల్లారెడ్డి,మైసిగారి వెంకటేష్,సగ్గిడి శ్రీనివాస్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి,రాము గౌడ్,యాదిరెడ్డి,మహేందర్ యాదవ్,గోపాల్ రెడ్డి,పోలిస్ జీవేందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



విజయక్రాంతి, బోడుప్పల్: నేటితరం విద్యార్థులను కేవలం మార్కులు సాధించే యంత్రాలుగా చూడకుండా విలువలతో కూడిన సామాజిక నేపథ్యంతో అందించే విద్యను అందించడం ద్వారా దేశానికి ప్రయోజనం చేకురుతుందని ఐపీఎస్ అధికారిణి బి. సుమతి అన్నారు. ఉప్పల్ డిపో పరిధిలోని విజయరత్న పాఠశాల వార్షికోత్సవ వేడుకలు స్థానిక బండి గార్డెన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన కలిగే విధంగా విద్యా బోధన ఉండేదని అలాంటి సమయంలో విద్యార్థులు ఎలాంటి కష్టాలు వచ్చిన కూడా ధైర్యంగా ఎదుర్కొనే మనో నిబ్బరం ఉండేదని అన్నారు. నేడు విద్యార్థులు కేవలం మార్కులు సాధించే యంత్రాలుగా తయారవుతున్నారని చెప్పారు. ఈ విద్యా విధానం కాకుండా ఉండేలా పాఠశాల యాజమాన్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన (జీపీఏ 10/10,10.8) 32 మంది విద్యార్థులకు మెమోంటోలు అందించారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుమతిని మెమోంటోతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్లు విజయసేనా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ్మరావు, నరేంద్రనాథ్‌లు పాల్గొన్నారు

సేవా దృక్పథంతో ఆసుపత్రులు కొనసాగాలి



విజయక్రాంతి, బోడుప్పల్: ప్రైవేట్ ఆసుపత్రులు లాభాపేక్షతో కాకుండా పేద ప్రజలకు సేవా దృక్పథంతో వైద్యం అందించినప్పుడే మంచి పేరు ప్రఖ్యాతలు సాధిస్తాయని మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ డిపో పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సేవ్ హాస్పిటల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంతో వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాలేరు శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, ఉప్పల్ శాసన సభ్యులు బేతి సుభాష్ రెడ్డి, తెలంగాణ డాక్టార్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అన్వేష్ కల్యూరి. టీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్గ దయాకర్ రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, ఇమాన్యేల్ విక్టర్, శ్రీనివాస్, టీఆర్‌ఎస్ నాయకులు పాశం బుచ్చి యాదవ్, కోల్తురి కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నరేంద్రమోదీ బడ్జెట్

విజయక్రాంతి, అంబర్‌పేట్: బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్కజగన్ ఆధ్వర్యంలో రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి జనరంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు అభినందిస్తూ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన జాతీయ బాల కార్మిక హాకుల పరిరక్షణ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడి నేతృత్వలోని బీజేపీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల రైతులు, కార్మికులకు ఎంతో ఉపయోగపడే జనరంజకమైన మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతంరావు, డివిజన్ బీజేపీ నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, ఎన్.సాంబశివగౌడ్, ఈ.అజయ్‌కుమార్, జె.బాల్‌రాజ్, కె.శ్రీహరి, ఈ.భాస్కర్, మిర్యాల శ్రీనివాస్, టి.వెంకటేశ్, రంగంపల్లి రాజు, నాగరాజు, గోవింద్‌అర్జున్, ఎల్.శ్రీనివాస్, ఎస్.సుజాత, ఏ.వాణి, పి.సునంద, సరళ, సరోజిని, కట్టమ్మ, వరలక్ష్మీ, అనురాధ, లక్ష్మీ, వెంకటేశ్, వి.సుధాకర్, ఎం.మహేష్, తదితరులు పాల్గొన్నారు

కాచిగూడ డివిజన్‌లో..

పార్లమెంట్‌లో శుక్రవారం నరేంద్రమోడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు అమోదయోగ్యంగా ఉందని మాజీ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం కాచిగూడ డివిజన్‌లో చప్పల్ బజార్, ఇందిరానగర్‌లో నరేంద్రమోడి చిత్రపటానికి ఆమెతో పాటు బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సుభాష్‌పటేల్, ప్రతిభ, బి.భీంరాజ్, ఆర్.సంతోష్, రాము, రవియాదవ్, జ్ఞానేశ్వర్, పవన్, ఆసీఫ్ ఆల్లీ, ప్రమోద్, రామ్ పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన వాక్

విజయక్రాంతి, మెహిదిపట్నం: క్యాన్సర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కిలిగియుండాలనీ ఎంఎన్‌జే కాన్సర్ హస్పిటల్ డైరక్టర్ జయలలిత తెలిపారు.ఫిబ్రవరి 4 వ తేదిన వరల్డ్ క్యాన్సర్ డే సంధర్భంగా హైద్రాబాద్ లోని పీపుల్స్ ప్లాజా నుండి జలవిహార్ వరకు క్యాన్సర్ వాక్ జరుగుతుందనీ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కమిషనర్ ఫ్యామిలి వెల్ఫేర్ డాక్టర్ యోగితా రాణా పాల్గొననున్నారని తెలిపారు.ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన కోసం వ్యాస రచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇటీవల క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిందనీ, అవగాహనతో వ్యాదిని ముందు గ్రహించినట్లయితే నయం చేయవచ్చునని తెలిపారు.కార్పోరేట్ హస్పటల్ ధీటుగా వైద్య సేవలందిస్తున్నట్లు ఆర్ఎంఓ శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రివైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్యోగాల సృష్టికర్తలుగా మార్చాలి

- విధాన నిర్ణేతలు సైతం గ్రామీణాభివృద్ధి కోసం పాటుపడాలి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయాలి
- విద్యలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరాన్ని తొలగించాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విజయక్రాంతి, హైదరాబాద్: ఉన్నత విద్యా సంస్థల్లో నైపుణ్య ఆధారిత విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉద్యోగార్థులుగా గాక, ఉద్యోగ సృష్టికర్తలుగా తయారు చేయవచ్చని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. డా:డి.రామానాయుడు విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ విద్యార్థులు, విజ్ఞాన్ జ్యోతి సొసైటి సభ్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఉన్నతమైన విద్యను అందించే విద్యా సంస్థను ఏర్పాటు చేసిన విజ్ఞాన్ జ్యోతి సొసైటి సేవలను అభినందించారు.

భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనే విధంగా విద్యార్థులను సంపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడం మీద విద్యాసంస్థలు దృష్టి పెట్టాలని, దీని కోసం విద్యార్థులకు దిశా నిర్దేశం చేసేందుకు ప్రత్యేకంగా కౌన్సిలర్లను నియమించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు భారతీయ విశ్వవిద్యాలయాలు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు సైతం వినూత్నంగా ఆలోచించి, సవాళ్ళకు అధిగమించే దిశగా పరిష్కారాలతో ముందుకు రావాలని, అదే సమయంలో విద్యా వ్యవస్థ సైతం సంప్రదాయ విజ్ఞానం, కళలు కాపాడుకోవడం మీద దృష్టి పెట్టాలని సూచించారు.విద్య పరంగా గ్రామాలు, పట్టణాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించాల్సిన అవసరం ఉందన్న ఉపరాష్ట్రపతి, గ్రామీణ యువతకు నాణ్యమైన విద్య సరైన స్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్రమైన అభివృద్ధిలో భాగంగా అన్ని స్థాయిల్లో నాణ్యమైన విద్యకు అవకాశం కల్పించాలన్నారు. గ్రామాల్లో నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలకు అవకాశాలు కల్పించేందుకు పబ్లిక్, ప్రైవేట్ మరియు సహకార సంస్థల సమన్వయం మరింత అవసరమని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఇది ఆహార భద్రతను పటిష్టం చేసి, గ్రామీణ ప్రజల జీవన పరిస్థితులను మెరుగు పరుస్తుందని తెలిపారు. రైతులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఇతరులకు నైపుణ్యం కల్పించే అత్యుత్తమ విద్యాసంస్థల అవసరం ఎంతో ఉందని, అన్ని రాష్ట్రాల్లో ఇలాంటి సంస్థలు అవసరమని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఇలాంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయన్న ఆయన, స్థానిక అవసరాల ఆధారంగా ఉద్యోగాలను కల్పించే వాతావరణాన్ని సృష్టించేందుకు, స్వయం సంవృద్ధిని కల్పించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి మీద సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే, పట్టణాల్లో మురికి వాడలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన శ్రీ నాయుడు, గ్రామీణాభివృద్ధి కోసం వనరుల కేటాయింపు విషయంలో విధాన నిర్ణేతలు, పౌరసమాజం శ్రద్ధ వహించాలని తెలిపారు. వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ, హార్టికల్చర్, పట్టు పురుగుల పెంపకం, పాడి వంటి వ్యవసాయ అనుబంధ రంగాలవైపు రైతులను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయరంగాన్ని లాభదాయకంగా, సుస్థిరంగా మార్చవచ్చని అభిప్రాయపడ్డారు. వ్యవసాయరంగాన్ని ఆర్థికంగా మెరుగు పరిచేందుకు, వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి, వ్యర్థాలను తగ్గించడానికి, పంటల విస్తరణ ప్రోత్సాహానికి ఫుడ్ ప్రాసెసింగ్ మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కార్మిక సంఘాల పదవులకు ఎంపీ కవిత రాజీనామా

- పనిభారంతో సేవలందించలేకపోతున్నాను
- రాజీనామా లేఖలను ప్రధాన కార్యదర్శులకు పంపాను: ఎంపీ కవిత



విజయక్రాంతి,హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ కార్మిక సంఘాలకు గౌరవాధ్యక్షురాలిగా ఉన్న నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఆయా కార్మిక సంఘాల ప్రధానకార్యదర్శులకు రాజీనామా లేఖలను కవిత పంపించారు. పనిభారంతో కార్మిక సంఘాలకు సేవలందించలేకపోతున్నానని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్వీకేఎస్), తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్, తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్య సంఘాలకు కవిత గౌరవాధ్యక్షురాలిగా సేవలందించారు. స్వరాష్ట్ర సాధనకు టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నాయకత్వంలో వివిధ కార్మిక సంఘాలతో కలిసి పనిచేశానని, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కార్మిక వర్గ ప్రయోజనాలు, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేసినట్టు తెలిపారు.

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా సింగరేణిలో కారుణ్యనియామకాల అమలు, 2013లో 18 శాతం ఉన్న లాభాల వాటాను 2018 నాటికి 27 శాతం వరకు చేర్చామని వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘ కార్మికులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయించామని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా 1175 మంది కాంట్రాక్ట్ జూనియర్ లైన్మెన్ల సర్వీసుల క్రమబద్ధీకరణ, 22,550 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా విలీనం చేశామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.4,500 నుంచి రూ.10,500, అయాలకు రూ. 2200 నుంచి రూ.6 వేలకు పెంచేందుకు కృషి చేసినట్టు కవిత వెల్లడించారు. కార్మికులకు సేవలు అందించడంలో సంతృప్తి ఉన్నప్పటికీ పని భారం దృష్ట్యా పూర్తి స్థాయిలో సేవలందించలేకపోతున్నట్టు తెలిపారు.

దీంతో పాటు రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని తన నియోజకవర్గానికి మరింత సమయం కేటాయించాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఈ కారణాల వల్లనే గౌరవాధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. బాధ్యతల నుంచి తప్పుకున్నా కార్మిక లోకానికి అందుబాటులో ఉంటానని ఎంపీ కవిత తెలిపారు.

ఫెడరల్‌ఫ్రంట్‌తోనే సామాజిక న్యాయం

- బడుగులను ఓటు బ్యాంకుకే పరిమితం చేస్తున్నారు
- ఓటుతో బుద్ధి చెప్పాలి
- కేంద్రంలో ఫెడరల్‌ఫ్రంట్ అధికారంలోకి రావాలి
- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

విజయక్రాంతి, హైదరాబాద్: దేశంలో సామాజిక న్యాయం జరగాలంటే కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సెంట్రల్ కోర్ట్ హోటల్లో 'ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకతపై' సదస్సు జరిగింది. ఈ సదస్సును ఎస్సీ జేఏసీ, బీసీ జనసభ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులోనే ఫెడరల్ స్ఫూర్తి ఉందన్నారు.

దేశంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సామాజిక న్యాయం పాటించడం లేదన్నారు. యూపిఏ వల్ల సామాజిక న్యాయం సాధ్యం కాదని, అగ్రవర్ణాల చేతుల్లోనే అధికారం హస్తగతమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్‌లోకి పలు పార్టీలు రావాల్సిన అవసరముందన్నారు. దీని కోసం మన ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు చాలా కృషి చేస్తున్నారని కొనియాడారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు కాకుండా మూడో ప్రత్యామ్నాయమే ఫెడరల్ ఫ్రంట్‌యని అన్నారు. ఈ రెండు పార్టీలను కాదని ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడితేనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమౌతుందన్నారు. బడుగులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరముందని, ఈ వర్గాలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలు తమ ఓటుతో బుద్ది చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిపాలనలో మార్పులు రావాలంటే ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావాలన్నారు. దేశంలో అధికార వికేంద్రీకరణ జరగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమౌతుందని అన్నారు. కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, పిడమర్తి రవి, రాజారామ్ యాదవ్, పలువురు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్లను వంకర్లు తిప్పి

చలానాలు తప్పించుకుంటున్న యువత

- యువత కొత్త ఎత్తుగడలు..
- నెంబర్‌ప్లేట్‌ను వంచడం, అంకెలను తుడిచివేయడం..
- కళ్ళముందే తిరుగుతున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు..



విజయక్రాంతి, మెహిదిపట్నం: స్నిగ్నల్ జంప్ వలన వాహనంపై ఎలాంటి ఫైన్ ఉండకుండా ఉండాలంటే,ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపి ఫైన్‌లను తప్పించుకొనేందుకు,నిఘా కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు వాహనదారులు కొత్త పద్దతినీ అనుసరిస్తున్నారు.నెంబర్ ప్లెట్ సరిగా ఉండకుండా చూడటం, లేదా చివరి నెంబర్‌లు లేదా మధ్యలో నెంబర్‌లు లేకుండా చేయటం జిల్లాకొడ్ లేకుండా చేయడం,

నెంబర్‌ప్లేట్ తారుమారు చేయడం, ఒకే నెంబర్‌ప్లేట్‌ను ఇద్దరు ముగ్గురు వాడుతున్నారు.కోందరు కావాలనీ నెంబర్ కనపడకుండా నెంబర్ ప్లేట్‌లు వంకర్లు తిప్పడం వలన ట్రాఫిక్ చలాన్‌లను తప్పించుకోనున్నారు.ఇటువంటి సంఘటనలు ఇటీవల క్రమంగా పెరగుతున్నాయి.మరికొందరు వాహనదారులు ఇతర వాహనాల నెంబర్ ప్లేట్‌లు అమర్చి అతి తెలివి ప్రదర్శిస్తున్నారు.ఇటువంటి వాహనాలకు ఎటువంటి నిబంధనలు వర్తించవా అని సగటు వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.ట్రాఫిక్ పోలీసులు ఈ వ్యవహారంపై శ్రద్ద చూపకపోవడంతో ఇటీవల ఇటువంటి వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.తనికీల సమయంలో అర్థంకానీ నెంబర్‌ప్లేట్ వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

భూగర్భ జలాలను పెంచుకోవాలి: ఎమ్మెల్యే గాంధీ



విజయక్రాంతి, శేరిలింగంపల్లి: వర్షాభావ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, కావున ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలు పెంచుకోవలసిన అవసరం ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంగనర్ కాలనీలో 30 లక్షల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఆయన స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాబోయే రోజులు నీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని కురిసిన కొద్దిపాటి వర్షపు నీరును వృధా చేయకూడదని ఆయన ప్రజలకు సూచించారు. వచ్చే వేసవిలో జంట నగరాల్లో నీటి సమస్య తలెత్తకుండా సీఎం కృష్ణ, గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

పభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌కు మొత్తం 30 రిజర్వాయర్లు మంజురుచేయగా అందులోని 18 రిజర్వాయర్లు ఒక శేరిలింగంపల్లికే మంజూరు చేశారని, వాటిలో ఇప్పటికే 10 రిజర్వాయర్లను ప్రారంభించుకోవడం జరిగిందని, మరో 8 రిజర్వాయర్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెట్రోవాటర్ వర్క్స్ అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో అమలు చేయాలి



విజయక్రాంతి, అంబర్‌పేట్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు ప్రభుత్వ సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట్ డివిజన్ అయ్యప్ప దేవాలయం రోడ్డులో ఉన్న ఎన్. కిరణ్‌కుమార్‌కు రూ.32వేలు, సాయికృష్ణనగర్‌కు చెందిన షెక్ అన్వర్‌కు రూ.52,500లు ప్రభుత్వ సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని మంత్రి నరేంద్రమోడి బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలకు ఎంతో ఉపయోగపడే 'ఆయుష్మాన్ భారత్' పథకంను రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయకుండా పేదప్రజలకు అన్యాయం చేయడం విచారకరమని చెప్పారు. వెంటనే ఈ పథకంను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్కజగన్, బీజేపీ నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, ఎన్.సాంబశివగౌడ్, జె.బాల్‌రాజ్, పి.నాగరాజుచారి, జి.మల్లేష్, టి.వెంకటేష్, డి.భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించవద్దు

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులే, వాటిని ప్రోత్సహించే అధికారులను సహించేది లేదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ హెచ్చరించారు. ఆదివారం నియోజకవర్గంలోని శ్రీరాంనగర్, ఏ అండ్ సి బ్లాకుల్లో ఆయన స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు రెడు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందన లేదని, పైగా ఫిర్యాదుచేసిన వ్యక్తుల పేర్లను సదరు నిర్మాణదారునికి చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ నిర్మాణాల ద్వారా భవిష్యత్తులో అనేక అనర్థాలు వస్తాయని, నిర్మాణదారులు నిర్మాణాలు చేసి విక్రయించుకొని వెళ్ళిపోతారని కొనుగోలు చేసిన వారు అనేక ఇబ్బందులు పడుతారని, ఈ విషయం తెలుసుకొని అనుమతులు లేని నిర్మాణాలను ప్రజలు కొనుగోలు చేయరాదని ఎమ్మెల్యే గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకరవ్గంలో అన్ని ప్రాంతాలనుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహార శైలిని మార్చుకోకపోతే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



మెదడుపై సామాజిక మాధ్యమాల ప్రభావం

నెల రోజుల పాటు దిగ్విజయంగా ఫేస్‌బుక్‌కు దూరంగా ఉన్న వారు, ఇక మీదట తాముఫేస్‌బుక్ విని యోగాన్ని బాగా తగ్గిస్తామని చెప్పారు. ఆ సమయంలో ఇతర ఉపయోగకరమైన పనులు చేసుకుంటామని వెల్లడించారు. నెల రోజుల పాటు ఫేస్‌బుక్‌కు దూరంగా ఉన్న వారు బంధు మిత్రులతో హాయిగా నవ్వుతూ సమయాన్ని గడిపారు. ఆన్‌లైన్‌లో ఇతర ఉపయోగకరమైన వెబ్‌సైట్లు చదివి పరిజ్ఞానాన్ని పెంచుకున్నారు. వారికి రోజుకి ఒక గంట ఖాళీ సమయం మిగిలింది. రాజకీయపరమైన భావోద్వేగా లను నియంత్రించుకోగలిగారు. నకిలీ వార్తలకు బదులుగా బయట ప్రపంచంలో జరుగుతున్న నిజాలు తెలుసుకుని నిష్పక్షపాతంగా ఆలోచించే నేర్పు సాధించారు. మానసిక ఒత్తిడికి దూరమై జీవితం పట్ల ఓ రకమైన సంతృప్తి కలిగింది. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, టీవీ చూడడం వంటి పాత అభిరు చుల వైపు వారికి మళ్లీ ఆసక్తి కలిగింది. ఫేస్‌బుక్ అలవాటుని ప్రజలు మానుకోలేరా ? అది లేకుండా వాళ్లకు నిద్ర కూడా పట్టదా ? ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోవడానికి అమెరికాకు చెందిన స్టాన్‌ఫర్డ్, న్యూయార్క్ యూనివర్సిటీలు ఇటీవల ఒక అధ్యయనం నిర్వహించాయి. గత ఏడాది అమెరికాలో మధ్యం తర ఎన్నికలకు ముందు ఫేస్‌బుక్‌కు ఏడాది పాటు దూరంగా ఉంటే వెయ్యి నుంచి రెండు వేల డాలర్లు ఇస్తామంటూ ఫేస్‌బుక్ వినియోగదారులకు సవాలు చేశాయి. డబ్బులకు ఆశపడో, సోషల్ మీడియాకు దూరంగా ఉండడం మంచిదని భావించారో చాలామంది ఔత్సాహికులు ఈ సవాలు స్వీకరించారు. మొత్తం 2,844 మంది ప్రయోగాత్మకంగా తమ ఫేస్‌బుక్ అకౌంట్లను నాలుగు వారాల పాటు డీ యాక్టి వేట్ చేశారు. ఆ సమయంలో వారి నిత్య జీవితంలో పైన పేర్కొన్న మార్పులు వచ్చినట్లు ఆ అధ్యయనం వెల్లడించింది. అయితే సర్వేలో పాల్గొన్న వారిలో 2540 శాతం మంది ఫేస్‌బుక్ అలవాటు మానుకో లేక మొదటి వారంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. దీంతో అధ్యయనకారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిని బట్టి ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు ప్రతి మనిషి మెదడుపై ఎంతటి తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయో అర్థమవుతోందని అధ్యయనకారులు పేర్కొన్నారు. ఫేస్‌బుక్ విని యోగం డ్రగ్స్ వాడకంతో సమానమంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు.

రైతు లేనిదే రాజ్యం లేదు

ఒకప్పుడు అందరి వృత్తి వ్యవసాయమే. మన దేశంలో, రాష్ట్రంలో సారవంత మైన భూములు, అనుభవజ్ఞులైన కష్టపడే రైతులు, ఆదాయాలు పెరిగిన ప్రజా ప్రభుత్వాలు ఉండి మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. పారిశ్రామికాభి వృద్ధి ,మార్కెటింగ్ సౌకర్యాలు వచ్చాక పెద్ద రైతులు చాలా బాగు పడ్డారు. ఎప్పు డయితే దళారి వ్యవస్థ అడుగు పెట్టిందో రైతులు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులలోకి నెట్టబడ్డారు. వ్యవసాయం ప్రపంచంలోనే అధిక శాతం ప్రజల యొక్క వృత్తి. సుమారు 70 శాతం ప్రజలు ఆధారపడిన మన దేశ వ్యవసాయరంగానికి , దేశా నికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత ఇచ్చారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అన్నదాతలైన రైతు లను రక్షించు కోవాలని ఆనాడే పాలకులు గుర్తించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకకు తగ్గకుండా మొండి ధైర్యంతో రైతులు సేద్యం కొనసాగిస్తు న్నారు కాబట్టే ఈ మాత్రం అన్నమైనా జాతికి దొరుకుతోంది. వారు కూడా విరక్తితో ఒక ఏడాది కాడి పడేస్తే, మన దేశంలో ఉన్న 120 కోట్ల జనాభా గతి అధోగతి కాక తప్పదు. వ్యవసాయ రంగాన్ని ఇతర పరిశ్రమలతో సమానంగా పరిగణించి రైతుకు ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించి పెద్ద ఎత్తున నిధులు ఇస్తే తప్ప ఈ రంగం బతికి బట్ట కట్టే పరిస్థితి లేదని ఎన్నో కమిటీలు ప్రభుత్వాలకు సిఫారసు చేశాయి.

ప్రస్తుతం దేశంలో వ్యవసాయం కలిసి రాక రైతులు కష్టాల కొలిమిలో కొట్టు మిట్టాడుతున్నారు. భద్రత లేని బతుకులతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. భూమి తల్లిని నమ్ముకున్న రైతులు కూలీలుగా మారుతున్నారు.కనీస గిట్టుబాటు ధర రాక పోయినా కష్టనష్టాలను ఓర్చుకుంటూ , నిరాశ నిస్పృహల మధ్య నిరాదరణకు గురౌతూ, ఆకలినీ అప్పులనీ అనారోగ్యాలనీ మౌనంగా భరిస్తున్నారు. నేల తల్లిని నమ్ముకొని, పలు రకాల ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూ, శ్రమించి పంట లను పండించి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారు వ్యవసాయదారులు. దేశం ఎంత అభివృద్ధి చెందినా రైతుల కష్టాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతి ఒక్కరూ రైతు సంక్షేమం గురించి ఆలోచించి, వారు ఆర్థిక అభివృద్ధి సాధించటా నికి తోడ్పాటు అందించాలి.

పిడుగులు పడడం,వరదల్లో కొట్టుకుపోవడం,పొలంలో పని చేసే సమయంలో పాము కాటుకు మృతి చెందడం వంటి ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. ఇటువంటి సందర్భాల్లో మృతి చెందిన రైతులు,వారి కుటుంబాలకు సరైన రక్షణ సౌకర్యం లేదు. ఇతర విభాగాల్లో పని చేస్తూ చనిపోతే బీమా సౌకర్యం ఉంది. రైత న్నకు,ఆయనను నమ్ముకున్న కూలీలకు మాత్రం ఎటువంటి చట్టభద్రతను కల్పించలేదు. ఉపాధి హామీ పథకం వల్ల పేద ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో మనకు తెలీదు కానీ కూలీలు దొరకక రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎక్కువ ధరకు కూలీలను తెచ్చుకొని పెట్టిన పెట్టుబడికి , వచ్చే రాబడికి సంబంధం లేకుండా ఆర్థికంగా చితికి పోతున్నారు. రైతుల ఆదాయం పెరిగే విధంగా వారికి నైపుణ్యం, పెట్టుబడులు, యంత్రాలు సమకూర్చడం లేదు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి ప్రవేశపెట్టిన అరకొర పథకాలు కాగితాలకే పరిమితమవుతు న్నాయి. కౌలు రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక, యజమానులకు కిస్తీలు కట్టలేక కుదేలై అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తి ధరపై 150 శాతం అధికంగా రైతుకు అందేలా చూడాలని స్వామినాథన్ కమిటీ చెప్పినా, అదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రుల కమిటీ సిఫారసు చేసినా అమలు కాక పోవడం దురదృష్టకరం. కమిటీ సిఫార్సులు సక్ర మంగా అమలు చేస్తే వ్యవసాయ రంగం ఉచ్చ స్థితిలో ఉండాల్సింది .అలాంటిది రాను రాను స్వార్థం , అవినీతి , కుంభకోణాలు పెరిగి , నేడు రోజుకు 5 నుంచి10 మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకునే స్థాయికి రైతుల పరిస్థితి దిగ జారింది . స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు దాటినా , రైతు వర్గం కేవలం ఒక ఓటు బ్యాంక్ గా మాత్రమే మిగిలి పోయింది .దేశంలో రైతు ఎప్పుడయితే సంతోషంగా ఉంటాడో అపుడే దేశం చల్లగా ఉంటుందని మనమందరం అర్థం చేసుకోవాలి. రైతు లేనిదే రాజ్యం లేదు ... అన్న సంగతిని ఎవరూ మరవద్దు.

నీ జీవన ప్రయాణాన్ని ఆనందదాయక ప్రయాణంగా చేసుకో

ఆనందం నీ సహజప్రకృతి. జీవతంలో ప్రతిక్ష ణాన్నీ అనుభవిస్తున్న నీ జీవనప్రయాణాన్ని ఆనందదాయక ప్రయాణంగా చేసుకో! జీవితంలో అద్భుతమైన ఆనందపు పరిజ్ఞానాన్ని (ఆనందనైశి త్యాన్ని) నీతో పంచుకోనీ!

శ్రేష్ఠుడైన గౌతమబుద్ధ భగవానుని ధర్మచక్ర ఏకీకరణరూపమైన పరిపూర్ణచక్రం, ఉపనిషత్ బోధనారూపమైన సమన్వయ చక్రాలకు (శ్రావ్య, మధురచక్రం) స్వాగతం.

దీనిని అహమ్మదాబాదులో 15–9–2000 ఎ.ఎమ్.ఏ. అహమ్మదాబాద్ మేనేజ్ మెంట్, అసోసియేషన్ ఏర్పాటు చేసిన వారాంతపు సమావేశంలో సమర్పించాను.

ఇందులో రెండు విషయాలు ఉన్నాయి. దుఃఖ కారకమైన భౌతిక ప్రపంచం, ఆనందానుభూతిని ఇచ్చే సహజప్రకృతి.

బాహ్య ప్రపంచపు సుఖానుభూతిని పొందడానికి మనలోని అంతస్సుఖాన్ని అనుభవించాలి. ఇప్పుడు మనం అంతస్సుఖాన్ని ఆనందానుభూతిని ఏకీకృతం చేస్తే (బ్రహ్మానందాన్ని) ఆనందపుటంచులను ఆవిష్క రించగలమేమో చూద్దాం.

నీవు నీలోని అంతస్సుఖాన్ని పొందడానికి, అంత శ్శాంతిని సాధించాలి. అంతశ్శాంతి నిశ్శబ్దం నుంచీ (మౌనం) కలుగుతుంది. నిశ్శబ్దం అన్నిటిలోకి శ్రేష్ఠమై నది. మౌనంగా ఉండి నీలోని కంపనలు సకల ప్రపంచాన్నీ నింపేలా చేయి.

మౌనంగా ఉండి శాంతిని అనుభవించు.

మౌనంగా ఉండు, ఆలోచించు, ఏకాగ్రతతో ఉండు, ధ్యానించు.



పతంజలియోగ, సిద్ధసమాధియోగ, విపాసన ధ్యానం, రేకీ మొదలైన అనేక మార్గాలను నేర్చుకుని సాధన చేయి.

నీవు నీలోని ప్రశాంతతను చేరుకోగలిగితే అంత స్సౌఖ్యం నీదే.

నీ పని, బంధువులు, జ్ఞానం, అధ్యయనం, బాధ్య తలు, పాత్రలలో నీ ఆనందాన్ని విస్తరించు.

సంపూర్ణమైన పరిపూర్ణచక్రం నీలోని, అంతస్సు ఖాన్ని, భౌతికసుఖాన్ని పవిత్రమైన ఆనందంగా పరిణమింపచేస్తుంది.

అంతస్సుఖంతో అనుభవించు.

పరిపూర్ణ చక్రం (పరిపూర్ణ చక్రం)

1. ఆత్మకు మధ్యేమార్గం (ఆంతరంగిక ప్రపంచం)

ఆనందాలను దుఃఖాలను పొందక, న్యూనాధిక్యా లను దూరంచేస్తూ, ఆత్మానుభూతికి సహజసిద్ధంగా ఉండటమే మధ్యేమార్గం.

2. ప్రపంచానికి మధ్యేమార్గం (భౌతిక ప్రపంచం)

ఇవ్వనిది, తీసుకోనిది. ఇచ్చిపుచ్చుకోవడా లను దూరం చేసేది. సరియైన సమర్పణ, స్వీకరణ కేటాయించబడినదే భౌతిక ప్రపం చానికి మధ్యేమార్గం.

నాలుగు సత్యాలు

1. దుఃఖం, ఆనందాల సత్యత.

ప్రపంచమంతా దుఃఖం, ఆత్మ ఆనందం.

2. దుఃఖం, ఆనందకారకాల సత్యం.

పాకులాడటం దుఃఖం, తీసుకోవడం దుఃఖం, ఇవ్వడం, తీసుకోవడం దుఃఖం, ప్రయోజనకరం ఆనందం, సమర్పణ, స్వీకరణ ఆనందం.

3. దుఃఖాన్ని తొలగించే, ఆనందాన్ని కలిగించే సత్యాలు.

పాకులాడకపోవడం దుఃఖాన్ని తొలగిస్తుంది.

ఉన్నతమైన ఆలోచన ఆనందాన్ని కలిగిస్తుంది.

పాకులాడకు, దుఃఖించకు. సేవించు, ఆనందించు.

అష్టవిధమార్గాల సత్యాలు

1. ఆత్మవర్తనకు అష్టవిధమార్గాలు.

సరియైన ఆలోచన, వాక్కు, పని, జీవనం. ప్రయత్నం,మనఃస్ఫూర్తి, ధ్యానం, దృష్టి.

2. ప్రపంచమధురతకు అష్టవిధమార్గాలు.

ప్రేమ, అంకితభావం.

ఫలితాలు, గుర్తింపు.

జ్ఞానం, అధ్యయనం.

విశ్వాసం, బాధ్యత.

3. దుఃఖాన్ని తొలగించు, ఆనందాన్ని కలిగించు.

4. ఆంతరంగిక, భౌతికజీవనాన్ని శాంతియుతంగా గడపడానికి సమర్పణ, స్వీకరణలతో కూడిన ఆత్మతో కలయికను పొందడం.

1. సరియైన సంకల్పాలు, వాక్కులతో ప్రేమ, అంకిత భావాలను సమర్పించటం, స్వీకరించటం.
2. సరియైన పని, జీవనవిధానంలో ఫలితాలను, గుర్తింపును సమర్పించటం, స్వీకరించటం.
3. సరియైన ప్రయత్నం, శ్రద్ధలతో జ్ఞాన, అధ్యయనా లను సమర్పించటం, స్వీకరించటం.
4. సరియైన దృష్టి, సంకల్పాలతో విశ్వాసాన్ని, బాధ్య తను సమర్పించటం, స్వీకరించటం.

ఆనందానుభూతికి శాశ్వత మార్గాలు

1. సరియైన సంకల్పాలు, వాక్కులతో ప్రేమ, అంకిత భావాలను సమర్పించటం, స్వీకరించటం

2. సరియైన పని, జీవనవిధానంలో ఫలితాలను, గుర్తింపును సమర్పించటం, స్వీకరించటం.

3. సరియైన ప్రయ త్నం, శ్రద్ధలతో జ్ఞాన, అధ్యయ నాలను సమర్పించటం, స్వీకరించటం.

4. సరియైన దృష్టి, సంకల్పాలతో విశ్వా సాన్ని, బాధ్యతను సమర్పించటం, స్వీకరిం చటం.



గట్టు నారాయణ (గురూజీ)

ఉద్యోగుల వివాదాల పరిష్కారానికి 'అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్' ఏర్పాటు

(నిన్నటి తరువాయి)

ఉద్యమం పేరుతో పలువురు యువకులు, అవివా హిత యువతులు తమ మధ్య హద్దులు లేకుండా స్నేహ సంబంధాలు పెంచుకోవడంపై కూడ ఎన్నో ఫిర్యాదులు, విమర్శలు వెలుగు చూసాయి. రెండు ఉద్యమాలు పలువురు విద్యార్థి నాయకులను, యువ కులను రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ నాయ కుడు మల్లిఖార్జున్, ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ నాయకుడు శ్రీ వెంకయ్యనాయుడు ఆనాటి కాలంలో రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి ఎదగడం ఈ సందర్భంలో పేర్కొనవచ్చును.

1973 షట్సూత్ర పథకం

ఆరు సూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించి, దానిని అమలు జరిపే ప్రక్రియలో భాగంగా, రాజ్యాం గాన్ని సవరించి, ('ఆంధ్రప్రదేశ్‌లో షట్సూత్ర పథకం అమలు జరుపుటకు' ఈ రాజ్యాంగ (32వ) సవరణ 1973లో జరిగింది.) తెలంగాణ ఉద్యోగాల విష యంలో ప్రభుత్వం గైకొనిన చట్ట వ్యతిరేక, నియమ వ్యతిరేక చర్యలన్నింటినీ చట్టబద్ధమైనవిగా ప్రకటించే ప్రత్యేక అధికారాలను పార్లమెంటు రాష్ట్రపతికి దాఖలు చేసింది. రాజ్యాంగ సవరణ వలన 1973 అక్టోబర్‌లో ముల్కీ నియమాల చెల్లుదలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడ వమ్మయిపోయింది. ముల్కీ నిబంధనలు రద్దు అయ్యాయి.

చట్టబద్ధంగా గుర్తించబడిన ఆంధ్ర–తెలంగాణ అనే 'రెండు ప్రాంతాల' బదులు ఏడు మండలాలు వెలి శాయి. హైదరాబాదు, సికింద్రాబాదు నగరాలు స్వేచ్ఛా మండలం (ఫ్రీజోన్) రూపు సంతరించుకున్నది. తెలం గాణలో స్థానిక అభ్యర్థులుగా అర్హత పొందడానికి 15 సంవత్సరాలు నివాసం ఉండాలనే నియమం రద్దు అయి, ఈ పరిమితి నాలుగు సంవత్సరాలకు కుదింపు జరిగినది. తెలంగాణ ప్రాంతీయ కమిటీ రద్దు అవడమే కాక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంత ఆదాయ వ్యయ ఖర్చులు బడ్జెట్‌లో విడివిడిగా ఉండాలనే నియమం కూడ రద్దు అయింది. ఈ చర్య వలన తెలంగాణ నిధులు, ఆంధ్ర ప్రాంతంపై ఏ మేర అక్రమంగా వ్యయం చేస్తున్నారో లెక్కకూడ తెలియదు.

అంతేకాక, రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి, అన్ని ఉల్లంఘనలు చట్ట బద్దత పొందాయి. రాజ్యాంగ సవరణ అమలు జరిగే వరకు గతంలో జరిగిన నియామకాలన్నీ అవి ఎప్పుడు జరిగినా, ఎలా జరిగినా, చట్ట బద్దంగా జరిగినా చట్ట వ్యతిరేకమైనవైనా, సక్రమ నియామకాలు అయిపో యాయి. సుప్రీంకోర్టు తీర్పు వలన చట్ట వ్యతిరేకమైనవిగా భావించిన నియామకాలు కూడా చట్టబద్ధమైనవైపోయాయి.

రాష్ట్ర ప్రభుత్వ విధానంలో ఉండే ఉద్యోగాలను వివిధ లోకల్ క్యాడర్స్‌గా (జిల్లాస్థాయి, జోనల్‌స్థాయి) వర్గీకరించడం, ఉద్యోగ నియామకాల కొరకు, విద్యా సంస్థలలో ప్రవేశం కొరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతా లను 'లోకల్ ఏరియా'లుగా విభజించడం జరిగింది.

ఈ ఏర్పాట్లను విపులీకరిస్తూ ఇవి చట్టబద్ధమైనవిగా ధృవీకరిస్తూ 1975 అక్టోబర్ 18న (జి.ఎస్.ఆర్. 524(ఇ) 'ప్రెసిడెన్షియల్ ఆర్డర్' విడుదల అయింది. రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులు అమలులోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలు ప్రమోషన్ విషయా లలో తలెత్తే వివాదాల పరిష్కారానికి 'అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్' అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ట్రిబ్యు నల్ ఇచ్చిన తీర్పుకు పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నది. ప్రభుత్వం తన నిర్ణయాలు తనకు అనుకూల సమయంలో శాసన సభకు తెలియపరిచినా, తెలియపరచకపోయినా ఎవరూ ఏమి చేయజాలరు. అందువలన తెలంగాణ ఉద్యోగులకు అనుకూలంగా 'ట్రిబ్యునల్' ఇచ్చిన వేలాది తీర్పులు చిత్తు కాయితాలలో దుమ్ము కొట్టుకు పోయాయి.

ప్రెసిడెన్షియల్ ఉత్తర్వు వలన తమ ప్రయోజనాలు దెబ్బతినే ఏ అంశాన్ని ఆంధ్ర ఉద్యోగులు అమలు కానీ యలేదు. జోన్‌ల విభజనలోను 'లోకల్ కాండిడేట్' నిర్వచనంలోను తెలంగాణ నిరుద్యోగులకు, ఉద్యోగు లకు తిరుక్షవరం జరగడం నేటికీ అవిచ్ఛిన్నంగా సాగుతూను ఉన్నది.

జిల్లాస్థాయి, జోన్‌స్థాయి 'లోకల్ ఏరియా' అభ్యర్థు లకు కొంత శాతం ఉద్యోగాలు కేటాయించి, మిగతా ఉద్యోగాలు పొందేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎవరైనా పోటీ పడవచ్చుననే నియమాన్ని రాష్ట్రపతి ఉత్తర్వు విధించగా, దానిని కూడా ఆంధ్ర ఉద్యోగులు, పాల కులు తమకు అనుకూలంగా వక్రీకరించడం జరిగింది. లోకల్ కొరకు కేటాయించిన శాతం ఉద్యోగాలు పోను, రిజర్వ్ చేయబడని మిగతా ఉద్యోగాలకు పోటీ పడేం దుకు లోకల్స్‌కు, నాన్ లోకల్స్‌కు కూడ అర్హత ఉన్నప్పటికీ, ఈ నియమానికి తిలోదకాలు ఇచ్చిన ఆంధ్ర అధికారులు, ఉద్యోగులు వారి గాడ్‌ఫాదర్స్ నియమాన్ని వక్రీకరించి, స్థానికులకు రిజర్వ్ చేయబ డిన ఉద్యోగాలు పోను మిగతావి నాన్‌లోకల్స్‌కు రిజర్వు చేయబడిన కేటరీగా వక్రీకరించి ఈ ఉద్యోగాల భర్తీకి ఆంధ్ర సరుకును దిగుమతి చేయడం కొనసాగి స్తున్నారు. అయితే, ఆంధ్రజోన్స్‌లో, జిల్లాస్థాయి లోకల్ ఏరియాలో మాత్రం నాన్ రిజర్వ్‌డ్ స్థానాలలో తెలంగాణ వారిని అడుగుపెట్టనీయడం లేదు. ఇంత కంటే మోసం, ఘోరం ఇంకేమి ఉంటుంది.

1976లో సంజయగాంధీ విజ్ఞప్తి మేరకు శ్రీమా దాల జానకిరామ్, సోంపల్లి పిచ్చయ్య నాయుడు, వాలిన సూర్య భాస్కరరావు, జాగర్లమూడి దుర్గాప్ర సాద్ ప్రభృతులు తమ 'ఆంధ్రసేన'ను యువజన కాంగ్రెస్‌లో విలీనం చేసిన అనంతరమే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ ఆరవప్రాణం అనంతవాయువులలో కలిసిపోయినది.

కమ్యూనిస్ట్ పార్టీ (యం.యల్) షట్సూత్ర పథకాన్ని మరొక మోసపూరిత పరిష్కారంగా అభివర్ణించింది. తన ప్రచార సాధనాలలో ఒకటైన 'పిలుపు' 1973 నవంబర్ మొదటి తేదీ సంచికలో ప్రచురించిన ఇందుకు సంబంధించిన వ్యాసాన్ని ఇటీవలి (1980–81) కాలంలో సి.పియం.ఎల్. వార్‌గ్రూప్ రెక్టి ఫికేషన్ క్యాంపెయిన్ తొలి సంచికలో పునర్ముద్రించింది. ఆ వ్యాసంలో కొన్ని భాగాలు.

రాష్ట్ర విభజనోద్యమ సందర్భంగా ఆరు సూత్రాలు ప్రణాళికను ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎట్ట కేలకు తన తొంట చెయ్యి బయట పెట్టింది. పాతసారానే కొత్త సీసాల్లో నింపి ఆంధ్ర ప్రజల సమిష్టి సౌభాగ్యానికి రూపొందించబడిన ఏకైక డబ్బాకొడుతు న్నారు. వాస్తవానికది ఆంధ్రప్రజల్లో శాశ్వతంగా వైరుధ్యాన్ని పెంచి తన నిరంకుశాధికారాన్ని ఇరు ప్రాంతాలపైన నిరాటకంగా కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కుట్రలో భాగమే తప్ప మరొ కటి కాదు. ప్రాంతీయ విభేదాలు తీవ్రతరమై రాష్ట్ర విభజనోద్యమ స్థాయినందుకొన్న ప్రతి చోటా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతి అదే.

ఈ ప్రణాళిక ద్వారా ఆంధ్ర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగించదలచుకున్న పథకమూ అదే. ఇరు ప్రాంతాల ప్రజలలోనూ ఒకరిపట్ల మరొకరికి ద్వేషాగ్నిని రగుల్కొల్పి ఇరువురి జట్టునూ తన చేతనుం చుకొని శాశ్వతంగా తన నిరంకుశాధికారాన్ని బలవంతంగా రుద్దుతుండడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. జంటనగరాలను స్వేచ్ఛామండలంగా చేయడం, అచ్చట మరో కేంద్ర విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం (ముల్కీ నియమాల రద్దు) మినహా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో చెప్పుకోదగ్గ నూతన అంశా లేమీ లేవు. పై అంశాల మూలంగా ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల మధ్య సమైక్యత పెంపొందడం మాట అలా ఉంచి ఒకరిపట్ల మరొకరిలో ద్వేషాగ్ని మరింతగా రగు ల్కొవడం మాత్రం ఖాయం. కేంద్ర ప్రభుత్వానికి కావలసింది కూడ అదే. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

పిల్లలకు ఒత్తిడిని తట్టుకోవడం నేర్పాలి

ఆధునిక కాలంతో పాటుగా పరుగులు తీస్తూ ప్రకృతిని శాసించే స్థాయిలో సాంకేతి కంగా ఎంతో పురోగమించాం. ఎన్నో అవకాశాలు, వస తులు, సౌకర్యవంతమైన జీవన విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదే సమయంలో ఒత్తి డితో కూడిన చదువులు, ఉద్యో గాలు,ఆర్థికంగా ఆకాశాన్ని అందుకోవాలనే ఆలోచనలు, విలాస వంతమైన జీవన విధానాలతో సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ల అవసరాలు కూడా పెరుగు తున్నాయి. బ్రతక గలం అనే మనోధైర్యం నేటి తరంలో కొరవడుతోంది. మార్కులు, ర్యాంకులే ప్రాతిపదికగా చిన్న తనం నుండే ఐ.ఐ.టీ లు, మెడికల్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో వారి బాల్యాన్ని మొగ్గలోనే చిదిమేసే స్థాయిలో, ఒత్తి డితో కూడిన విద్యావిధానం, క్రమశిక్షణ కొరవడటం, విచక్షణ లేమి కలసి విద్యార్థులను మానసిక వికలాంగులుగా తయా రు చేస్తు న్నాయి. చిన్నపాటి సమస్యను కూడా పరిష్క రించుకోలేని దుస్థితిలోకి విద్యార్థులు నెట్టి వేయబడుతున్నారు. ప్రస్తుతం సమాజాన్ని పరి శీలిస్తే ఎన్నో విపరీత ధోరణులు కన్పిస్తున్నాయి. విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే సమస్యలు ప్రారంభమవుతున్నాయి. వాటిని పరిష్కరించు కునే శక్తి వారికి లేకపోవటం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు వారి సమస్యల పట్ల శ్రద్ధ చూపకపోవడంతో 24 గంటలు చదివే యంత్రాలుగా విద్యార్థులు మారుతున్నారు. వీటిని నివారించి భావి పౌరులుగా వారిని తీర్చిదిద్దేందుకు జీవన నైపుణ్యాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల శక్తి సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్య నిర్ధారణ చేసుకోవాలి. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపాలి. పిల్లలకు మేమున్నాం అనే భరోసాను తల్లిదండ్రులు ఇచ్చి వారికి ఓటమిని తట్టుకోవడం నేర్పాలి.

– డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి , కరీంనగర్

రైల్వే లైన్‌పై నిరాశే...

కేంద్ర బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు ఒక్క రైలు రాకపోగా ఎలాంటి కొత్తలైన్లు మంజూరు కాలేదు. జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నా ప్రస్తుత బడ్జెట్‌లో నిరాశ మిగిల్చింది. ఆదిలా బాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ నిధులు మంజూరవుతాయని అందరు భావించినా ఎలాంటి నిధులు రాలేదు. జిల్లా కేంద్రమైన ఆది లాబాద్ నుంచి నిర్మల్ మీదుగా రాజధానికి నేరుగా రైలులో వెళ్లాలనే ప్రజల దశాబ్దాల కోరిక నెరవేరేలా కనిపించడం లేదు. కొత్తగా తెరపైకి వచ్చిన ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ లైన్‌కు శుక్ర వారం నాటి కేంద్ర బడ్జెట్లో నిధులు విడుదలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఎలాంటి ప్రస్తా వన లేకపోవడం అందరిని విస్మయ పరిచింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందులో సగం వాటా భరించేందుకు ముందుకు వచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందం చేసుకోకపోడమే అసలు సమస్యగా మారింది. ఫలితంగా రైల్వే లైన్‌కు మోక్షం లభించలేదు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలులో వెళ్లాలంటే మహారాష్ట్ర మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఆదిలాబాద్ నుంచి మహారా ష్ట్రలోని ముథ్కేడ్ మీదుగా ప్రయాణించి తిరిగి తెలంగాణలోని బాసరకు రైలు చేరుకుంటుంది. అక్కడి నుంచి నిజామాబాద్ మీదుగా సికింద్రా బాద్‌కు వెళుతుంది. దీంతో చుట్టూరా తిరిగి పోతుండడంతో మొత్తం 435 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుండడం దూరభా రమవుతోంది. రాత్రి 8.45 గంటలకు రైలు ఆదిలాబాద్ నుంచి బయలుదేరితే సికింద్రాబాద్ చేరుకోవాలంటే మరుసటి రోజు ఉదయం 6 గంట లవుతోంది. ప్రయాణానికి దాదాపు తొమ్మిది గంటల సమయం పడుతోంది. సమయం ఎక్కువ పడతంతో తక్కువ ధరైనా రైలు ప్రయాణంపై ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్‌ల మీదుగా హైదరాబాద్ వరకు ఉన్న నాలుగు వరుసల రహదారి వెంట కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలనేది ఇక్కడ ప్రజల చిరకాల కోరిక. ఈ లైన్ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్ వాసులకు గాక నిర్మల్, ఆర్మూర్ చుట్టుపక్కల ప్రాంతాల వారికి అనుకూలంగా ఉంటుంది.

– ఎల్లయ్య, ఆదిలాబాద్

మొరటువాని జోలి ముప్పును తెచ్చురా!

దూరపుకొండలు నునుపు అన్న మాట ఈనాటిది కాదు. కానీ తెలిసి తెలిసీ ఆ మోజుతో తరలి పరుగులుతీయడం అనేది నేటికీ విస్త రిస్తున్న అవివేకమే!

అమెరికా అటంచు అఱ్ఱు చాచగనేల
అమెరికాకు జాతి అసలు లేదు
అచటనున్న మెరిక లిచటివారేనయా
బాల! వినుము, కనుము పూలబాట

అంటూ విజయవాడ శాతవాహన కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు పింగళి కవివంశ వార సులు శ్రీ పింగళి వెంకట కృష్ణారావుగారు డెబ్బై ఏళ్ళ వయసులో నవీనంగా బాలబాలికల కోసం సంతరిం చిన 'పూలబాట' శతకంలో సుద్దులు చెప్పినట్లుగా మనవారు అమెరికా అమెరికా అంటూ ఆరాటపడు తుంటారు. నిజానికి ఆ దేశానికి సొంతమైన జాతి లేదు. అందరూ వలసవచ్చినవారే. అక్కడివారిలో మెరికలైనవారు మన భారతీయులే. నేడు తెలుగు కుటుంబాలనేకం నుంచి ఒకరో ఇద్దరో పిల్లలు అమెరి కాలో విద్యకోసమో, ఉద్యోగం కోసమో తరలిపోయి అక్కడ స్థిరపడాలని చూస్తున్నవారే! అందుకే మన తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్లవిద్య ప్రాముఖ్యం అంతకం తకూ పెరిగి తెలుగులో విద్యార్జన, తెలుగులో విద్యాబోధన క్రమేపీ మందగిస్తోంది.

ఆంగ్లభాష అనిన అఱ్ఱులు చాచకు
మాతృభాష తెలుగు మరువవద్దు
భుక్తికొరకు నేర్వ పొరపాటుకాదోయి
బాల! వినుము, కనుము పూలబాట

అని కవి ఇంగ్లీషు చదువుల కోసం ఎగబడడాన్ని, ఉద్యోగాలపై ఆంగ్లపార్జన అనివార్యమయినా తల్లి భాష తెలుగును మరవరాదని ఇక్కడి మన పిల్లలకే హితవు చెప్పుకోవలసి వస్తోంది మరి!

డాలర్లలో సంపాదించాలనే ఆరాటమే మన పిల్ల లను ఆ పిల్లలను ఆ దిశగా ఎగదోస్తున్న మన పెద్దలను నేడు బలీయంగా పట్టి కుదుపుతోంది అని అంగీకరిం చక తప్పదు. విద్యకోసం అమెరికా వెళ్ళి, అక్కడే ఉద్యోగాలు సంపాదించి స్థిరపడిపోవాలనీ, వివాహం చేసుకున్నా అమెరికాలోనే జీవించాలనే ఆకాంక్ష, ఆత్రమూ పెరిగిపోవడము వల్లనే అడ్డదారులు తొక్క యినా సరే అక్కడే ఉండిపోవాలని ప్రయత్నించే వైఖరులు వచ్చాయి. అమెరికా విద్యార్థి వీసా పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిని వలపన్ని పట్టుకోవటా నికి అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన ఇమ్మిగ్రేషన అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు 'పేపర్‌చేజ్' పేరుతో ఒక రహస్య ఆపరేషన్ ప్రారంభించారు. అందులో భాగంగా నాలు గేళ్ళక్రితం మిషిగన్‌లోని ఫార్మింగ్టన్ హిల్స్‌లో ఒక నకిలీ యూనివర్సిటీని సృష్టించారు. ఆ యూనివర్సి టీలో సిబ్బంది, అధ్యాపకులు, తరగతులు, కోర్సులు ఏమీ లేవు. కానీ ఆ యూనివర్సిటీలో విద్యార్జన పేరిట అమెరికాలో అక్రమంగా నివశించాలనుకునేవారిని, విద్యార్థివీసాలపేర ఇమ్మిగ్రేషన్ కుంభకోణాలకు పాల్ప డేవారినీ పట్టుకోవడమే లక్ష్యం. దూరపుకొండలు నునుపు మోజుతో అమెరికాలో చదువుపేర ఫీజులు చెల్లించి ఎఫ్.1 వీసాలతో ఇమ్మిగ్రేషన్ అధికారుల వద్ద విద్యార్థి హోదాను చూపి అమెరికాలో ఉండడానికి, పనిచేయడానికి రాచబాట వేసుకునే క్రమంలో ఈ ఉచ్చులో చిక్కుకున్న వారిలో అత్యధికం మన తెలుగు వాళ్ళే కావడం నిజంగా సిగ్గుచేటు. దౌర్భాగ్యం. అమెరికా విసిరిన ఈ వలలో ఆరువందలమంది అరె స్టయ్యారు. అక్రమ విద్యార్థులకు అమెరికా విడిచి వెళ్ళడానికి డెడ్‌లైన్ ముంచుకొస్తోంది. అమెరికాలోని తెలుగుసంఘాలు బాధితులకు న్యాయసహాయం అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. బాధిత విద్యార్థుల వీసాస్టేటస్ ఫ్రీజ్ అయినట్లే. మరి ప్రత్యా మ్నాయలేమిటో చూడాలి. అరెస్టయిన వారిని విడిపించడానికి బెయిల్ బాండ్ల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. నిజానికవిదొరకడం చాలా కష్టం కూడాను.

నిజానికి తెలియక ఈ ఉచ్చులో ఇరుక్కున్న వారికి సాయపడే కృషి అక్కడి తానా వంటి సంస్థలు చేప ట్టాయి. కానీ కొందరు అక్రమాలకు పాల్పడి తెలిసీ తప్పుచేశారు. అమెరికాలో రిక్రూటర్లుగా వ్యవహరించి అరెస్టయిన ఎనిమిది మంది తెలుగు విద్యార్థులున్నా రట. చట్ట విరుద్ధం అని తెలిసీ, ఫీజులు కట్టి, కట్టించి

సుధా(ప)మయం

అమెరికా మోజుతో ఇలా అగచాట్లు పడడం ఒక విధంగా స్వయంకృతాపరాధం కాదా మరి!


ఇప్పటికీ అమెరికా అంతటా విమానాల రద్దు, రీషె డ్యూలింగ్ సాగుతోందట. రేపటిలోగా భారత్‌కు తిరిగిరాకపోతే స్టేటస్‌ను పూర్తిగా కోల్పోయి నిషేధం వేటుకు గురయ్యేవారున్నారు. ఉల్లంఘన పీరియడ్ కనుక మొదలయితే ఎఫ్.1 విద్యార్థి వీసా నుంచి హెచ్.1బి వీసాకు మారడం కూడా చాలా కష్టమట! ఓ విద్యార్థి చదువుమానేసి అక్రమంగా ఉద్యోగం సంపా దించి రూల్స్‌ను అతిక్రమిస్తే అసలుకే ఎసరువస్తుంది మరి! ఎఫ్.1 విద్యార్థులు వారానికి 15 గంటల ఆన్ క్యాంపస్ ఎంప్లాయ్‌మెంట్‌కు, ఎమ్.1 వీసాగల వారు క్యాంపస్‌లోనూ, వెలుపలా ఇమ్మిగ్రేషన్ విభాగం అను మతితో పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకోవడానికీ, అలాగే జే 1 వీసా విద్యార్థులు వర్క్ అండ్ స్టే కింద అమెరి కాలో విదేశాంగశాఖ అనుమతి పొందిన స్పాన్సర్ చేసే సంస్థలో ఉద్యోగం సంపాదించుకోవడానికే అర్హులు.

గత ఏడాది అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తెచ్చిన ప్రభుత్వ చట్టం ప్రకారం 180 రోజులకు మించి అక్రమంగా అమెరికాలో ఉంటున్నవారు ప్రాసిక్యూట్ చేయబడి, మళ్ళీవారు అమెరికాలో అడుగుపెట్టకుండా మూడు నుంచి పదేళ్ళు నిషేధంకు గురి అవుతారని స్పష్టం చేసింది. ఆ 180 రోజుల గడువు రేపు ఫిబ్రవరి 5వ తేదీతోముగుస్తోంది. స్టేటస్ అతిక్రమిస్తే నిషేధం పాలవుతారన్నది ఆ నిబంధన. ఈ నిబంధన వల్ల దెబ్బ తినే భారతీయ విద్యార్థుల్లో తెలుగురాష్ట్రాలకు చెందిన వందలాది మంది ఉన్నట్లు మన ప్రవాస భారతీయులే చెబుతున్నారు. నిషేధం వేటుకు గురికాకుండా స్వదేశానికి తిరిగిరాగలిగితే అక్కడికది అదృష్టమే!


నిజానికి భారత్‌లో చదువుకొని అమెరికాలో ఉద్యోగాలు చేయడం గౌరవప్రదమనీ, అమెరి కాలో చదువుకున్నవారు అక్కడ తప్ప ఉద్యోగాల్లో మరెక్కడా ప్రతిభావంతంగా ఇమడలేరనీ అంటున్న వారూ ఉన్నారు. అమెరికా చదువుల మోజు రుచి శుచి లేని చిరుతిండివంటిదే!


రుచియటంచు బయట శుచిలేని చిరుతిండ్లు
ఆరగింపవ్యాధులంటుకొనును
అమ్మచేతి వంట అమృతము వంటిది
బాల! వినుము, కనుము పూలబాట

అని పింగళి వెంకట కృష్ణారావుగారు అన్నట్లు మేధో వలసలు వదులు కొని అనవసర డబ్బు వ్యామోహాలు లేక, మానవీ య ఆత్మీయ తానురాగాలు కలిగి 'జన నీ జన్మభూ మిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న రీతి మన దేశాభ్యున్నతికై మనవారు ఉద్యమిం చవలసిన తరుణం ఆసన్నం అయింది మరి!



సుధామ
9849297958





అమరావతిలో 'నల్సార్'కు సహకరించండి

విజయక్రాంతి, అమరావతి : రాజధానిలో నిర్మించే నవనగరాల్లో న్యాయ నగరం కూడా ఒకటని, బౌద్ధ స్థూపం రీతిలో అద్భుతంగా దాన్ని నిర్మిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రైతుల త్యాగం వృథాకాకుండా రాజధానిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు శాశ్వత భవనం శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. న్యాయనగరంలోనే న్యాయాధికారులు, సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోర్టుల్లో 1.70 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేసులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అమలు చేస్తామని, ఏపీలో రానున్న నవ్య ఆవిష్కరణలు న్యాయవ్యవస్థకు దోహదం పడతాయని చెప్పారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అవినీతి రహిత పాలన అందిస్తున్నామన్నారు.

2022 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తుందని, 2050 నాటికి ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు చెప్పారు. అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు తాము ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అద్భుతమైన పర్యాటక ప్రాంతాల ఏర్పాటు కూడా తమ ప్రణాళికలో భాగమేనన్నారు. రాజధానికి వచ్చే అతిథులను అమరావతి అందాలు ఆకట్టుకుంటాయని చెప్పారు. హైదరాబాద్‌లో నల్సార్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేశానని, అమరావతిలో కూడా నల్సార్ ఏర్పాటుకు సుప్రీంకోర్టు సహకరించాలని కోరారు. అమరావతిలో ఉండే న్యాయాధికారులు, సిబ్బందికి ఉచిత వసతి కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. రాజధాని నిర్మాణంలో తమకు సహకరిస్తున్న ప్రజలు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

ఉత్సవ విగ్రహాల కిరీటాలు మాయం

- గోవిందరాజస్వామి ఆలయంలో అణువణువు గాలించిన పోలీసులు
- అర్చకుల విచారణ
- బీజేపీ నాయకుల నిరసన

విజయక్రాంతి, తిరుపతి: తిరుపతి నగరంలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో అర్చకుల మధ్య అధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఒకరిపై ఒకరుపై చేయి సాధించడానికి చివరికి శ్రీదేవి, భూదేవి, శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ఆలంకరించిన కిరీటాలను మాయం చేశారు.

ఈ విగ్రహాలు 1300 గ్రాములు బరువు కలిగిన బంగారు కిరీటాలు. శనివారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో చివరగా కిరీటాలను చూసినట్లు చెబుతున్న టీటీడీ అధికారులు రాత్రి నైవేద్య విరామ సమయంలో చూడగా కన్పించలేదంటూ తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, టీటీడీ ఉన్నతాధికారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. హుటాహుటిన ఆలయానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు.

శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో సీసీ కెమెరా పుటేజీలను అర్బన్ ఎస్పీ అన్బు రాజన్, సి.వి.ఎస్‌వో గోపినాధ్ జెట్టితో కలిసి ఆలయ అధికారులు చెప్పిన సమయంలో ఎవరెవరు ఆలయం నుంచి బయటకు వచ్చారు. వారు వెంట ఏంతీసుకెళ్లారన్నదాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ



గొవిందరాజస్వామివారి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ఆలంకరించిన బంగారు కిరీటాలు మాయమైనట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి ఆలయం లోని అణువణువు గాలింపు చేపట్టారు. గొవిందరాజస్వామి ఆలయంతో పాటు ఉపాలయాలు, హూండీలు, చెత్తకుండీలను సైతం గాలించారు. అయితే ఎక్కడ కిరీటాల ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విధులు నిర్వహించిన ఆర్చకులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

అయితే గొవిందరాజస్వామివారి ఆలయానికి తీవ్రవాదులు నుంచి ముప్పు ఉందని పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ఆలయ ప్రవేశం, పరిసర ప్రాంతాల్లో మాత్రమే కన్పించేలా కెమెరాలను ఏర్పాటు చేశారు. గర్భాలయ పరిసరాల్లో ఎక్కడా సీసీ కెమెరా లేకపోవడంతో పోలీసులు తల పట్టుకున్నారు. దీంతో మేల్కొన్న టీటీడీ భద్రత విభాగం ఆఘుమేఘాలపై అప్పటికప్పుడు గర్భాలయాల వద్ద సీసీ కెమెరాలను అమర్చేందుకు చర్యలు చేపట్టారు.

గోవిందరాజ స్వామివారి ఆలయంలో కిరీటాలు మాయమైనట్లు తెలియగానే బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీటీడీకి చెందిన ఆలయంలో స్వామివారికి ఆలంకరించిన కిరీటాలు మాయమైయ్యాయంటే పరిపాలనా వ్యవస్థ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. స్వామివారి బంగారు ఆభరణాలపై భక్తులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత టీటీడీపై ఉందని చెప్పారు. సిట్టింగ్ జడ్జిచే ఆభరణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే స్వామివారి ఆలయంలో అర్చకుల మధ్య తలెత్తిన వాటాల పంపకమే ఈ సంఘటనకు మూలమని సమాచారం. భక్తుల నుంచి ఆలయంలో కైంకర్యాలు నిర్వహించే స్వాములు వసూలు చేసే మొత్తాల పంపకంలో వివాదాలు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.



అమ్మవారి సేవలో సీజేఐ

విజయక్రాంతి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శివశంకర్లతో కలిసి వచ్చిన ప్రధాన న్యాయమూర్తి దంపతులకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దుర్గమ్మకు ప్రత్యేకంగా పూజలు చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో కోటేశ్వరమ్మ శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు.



సీఈసీను కలవనున్న జగన్

విజయక్రాంతి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా ఓట్ల తొలగింపు, ఇతర అవకతవకలపై కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. పార్టీకి చెందిన మాజీ ఎంపీలు, ముఖ్య నేతలతో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం ఢిల్లీకి పయనమయ్యారు. సోమవారం ఉదయం 11.30గంటలకు వైఎస్ జగన్ పార్టీ నేతలతో కలిసి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ)ను కలుస్తారు. ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున చోటుచేసుకున్న అవకతవకలు, అక్రమంగా పేర్ల తొలగింపు అంశాలతో పాటు రాష్ట్ర డీజీపీ వ్యవహారశైలిపైనా సీఈసీకి ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

ఒకే నంబరుతో అనేక దర్శన టికెట్లు

విజయక్రాంతి, విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో దర్శనం టికెట్ల విక్రయాల్లో అవినీతి వెలుగు చూసింది. ఒకే నంబరుతో అనేక దర్శన టికెట్లు విక్రయిస్తూ ఆలయ ఆదాయానికి గండికొడుతున్నట్లు తేలింది. అధిక రద్దీ రోజుల్లోనూ తక్కువ ఆదాయం రావడంతో అనుమానించి ఆలయ ఈవో టికెట్ల విక్రయాలపై ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. బృందం తనిఖీలతో విక్రయాల్లో జరుగుతున్న అవినీతి వెలుగు చూసింది. ఎప్పటి నుంచి అవినీతి జరుగుతుందనే విషయంపై ఆలయ అధికారులు దృష్టి సారించారు. లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడి ఉంటుందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

జయరాం హత్య కేసును ఛేదించిన పోలీసులు

- సూత్రధారి రాకేష్ రెడ్డి పాత్రధారి శిఖా చౌదరి

విజయక్రాంతి, అమరావతి : నాలుగురోజుల క్రితం దారుణ హత్యకు గురియైన వ్యాపారవేత్త కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురిపాటి జయరాం హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలేనని దర్యాప్తు అధికారులు విచారణలో బైటపడింది. ఈ హత్యలో ప్రధాన ముద్దాయిగా రాకేష్ రెడ్డి కాగా, చిగురుపాటి మేనకోడలు శిఖా చౌదరి పాత్ర కూడా ఉన్నట్లు పోలిసు అధికారులు తేల్చేరు. గత రెండు రోజులుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు హత్యకుగల కారణాలను కనుగొన్నారు. ఇదిలా ఉండగా జయరాంతో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించిన శిఖా పోలీసులకు అన్ని విధాలుగా సహకరిస్తానని చెప్పినట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాకేష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.4.5 కోట్ల వ్యవహారంలో జయరాంను రాకేష్ హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చినట్టు పేర్కొన్నారు. జయరాం, రాకేష్ విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. హత్యను ప్రమాదంగా చిత్రీకరిచేందుకు రాకేష్ యత్నించాడని తెలిపారు. రాకేష్‌కు సహకరించిందెవరో తేలాల్సి ఉందని అన్నారు.

రాకేష్ ఎవరనే కోణంలో ఆరా..

జయరామ్ చెల్లులు సుశీలతోపాటు మేనకోడళ్లు శిఖా చౌదరి, మనీషాలతోపాటు డ్రైవర్ సతీష్‌తోపాటు గన్‌మెన్లను పోలీసులు విచారిస్తున్నారు. అదే సందర్భంలో మేనకోడలు శిఖా చౌదరి ప్రియుడుగా భావిస్తున్న రాకేష్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శిఖా చౌదరికి రాకేష్ రూ. 4.5 కోట్లు అప్పు ఇచ్చినట్లు సమాచారం. ఈ డబ్బుల విషయంలో రెండేళ్లుగా రాకేష్ శిఖా మధ్య గొడవలు జరుగుతున్నాయని, తన మేనకోడలి అప్పును తీరుస్తానని జయరామ్ హామీ ఇచ్చారని, అయితే ఆ తర్వాత డబ్బు సర్దుబాబు చేయకపోవడంతోనే వీరి ముగ్గురి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఆ వివాదమే హత్యకు దారితీసిందా? అన్న కోణంలో రాకేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. శ్రీకాంత్ అనే మరో యువకుడిపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎంపీ తమ్ముడి కొడుకుతోనూ శిఖాకు పరిచయాలున్నాయని, బీర్ కంపెనీ పెడతానని అతని ద్వారా భారీగా పెట్టుబడి పెట్టించినట్లు విచారణలో



(ఫైల్ ఫోటో)

తేలింది.

ఆ సమయంలో ఏం జరిగింది?

జయరాం స్వస్థలం విజయవాడ కాగా గత నెల 30న హైదరాబాద్ నుంచి బయల్దేరారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద గత నెల 31వ తేది రాత్రి 2గంటలకు ఆయన కారు సీసీ పుటేజీలో కనిపించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకోవడానికి 5 గంటల సమయం పడుతుంది. ఈ మిగతా సమయం ఎక్కడున్నాడన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనుమానస్పద స్థితిలో మృతి చెందిన జయరాం మృతదేహంపై పలు భాగాల్లో గట్టిగా దెబ్బలు తగిలిన దాఖలాలేమి కనిపించలేదు.

మోచేయి కింద భాగం లో, పొట్ట ఎడమ వైపున, కుడివైపు ఛాతీ పైభాగం లోనూ కందిన గాయాలున్నాయి. ముక్కు, నోటి నుంచి రక్తం ధారగా కారింది. చేతులు నల్లగా ఉండ డం, శరీరంలో నీలిరంగులోకి మారడంతో ఆయనపై ఏదైనా విష్రపయోగం చేశారా? కొట్టి హత్య చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం సందర్భంగా శరీర భాగాలను వైద్యులు సేకరించి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడి నుంచి నివేదిక అందాకే హత్య మిస్టరీ వీడే అవకాశం ఉందని పోలీసు భావిస్తున్నారు


చిగురుపాటి జయరాం భార్యా, పిల్లలు ఆమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. జయరాం మృతదేహన్ని జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలించారు. జయరాం ఇంటికి చేరుకున్న నందిగామ పోలీసులు ఆయన భార్య స్టేట్‌మెంట్ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

గుంటూరు జిల్లాలోనే మళ్లీ హైకోర్టు!

- చారిత్రక జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటున్న జిల్లా వాసులు

విజయక్రాంతి, అమరావతి : నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతం నేలపాడులో నిర్మితమైన భవనంలో ఆదివారం హైకోర్టు కొలువుదీరుతోంది. ఈ సందర్భంగా జిల్లావాసులు ఓ చారిత్రక జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఒకప్పుడు గుంటూరు నుంచి తరలివెళ్లిన హైకోర్టు మళ్లీ జిల్లాకే వచ్చిందని చర్చించుకుంటున్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1902 బ్రిటీష్ కాలంలో ప్రస్తుతం ఉన్న కలెక్టరు కార్యాలయం భవనాన్ని నిర్మించగా నాటి నుంచి జిల్లా పరిపాలన దీని కేంద్రంగా నడిచింది. అయితే ఈ భవనం ఓ ఘనమైన చారిత్రక సాక్ష్యంగా మిగులుతోంది.

స్వాతంత్ర్యం వచ్చాక బ్రిటీష్ పాలన ముగిసి మన పరిపాలన ప్రారంభమైంది. ఆ తర్వాత మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఈ క్రమంలో శ్రీబాగ్ ఒప్పందం ప్రాతిపదికగా కర్నూలులో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేశారు. హైకోర్టు ఎక్కడ నిర్వహించాలన్న చర్చ వచ్చినప్పుడు ఓటింగ్ నిర్వహించగా గుంటూరులో ఏర్పాటుకు ఎక్కువమంది మొగ్గు చూపారు. అయితే అప్పటికే నగరంలో జిల్లా కోర్టు ఉండగా హైకోర్టు కూడా ఏర్పాటు చేయాల్సిరావడంతో సరైన భవనం కోసం అన్వేషించారు. అప్పటి కలెక్టరు కార్యాలయం అనుకూలంగా ఉందని భావించి దానిని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాలలోకి మార్చి ఆ కార్యాలయ భవనంలో 1953 జులై 5న హైకోర్టు ఏర్పాటు చేశారు. ఆంధ్రా హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కోకా సుబ్బారావు నియమితులుకాగా ప్రారంభోత్సవానికి కేంద్ర న్యాయశాఖ మంత్రి కైలాసనాథ్ కట్జూ, ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, న్యాయశాఖ మంత్రి తెన్నేటి విశ్వనాథం, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పాకాల వెంకట రాజమన్నార్, మైసూరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాకాల వెంకటరమణ వంటి ప్రముఖులు హాజరయ్యారు. అయితే జస్టిస్ పాకాల వెంకట రమణ కుమారుడు వెంకట రాజమన్నార్ కాగా జస్టిస్ కోకా సుబ్బారావు అల్లుడు కావడం విశేషం. వీరు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో అప్పట్లో ఆసక్తికరమైన చర్చ జరిగింది. గుంటూరు కేంద్రంగా ఏర్పడిన హైకోర్టులో ఎన్నో చారిత్రక కేసులు వాదించారని సీనియర్ న్యాయవాదులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ జిల్లా పరిధిలో హైకోర్టు ఏర్పాటు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి చరిత్రను, ప్రతిష్ఠను గుర్తుంచుకుని ఇక్కడ కార్యకలాపాలు సాగాలని కోరుకుంటున్నారు.



మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత ఆంధ్ర రాష్ట్రం గుంటూరులో 1956 వరకు కార్యకలాపాలు నిర్వహించిన హైకోర్టు ఆంధ్రా, హైదరాబాద్ విలీనంతో హైదరాబాద్‌కు తరలివెళ్లింది. 28 నెలలపాటు గుంటూరు కేంద్రంగా సేవలు అందించింది. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ ఎక్కువ కేసులు ఆంధ్రా ప్రాంతానికి చెందినవే ఉంటున్నాయి. 1956 నుంచి 2014 మధ్యలో తమ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి డిమాండ్లు వచ్చినా సాకారం కాలేదు. రాష్ట్ర విభజన అనంతరం అమరావతి నగరం గుంటూరు జిల్లాలో నిర్మించడంతో హైకోర్టు ఇక్కడ ఏర్పాటు చేయాల్సివచ్చింది. నేలపాడులో కొత్తగా నిర్మించిన భవనంలో ఆదివారం ఉదయం ప్రారంభించారు.

అదనంగా 100 వైద్య సీట్లు

విజయక్రాంతి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల రానున్నం దున వంద ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఏపీలో ప్రస్తుతం 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు, స్విమ్స్ (అటానమస్) ఉన్నాయి. వీటిల్లో 1900 వరకు ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఏలూరు జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున ప్రభుత్వపరంగా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2వేలకు చేరనుంది. దీనివల్ల ప్రతిభ కలిగిన విద్యార్థులు తక్కువ ఫీజుతో వైద్య విద్యను పూర్తిచేసే అవకాశంతోపాటు ఏలూరు చుట్టుపక్కల వారికి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

ఏలూరు ఆసుపత్రిలో ప్రస్తుతం 450 వరకు పడకలు ఉన్నాయి. ప్రతిరోజూ ఓపీ విభాగంలో 1500 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. బోధనాసుపత్రిగా మార్చేందుకు కనీసం రూ.260 కోట్ల వరకు వ్యయం అవుతుందని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. తొలివిడతగా త్వరలో రూ.20 కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. మిగిలిన మొత్తాన్ని విడతల వారీగా విడుదల చేయనున్నారు. ఈ కళాశాల ఏర్పాటు, నిధుల మంజూరుకు తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. ఇందుకనుగుణంగా అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం వైద్య ఆరోగ్యశాఖ జాతీయ వైద్య మండలి(ఎంసీఐ)కి దరఖాస్తు చేస్తుంది. ఎంసీఐ అధికారుల తనిఖీల ప్రక్రియ పూర్తయ్యాక తరగతుల నిర్వహణకు ఆమోదం తెలియజేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం 2020–21 విద్యా సంవత్సరం లోనే ఇక్కడ తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

షర్మిలపై అసభ్యకర పోస్టుల కేసులో ఇద్దరి అరెస్టు

విజయక్రాంతి, హైదరాబాద్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సోదరి షర్మిలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అభ్యంతకరమైన పోస్టుల కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. యూట్యూబ్‌తో పాటు పలు వెబ్‌సైట్లలో అప్లోడ్ చేసి దాదాపు 60 పోస్టులపై తీవ్ర అసభ్యకర కామెంట్లు చేసిన ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన పెద్దిశెట్టి వెంకటేశ్వరరావును గుంటూరులో శనివారం అరెస్టు చేశారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 509, 67(ఎ) ఐటీ యాక్ట్‌తో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు గుంటూరులోని ఆర్వీఆర్ కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. సొంతూరైన వేములలో తమ కుటుంబానికి రెండెకరాల భూమిని ఏపీ ప్రభుత్వం ఇచ్చిందని పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. వెంకటేశ్వరరావు మాదిరిగానే షర్మిలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర కామెంట్లు చేసిన మరొకరిని మంచిర్యాలలో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షర్మిలపై అసభ్యకర కామెంట్లు చేసిన మరో ఐదుగురి కోసం కూడా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నా కోసం 75 రోజులు కష్టపడండి

- రూ.10 వేలు రుణం కాదు
- పసుపు కుంకుమ సంబరం, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

విజయక్రాంతి, విజయవాడ: నాలుగున్నరేళ్లు మీకోసం కష్టపడ్డాను.. 75రోజులు నా కోసం కేటాయించి కష్టపడండి... అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను కోరారు. మహిళలకు తగిన గుర్తింపు, ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని డ్వాక్రా సంఘాలు పెట్టాను. వారికి పసుపుకుంకుమ పథకం కింద మూడు విడతల్లో రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. మేం ఉచితంగా ఇస్తున్న సొమ్మును కొందరు రుణమని దుష్ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదు. మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక సాయం చేస్తున్నాం. మహిళలందరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలి. మూడు చెక్కులను ఈ నెలలో రూ.2,500, మార్చి 8న రూ.3,500, ఏప్రిల్ 5న రూ.4వేలు చొప్పున ఇస్తున్నాం. కొంతమంది మహిళలు వారికి ఇచ్చే పింఛనును కూడబెట్టి రాజధానికి విరాళంగా ఇస్తుంటే, కేంద్రం సాయం చేయకుండా మనల్ని విమర్శిస్తోంది అని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని కేసరపల్లిలో శనివారం నిర్వహించిన పసుపుకుంకుమ సంబరం, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వం వ్యయం రూ.6,720 కోట్ల నుంచి రూ.13,440 కోట్లకు పెరిగింది. రాష్ట్రంలో 26,769 మందికి చంద్రన్న పెళ్లికానుక ద్వారా రూ.114 కోట్లు అందజేశాం. శ్రామికులకు ఐదు రూపాయలకే భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లు, బీసీలకు 21 కార్పొరేషన్లను ఏర్పాటు చేశాం. ఈనెల 9న ఒకే రోజు నాలుగు లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేపట్టి ప్రపంచచరిత్రలో నిలవనున్నాం. కొందరు సర్వేలు చూసి తెగ సంబరపడి పోతున్నారు. తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రిగా మళ్లీ మీరే రావాలి అంటుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలు తామే గెలుస్తామని పగటి కలలు కంటున్నారు. ప్రజా సంక్షేమానికి అడుగడుగునా అడ్డు తగిలే పార్టీలు మనకు అవసరమా? నిరంతరం మీకోసం కష్టపడిన అన్నకు అండగా ఉంటారా? అని సీఎం చంద్రబాబు అడిగారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రానికి ఎవరూ సహకరించవద్దు. ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఆలోచించి రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలకు పుట్టగతులు లేకుండా చేయాలి.



148 మంది బాలికల అక్రమ రవాణా

- పట్టుకున్న మణిపూర్ పోలీసులు

ఇంఫాల్: 148 మంది బాలికలను అక్రమ రవాణా చేస్తుండగా ప్రత్యేక రైడ్ నిర్వహించి పోలీసులు కాపాడిన ఘటన మణిపూర్‌లో వెలుగు చూసింది. టెంనౌపాల్ ప్రాంతం నుంచి బాలికలను అక్రమ రవాణా చేస్తుండగా గుర్తించి కాపాడినట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంత పెద్ద ఆపరేషన్ జరగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఇలాంటి ఆపరేషన్లు కొన్ని ఎన్జీవోల సాయంతో చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.



అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మమత

- యూపీ సీఎం ఆదిత్యానాథ్ ఆరోపణ

లక్నో: పశ్చిమ బెంగాల్లోని పాలనా యంత్రాంగంపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. బాలూర్ ఘాట్లో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి టెలిఫోన్ ద్వారా ఆయన మాట్లాడుతూ మమత బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో పరిపాలనా యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయరాదని మమత బెనర్జీ తప్పనిసరిగా అంగీకరించాలన్నారు. ఆ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం పని చేస్తున్న తీరు ఎవరికీ ఆమోద యోగ్యం కాదన్నారు.యోగి ఆదిత్యనాథ్ పశ్చిమ బెంగాల్లో ఆదివారం ఉత్తర దీనాజ్‌పూర్, దక్షిణ దీనాజ్‌పూర్‌లలో జరిగే బీజేపీ బహిరంగ సభల్లో ప్రసంగించవలసి ఉంది. ఆయన ప్రయాణించే హెలికాప్టర్ పశ్చిమ బెంగాల్లోని డార్జిలింగ్ జిల్లా బాలూర్ ఘాట్లో దిగేందుకు అనుమతిని జిల్లా యంత్రాంగం నిరాకరించింది. దీంతో ఆయన టెలిఫోన్ ద్వారా ఈ సభలకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తనను ప్రజలతో మాట్లాడకుండా ఈ విధంగా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు.

పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్

దుర్ఘటనలో ఏడుగురి మృతి



పట్నా: బీహార్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. వైశాలి జిల్లా షదాయ్ బజూర్గ్ వద్ద సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో తొమ్మిది బోగీలు పట్టాలు తప్పడంతో ఏడుగురు మృతిచెందారు. ఇప్పటి వరకు 13 మంది ప్రయాణీకులు గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. రైలు జోగ్బనీ నుంచి ఢిల్లీకి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ 8, ఎస్ 9, ఎస్ 10, బీ 3(ఏసీ), ఒక జనరల్ బోగీ సహా మొత్తం తొమ్మిది బోగీలు పట్టాలు తప్పాయి. మూడు బోగీలు ఒకదానిపై ఒకటి పడిపోవడంతో పూర్తిగా ధ్వంసమైనట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు, బాధితుల సహాయం కోసం ఆయా ప్రాంతాల్లో రైల్వేశాఖ హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలిలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి.

దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం గురించి రైల్వే మంత్రి పియూష్ గోయల్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. 'జోగ్బనీ ఢిల్లీ ఆనంద్ విహార్ టెర్మినల్ మధ్య నడిచే సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ రైలు షదాయ్ బజూర్గ్ వద్ద ప్రమాదానికి గురికావడంతో తొమ్మిది బోగీలు పట్టాలు తప్పాయని, సహాయ, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయి' అని ట్వీట్ చేశారు. రైలు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రైల్వే శాఖ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపింది. క్షతగాత్రులను వైద్యం కోసం హాజీపూర్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందజేస్తున్నారు. ప్రయాణికులకు ఆహారం, నీరు రైల్వే ఉచితంగా సరఫరా చేసింది.



కర్నాటక మంత్రి డీకే శివకుమార్..
అరెస్ట్ అయ్యే అవకాశం

బెంగళూర్: కర్ణాటకలో కీలక మంత్రిగా పనిచేస్తున్న డీకే శివకుమార్‌తో పాటు ఆయన అనుచరులు ఐదుగురిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జనవరి 17న ఈడీ సమన్లు జారీచేసింది. ఇవి జారీ ఆయి 15 రోజులు దాటిన నేపథ్యంలో ఎప్పుడైనా అరెస్ట్ చేయవచ్చని సమాచారం. అక్రమ నగదు బదిలీకి సంబంధించిన జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న డీకే శివకుమార్‌ను ఇన్ కంటాక్స్ డిపార్ట్ మెంట్ తో పాటు ఈడీ గతంలో విచారించింది. మంత్రితో పాటు సచిన్ నారాయణ, సునీల్ శర్మ, ఆంజనేయ, రాజేంద్రలకు నోటీసులు జారీ చేశాయి.

పనిచేసే వారితోనే ఫలితం

విజయక్రాంతి, ఢిల్లీ: భారతీయ జనతా పార్టీ కొత్త నినాదం తెరపైకి తెచ్చింది. 'పనిచేసే వారి నుంచే ఫలితం ఆశిస్తారు' అన్న నినాదంతో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకుంది. మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయనుంది. అదే విధంగా ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రణాళిక రూపొందించాలని కూడా నిర్ణయం తీసుకుంది.

వచ్చే ఎన్నికల్లో గెలవడం ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ బలమైన ఆకాంక్షతో ముందుకు సాగుతోంది. వినూత్న పద్ధతిలో ప్రణాళికలు రూపొందిస్తోంది. గత ఎన్నికల్లో 'సబ్ కా సాథ్– సబ్ కా వికాస్' నినాదంతో ఎన్నికల్లో పోటీ చేసి అంచనాలకు మించి గెలుపును సాధించి అధికారంలోకి వచ్చింది. మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో గెలుపు సాధించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే.. కాంగ్రెస్ హయాంలో దేశం అభివృద్ధి చెందలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి జరుగుతోందని ప్రచారం చేస్తోంది. అందుకే 'పనిచేసే వారితోనే ఫలితం' వస్తుందన్న నినాదం రూపొందించింది. ఈ నినాదంతోనే ఎన్నికలు వెళ్లనుంది. ప్రభుత్వ పథకాల కారణంగా ఈ నాలుగున్నరేళ్లలో 10 కోట్ల కుటుంబాలు పొందాయని, ఆ కుటుంబాలను నేరుగా కలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. నూతన నినాదంతో ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో 2014 లోక్సభ ఎన్నికల ప్రచార నినాదం సబ్కా సాథ్..సబ్కా వికాస్ నినాదాన్ని ఆ పార్టీ పక్కనపెట్టినట్లయింది.



ప్రజాభిప్రాయంతోనే 'మెనిఫెస్టో'

ఎన్నికల మెనిఫెస్టో అంశంలోనూ బీజేపీ వినూత్న ప్రణాళిక రూపొందించింది. ఇప్పటివరకూ ఏ పార్టీ చేయని విధంగా ప్రజాభిప్రాయం ప్రకారం ఎన్నికల ప్రణాళిక రూపొందించనుంది. ఇందుకోసం 'భారత్ మన్‌కీ బాత్– మోదీకే సాథ్' నినాదంతో ప్రజల ముందుకెళ్లనుంది. దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 4వేల అసెంబ్లీలకు చెందిన ప్రజల అభిప్రాయాలను, వారి ఆకాంక్షలను తెలుసుకోనుంది. ఇందుకోసం ప్రతి అసెంబ్లీలో ప్రత్యేకంగా బాక్స్‌లు ఏర్పాటు చేయనుంది. ఈ బాక్స్‌ల్లో ప్రజలు తమ అభిప్రాయలను పేపర్లో రాసి వేసే విధంగా ఏర్పాటు చేయనుంది. బాక్స్‌ల తరలింపు కోసం 300 ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయనుంది.

మళ్లీ అధికారంలోకి వస్తేనే.. అభివృద్ధి సాధ్యం: జేపీ చీఫ్ అమిత్ షా

దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తెలిపారు. ఢిల్లీలో ఆదివారం ఆయన 'సంకల్ప్ పత్ర్' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 'పని చేసే వారితోనే ఫలితం' అన్న నినాదంతో ఈ ఎన్నికల్లో పాల్గొంటున్నామని ప్రకటించారు. 2014కి ముందు 30 ఏళ్లు కొనసాగిన సంకీర్ణ ప్రభుత్వాలు పనితీరుపై ప్రజలు అనుమానించారని, వారి అనుమానానికి తగ్గట్టే అభివృద్ధి కూడా జరగలేదన్నారు. ఇటువంటి 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించడంతో నరేంద్ర మోదీ నేతృత్వంలో భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశాభివృద్ధి కొనసాగాలంటే.. మరో ఐదేళ్ల కంటే ఎక్కువ సమయం బీజేపీ అధికారంలో కొనసాగితేనే సాధ్యమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మా ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పథకాలు ప్రవేశపెట్టామన్నారు. రేపు జరిగే ఎన్నికలు కేవలం గెలుపుకోసం మాత్రమే కాదని, పార్టీ కార్యకర్తలకు సంబంధించి ప్రజాస్వామ్య వేడుకలా ఉంటాయన్నారు.

ప్రజలను కలవడానికి కార్యకర్తలకు అందివచ్చిన ఓ మంచి అవకాశమన్నారు. దేశ అభివృద్ధికి మార్గదర్శకాలయిన మన ఆలోచనలను ప్రజలకు తెలియజెప్పాలని, వారి నుంచి అభిప్రాయాలను తీసుకొని ఎన్నికల మెనిఫెస్టో రూపొందిస్తామని చెప్పారు. ప్రజల తమ సలహాలను పేపర్‌పై రాసి వేయడానికి బాక్సులు ఏర్పాటు చేస్తామని, అలాగే, ఈ మెయిల్, కాల్ సెంటర్ల ద్వారా కూడా వారి సలహాలను సేకరిస్తామని అమిత్ షా తెలిపారు.

'భారత మన్ కీ బాత్' తమ పార్టీ కార్యక్రమం కాదని, ఇది దేశ ప్రజల కార్యక్రమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్క నెలలో దేశంలోని తమ 11 కోట్ల కార్యకర్తలు 10 కోట్ల కుటుంబాలకు కలవాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరించి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పనిచేసే వారిపైనే ప్రజలు నమ్మకాన్ని ఉంచుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంపై ఎన్నికల మెనిఫెస్టో కమిటీ చీఫ్, కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాన్ని ఏ రాజకీయ పార్టీ ఇప్పటివరకూ చేపట్టలేదని తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకే తమ ఎన్నికల మెనిఫెస్టో రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు.



లోక్‌పాల్ అమలుకు జంకుతున్న మోదీ

రాలేగావ్ సిద్ధి: లోక్‌పాల్ , లోకాయుక్తను నియమిస్తే ప్రధాని, ముఖ్యమంత్రిని సైతం విచారించొచ్చని తెలిపారు. అందువల్లే పార్టీలు ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురావడానికి వెనకాడుతున్నాయన్నారు.

అవినీతికి వ్యతిరేక పోరాటంలో తనకు ఏమైనా జరిగితే ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీనే నిలదీస్తారని సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే తెలిపారు. లోక్‌పాల్ , లోకాయుక్తల నియామకాల్లో జాప్యాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలోని ఆయన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. "దేశంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తిగా ప్రజలు నన్ను గుర్తుంచుకుంటారే గానీ.. అగ్నికి ఆజ్యం పోసిన నేతగా కాదు. నాకేమైనా జరిగితే ప్రజలు ప్రధాని మోదీని నిలదీస్తారు" అని అన్నాహజారే అభిప్రాయపడ్డారు.

అన్నాహజారే దీక్ష పట్ల ప్రధాని మోదీ సరిగా స్పందించడం లేదని రాలేగావ్ సిద్ధి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా కలిసి ఆదివారం గ్రామంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కొంతమంది యువకులు, మహిళలు స్థానికంగా ఉన్న ఓ టవరెక్కి నిరసన తెలిపారు. దీక్షకు సంబంధించి అన్నా హజారే జనవరి 1న ప్రధానికి లేఖ రాశారని స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం కేవలం ధన్యవాదాలు, శుభాకాంక్షలు మాత్రమే తెలియజేశారంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అన్నా హజారే దీక్షను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు.

చిన్నారి బుగ్గపై పొడిచిందని కోడిపుంజుపై కేసు



భోపాల్: ఇదేం విచిత్రం కోడిపుంజుపై కేసు పెట్టడం ఏంటని షాకవుతున్నారా. నిజమండీ బాబూ.. ఐదేళ్ల చిన్నారి బుగ్గపై కోడి పొడిచిందట. బుగ్గకు గాయమై రక్తం కూడా వచ్చిందని.. తల్లిదండ్రులు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెళ్లి కోడిపుంజును తీసుకొచ్చి కేసు నమోదు చేసి జైల్లో పెట్టారు. మధ్యప్రదేశ్లో జరిగిన ఈ విచిత్రం ఇప్పుడు వార్తల్లోకి ఎక్కింది. శివపురికి చెందిన పప్పు జాటవ్, లక్ష్మీ దంపతులకు సంతానం లేదు. దీంతో ఐదేళ్ల క్రితం ఓ కోడిపుంజును తీసుకొచ్చి పెంచుకుంటున్నారు. ఎంతైనా కోడి కదా.. రోజూ చుట్టుపక్కల ఉన్న ఇళ్ల వెంట తిరిగేది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పప్పు పొరిగింట్లో ఉండే ఐదేళ్ల చిన్నారి రాధిక రోడ్డుపై ఆడుకుంటోంది. ఈలోపే ఈ కోడిపుంజు కూడా అటుగా వెళ్లింది. ఏం జరిగిందో ఏమో.. కోడిపుంజు చిన్నారి చెంపపై పొడిచింది. ఆ గాయం నుంచి రక్తం కూడా వచ్చింది. గాయాన్ని గమనించిన తల్లిదండ్రులు ఏం జరిగిందని ఆరా తీస్తే.. కోడి పొడిచినట్లు తేలింది. దీంతో వారు పోలీ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు పప్పు ఇంటికి వెళ్లారు. కోడిపుంజును తీసుకొని స్టేషనుకు తీసుకొచ్చారు. తర్వాత విషయం తెలుసుకున్న లక్ష్మీ నేరుగా పోలీసుల దగ్గరకు వెళ్లింది. తన కోడి పొరపాటున చిన్నారిని గాయపరిచిందని.. వదిలేయమని ప్రాధేయపడింది. కోడిని తమ సొంత కొడుకులా పెంచుకుంటున్నామని కన్నీళ్లు పెట్టుకొంది. దానికి ఎలాంటి అపకారం తలపెట్టొద్దని కోరింది. తర్వాత ఇరువుర్ని కూర్చోబెట్టిన పోలీసులు.. ఈ కేసును అక్కడే పరిష్కారం చేసి పంపారు.

ఝార్ఖండ్‌లో రోడ్డు ప్రమాదం
ఐదుగురి మృతి

రాంచీ: ఝార్ఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దేవధర్ జిల్లా కచ్చాబంద్లో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. సుమారు 30 మంది గాయపడ్డారు. ఓ చిన్నారితో పాటు మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. బాఘుమర గ్రామానికి చెందిన వీరంతా పక్కనున్న దుంకా జిల్లాలో ఓ రాజకీయపార్టీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని మధుపూర్ పోలీస్ అధికారి ఎ.ఉపాధ్యాయ్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సు బోల్తాపడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. గాయపడిన వారిలో కొందరు స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి రాజ్ పలివార్ బాధితులకు రూ.50వేలు తక్షణ సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.





కర్నాటక ఎన్నికల ప్రచారంలో ప్రియాంక

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ తరపున ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగ వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన ప్రియాంకగాంధీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో కూడా ప్రచారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కర్ణాటక రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ హెచ్.కె.పాటిల్ మీడియాతో మాట్లాడుతు త్వరలో ఇందుకు సంబంధించిన తేదీలను ప్రకటిస్తామన్నారు. మేనిఫెస్టోపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు వెల్లడించారు. 1999లో లోక్‌సభ ఎన్నికల్లో సోనియాగాంధీ కర్ణాటకలోని బళ్లారి స్థానం నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లోనే ప్రియాంకగాంధీ తొలి సారి ప్రచారం నిర్వహించారు. నాటి ఎన్నికల్లో సోనియాగాంధీ భాజపా నేత సుష్మా స్వరాజ్‌పై ఘన విజయం సాధించారు.



పౌరసత్వ సవరణ బిల్లు..
ఈశాన్య భారత్‌కు వ్యతిరేకం

- ప్రముఖ మణిపురి సినీ దర్శక, నిర్మాత అరిబం శ్యాం శర్మ

న్యూఢిల్లీ: ప్రముఖ మణిపురి సినీ దర్శక, నిర్మాత సంచలన ప్రకటన చేశారు. పౌరసత్వ సవరణ బిల్లు స్థానికులకు, ఈశాన్య భారతదేశ ప్రజలకు ప్రతికూలమైనదని చెప్తూ, ఈ బిల్లును వ్యతిరేకిస్తూ తాను తన 'పద్మశ్రీ' పురస్కారాన్ని తిరిగి ఇచ్చేస్తానని హెచ్చరించారు.వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వారికి ఇచ్చే పురస్కారాల్లో 'పద్మశ్రీ' 14వ స్థానంలో ఉంది. అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' పౌరసత్వ సవరణ బిల్లు, 2016 ఈశాన్య రాష్ట్రాలు, మణిపూర్ స్థానికుల ప్రయోజనాలకు వ్యతిరేకమైనది. మణిపూర్ ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిని ఆమోదించేందుకు నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది" అని శర్మ అన్నారు.

'పద్మశ్రీ' పొందడం చాలా గౌరవప్రదమని, భారతదేశంలో అత్యున్నత గుర్తింపుల్లో ఇది ఒకటి అని చెప్పారు. అందుకే తాను నిరసన వ్యక్తం చేయడానికి ఇదే సరైన విధానమని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇషనౌ", "ఇమాగి నింగతెమ్" వంటి సినిమాలు శర్మకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఆయనకు 2006లో 'పద్మశ్రీ' పురస్కారం లభించింది.

గవర్నర్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

భోపాల్: మధ్య ప్రదేశ్ గవర్నర్ ఆనంది బెన్ పటేల్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. గవర్నర్ బీజేపీ ఏజెంట్గా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. ఆనంది బెన్ శనివారం రేవా జిల్లాలోని గఢ్లో పర్యటించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ డిమాండ్ చేసింది. మోదీని చూడాలని గ్రామస్థులకు ఆనంది బెన్ చెప్పినట్లు కాంగ్రెస్ ఆరోపించింది.

మధ్య ప్రదేశ్ శాసన సభకు గత నవంబరు 28న ఎన్నికలు జరిగాయి, డిసెంబరు 11న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, కాంగ్రెస్ విజయం సాధించింది. ముఖ్యమంత్రి పదవి కోసం యువ నేత జ్యోతిరాదిత్య సింధియా, సీనియర్ నేత కమల్నాథ్ పోటీ పడ్డారు. సీనియారిటీకి కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యం ఇవ్వడంతో కమల్నాథ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరానికి ఎదురుదెబ్బ

ఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరానికి ఐఎన్ఎక్స్ మీడియా కేసులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ఆరోపణలు ఎదుర్కొంటుండగా తాజాగా చిదంబరంను ప్రాసిక్యూట్ చేసేందుకు సీబీఐకి న్యాయమంత్రిత్వ శాఖ అనుమతి లభించింది. కేసులో సేకరించిన సాక్ష్యాధారాలను సమర్పించిన మీదట చిదంబరంపై న్యాయపరమైన చర్యలతో ముందుకెళ్లేందుకు గతంలో న్యాయమంత్రిత్వ శాఖను దర్యాప్తు సంస్థ ఆశ్రయించిన సంగతి తెలసిందే. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరం కస్టడీ విచారణ అవసరమని సీబీఐ, ఈడీ ఈనెల 25న ఢిల్లీ హైకోర్టులో పేర్కొన్నాయి. కాగా ఎయిర్సెల్‌మ్యాక్సిస్ కేసులో చిదంబరాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన క్రమంలో తాజా పరిణామాలు ఆయనకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐఎన్ఎక్స్ మీడియాలో విదేశీ పెట్టుబడులకు క్లియరెన్స్ ఇచ్చే క్రమంలో పెద్దమొత్తంలో ముడుపులు ముట్టాయని చిదంబరంతో పాటు ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై సీబీఐ ఆరోపిస్తోంది.



తెలుగు విద్యార్థులకు అండగా 'ఆటా'

డెట్రాయిట్: అమెరికాలో నకిలీ విద్యార్థి వీసా కేసులో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు అమెరికా తెలంగాణ సంఘం(ఆటా) బాసటగా నిలిచింది. డెట్రాయిట్, బాటిల్ గ్రీక్ లోని డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్న విద్యార్థుల తరపున వాదించేందుకు ఆటా చర్యలు చేపట్టింది. విద్యార్థుల తరపున వాదించేందుకు చికాగో ఇమ్మిగ్రేషన్ అటార్నీలను ఏర్పాటు చేసింది. అటార్నీలతో పాటు డిటెన్షన్ సెంటర్లలో ఆటా ప్రతినిధులు పర్యటించారు. విద్యార్థుల కుటుంబ సభ్యుల ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకున్నామని, తమకు అందిన సమాచారం మేరకు చర్యలు చేపట్టామని అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సహాయం కావాల్సిన వారు email: Info@atausa.org లో సంప్రదించాలని కోరారు.



సిరియాలో ఓ భవనం కూలి 11 మంది మృతి

డమాస్కస్: సిరియాలో జరుగుతున్న అంతర్యుద్ధం కారణంగా.. దెబ్బతిన్న ఓ భవనం కుప్పకూలి 11 మంది మరణించారు. ఈ దుర్ఘటన అలెప్పోలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వీరంతా భవనం లోపల ఉన్నప్పుడు కుప్పకూలడంతో ప్రాణాలు కోల్పోయారు. ఒక్కరు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. సిరియాలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులకు, ప్రభుత్వానికి మధ్య గత కొన్నేండ్ల నుంచి అంతర్యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అలెప్పో నగరం 2012 నుంచి 2014 వరకు రెండు భాగాలుగా విడిపోయింది. ఒక భాగం ప్రభుత్వం ఆధీనంలో ఉండగా.. మరో భాగం ఐఎస్ఐఎస్ ఆధీనంలో ఉన్నది. తర్వాత సైన్యం 2016లో మొత్తం నగరాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద బోటు

- రెండు ఫుట్‌బాల్ కోర్టుల వైశాల్యానికి సమానంగా ఉంటుంది



ఇంటర్‌నేషనల్ డెస్క్: సినిమా చూసేందుకు థియేటర్లు.. ఇష్టమైన భోజనం ఆరగించేందుకు రెస్టారెంట్లు.. ఆర్ట్ గ్యాలరీలు.. ఈత కొలనులు అబ్బో.. షాపింగ్మాల్స్.. ఇలా చెప్పాలంటే చాలానే ఉన్నాయి.. ఇవన్నీ ఉన్నవి ఏ మల్టీకాంప్లెక్స్‌నో లేదా ఫైవ్ స్టార్ హోటల్లోనో కాదు.. ఈ ఫొటోలోని బోటు.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బోటుగా చరిత్రలోకెక్కనుంది. దాదాపు రెండు ఫుట్బాల్ కోర్టుల వైశాల్యానికి సమానంగా ఉంటుంది. 229 మీటర్ల పొడవుండే ఈ బోటు ఒక కొన నుంచి మరో కొన వరకు దాదాపు 24 బస్సులను ఒకేసారి పార్కింగ్ చేయొచ్చు. వల్కిరే ప్రాజెక్టుగా పిలిచే ఈ బోటును రూపొందించేందుకు దాదాపు రూ.56 వేల కోట్లు ఖర్చు కానుంది. ఇందులో దాదాపు 52 మంది అతిథులు, 92 మంది సిబ్బంది ఉండొచ్చు. ఇది గంటకు దాదాపు 46 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలదు. దక్షిణ కొరియాకు చెందిన చుల్వాన్ పార్క్కు ఇలాంటి బోటును తయారుచేయించుకోవాలని చిన్నప్పటి కల. ఇందుకోసం దాదాపు 8 నెలల పాటు బోటు డిజైనర్లతో మాట్లాడి.. ఆఖరికి పామర్ జాన్సన్ అనే డిజైనర్తో తనకు ఇష్టం వచ్చినట్లుగా డిజైన్ చేయించుకున్నాడు. ఇప్పటివరకు ప్రపంచంలోని అతిపెద్ద బోటు అరబ్ రాజు ఖలీఫా బిన్ జయెద్ అల్ నయన్ వద్ద ఉంది. ఇది 180 మీటర్ల పొడవు ఉంది.



వీసాల కేసులో విద్యార్థులకు సాయం

- భారత రాయబారి హర్షవర్ధన్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలో విద్యార్థి వీసా దుర్వినియోగం కేసులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్టు చేసిన విద్యార్థులకు అన్ని విధాలుగా సాయమందిస్తున్నట్లు అమెరికాలోని భారత రాయబారి హర్షవర్ధన్ తెలిపారు. వేర్వేరే ప్రాంతాల్లో అరెస్టయిన విద్యార్థులను కలిసేందుకు అధికారులను పంపినట్లు చెప్పారు. సోమవారం నాటికి వారందరిని కలిసి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ అంశానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని విద్యార్థులకు సాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు అమెరికాలోని భారత రాయబారి హర్షవర్ధన్ పేర్కొన్నారు.

ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ కిమ్ రాజీనామా

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవికి జిమ్ యోంగ్ కిమ్ రాజీనామా చేశారు. పదవీకాలం ఇంకా మూడేళ్లుండగానే ఆయన అర్ధంతరంగా తప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రైవేట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ సంస్థలో చేరే ఉద్దేశంతో ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవికి కిమ్(58) రాజీనామా చేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. కొత్త చీఫ్ నియమితులయ్యేదాకా వరల్ బ్యాంక్ సీఈవో క్రిస్టలీనా జార్జియేవా తాత్కాలిక ప్రెసిడెంట్గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. కిమ్ ఆరేళ్లుగా ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవిలో కొనసాగుతున్నారు. కిమ్ పదవీకాలం వాస్తవానికి 2022 నాటికి ముగియాల్సి ఉంది. కరువు, కాందిశీకుల సమస్యలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో పేదల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రపంచ బ్యాంకుకు ఉందని కిమ్ పేర్కొన్నారు. వృత్తి రీత్యా వైద్యుడైన కిమ్.. దక్షిణ కొరియా దేశానికి చెందినవారు. ముందుగా వరల్ హెల్త్ ఆర్గనైజేషన్లో అడ్వైజర్గా చేరి, ఆ తర్వాత వరల్ బ్యాంక్లో అంచెలంచెలుగా ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు.

స్థిరంగా ఎదుగుతున్న చైనా ఆర్థిక వ్యవస్థ

- జీ జింగ్‌పింగ్



బీజింగ్: చెనా ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతోందని ఆ దేశ అధ్యక్షుడు జీ జింగ్‌పింగ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అమెరికాతో పోటీ పడుతూ ప్రపంచంలో రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామన్నారు. మరింత బలోపేతమయ్యేందుకు రిస్క్‌తో కూడుకున్న సంస్కరణలు తీసుకుంటున్నామన్నారు. ఫిబ్రవరి 5న లునార్ నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన మాట్లాడుతూ, 2017లో 6.8 శాతం వృద్ధిని కనబరిచిన చైనా 2018లో కాస్త మందగించి 6.6 వృద్ధిని సాధించిందన్నారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా మార్కెట్లో అమెరికన్ వస్తువులను మార్కెట్ చేసుకునేందుకు వీలుగా 375 బిలియన్ డాలర్ల డెఫిసిట్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)ను తగ్గించాలని కోరిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఒక నిర్ణయానికి రావడానికి ఇరు దేశాలు మార్చి 1వ తేదీని డెడ్‌లైన్‌గా పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జీ జింగ్‌పింగ్ దేశంలో పేదరిక నిర్మూలనకు, జనాభా నియంత్రణ కోసం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. రక్షణ, సైనిక రంగాల్లోను సంస్కరణలు తేవాలని భావిస్తున్నారు. చైనా ప్రజలు స్థిరత్వం కలిగిన వారు. వారి భద్రత, సంతోషం కోసమే సంస్కరణలు తెస్తున్నామని ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు.

మతాన్ని అనుసరిస్తే..!

- పార్టీ , పదవుల నుంచి అధికారులను తొలిగించిన చైనా

బీజింగ్: ఆధ్యాత్మిక అంశాలను, మతాన్ని విశ్వసించడంతోపాటు టిబెట్ నేత దలైలామాతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలపై పార్టీకి చెందిన అధికారులపై చైనా అధికార కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కొరడా ఝుళిపించింది. ఈ మేరకు ముగ్గురు పార్టీ అధికారులను పార్టీ నుంచి, పదవుల నుంచి తొలిగించింది. పది మంది పార్టీ అధికారులకు హెచ్చరికలను జారీ చేసింది.



కుమార్తెను కాపాడాలంటూ సుష్మకు వినతి

హైదరాబాద్: ఒమన్లో చిక్కుకున్న తన కుమార్తెను కాపాడాలంటూ హైదరాబాద్కు చెందిన ఓ మహిళ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కోరారు. ఉద్యోగం నిమిత్తం ఒమన్ వెళ్లిన తన కుమార్తె ఉచ్చులో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాదుకు చెందిన షహీదా బేగం అనే మధ్యవర్తి ద్వారా తన కూతురు ఒమన్‌కు వెళ్లిందని తెలిపారు. బాధితురాలి తల్లి రషీదా బేగం మాట్లాడుతూ షహీదా అనే మధ్యవర్తి ఉద్యోగం ఇప్పిస్తానంటూ మమ్మల్ని సంప్రదించింది. నెలకు రూ.25 వేల వరకు జీతం ఇస్తారని నమ్మబలికింది. ఆమెపై నమ్మకంతో నా కుమార్తెను గత డిసెంబరు 9న ఒమన్‌కు పంపాను. కానీ అక్కడికి చేరుకున్న తరవాత నా కుమార్తెను ఓ కార్యాలయంలో బంధించారు. అనుమతి లేకుండానే అనేక ప్రాంతాలకు తరలిస్తున్నారు. కనీసం సరైన ఆహారం కూడా ఇవ్వడం లేదు. దీనిపై మధ్యవర్తి షహీదాను సంప్రదించగా రూ.రెండు లక్షలు డిమాండ్ చేస్తోందని ఫిర్యాదు చేశారు. తన కూతురు ఎంతో వేదనను అనుభవిస్తోందని, వీలైనంత త్వరగా మధ్యవర్తుల చెర విడిపించాలంటూ రషీదా సుష్మా స్వరాజ్‌ను కోరారు.



యుఏఇని సందర్శించిన పోప్..

అబుధాబి: పోప్ ఫ్రాన్సిస్ యుఏఇకి ఆదివారం పర్యటనకు వచ్చారు. చరిత్రలో తొలిసారిగా ఒక పోప్ ఇస్లామ్ జన్మించిన దేశ పర్యటనకు రావడం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ పర్యటనలో ఆయన వందలాది మంది క్యాథలిక్కుల సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం సోమవారం జరిగే ఇంటర్ రిలీజీయస్ సమావేశంలో ఆయన పాల్గొంటారు. స్థానిక మీడియా కథనం ప్రకారం... పోప్ ఆదివారం రోమ్ ఫియమిసినో విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు. రాత్రి 10 గంటలకు ఆయన అబూధాబీ చేరుకుంటారు. తన పర్యటన సందర్భంగా పోప్, తాను అంతర్జాతీయ సమాజంతోను, అన్ని రాజకీయ పార్టీలతోనూ అందరికి ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలను గౌరవించాలని కోరనున్నారు. దీర్ఘకాలం కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా పెద్ద సంఖ్యలో పిల్లలు ఆకలితో బాధపడుతున్నారే తప్ప ఆహార నిల్వలు పెరగడం లేదన్నారు. ఆకలితో అలమటిస్తున్న పిల్లల, వారి తల్లిదండ్రుల ఆర్తనాదాలు ఇప్పటికే దేవునికి చేరాయన్నారు.

పోప్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న క్యాథలిక్కుల సమావేశంలో పాల్గొనేందుకు యుఎఇలో నివసిస్తున్న విదేశీయులు ముఖ్యంగా ఫిలిప్పైన్స్, భారతీయులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇప్పటికే 1,35,000 మంది జెడ్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు అరుదెంచారు. సమావేశ స్థలానికి ఆవల భారీ వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సమావేశంలో పాల్గొనేందుకు పాస్‌ల కోసం బారులు తీరారు. పోప్ రాక ప్రపంచం ఎదురు చూస్తున్న సహనశీల వాతావరణం పెంచేందుకు ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా యుఎస్‌కు చెందిన 39 సంవత్సరాల ఒక మాతృమూర్తి అభిప్రాయపడింది. భారత్ నుంచి వచ్చిన పలువురు తమకు దొరికి అరుదైన అవకాశంగా పేర్కొన్నారు.



రాణి సంరక్షణ కోసం యూకే సీక్రెట్ ప్లాన్

లండన్: బ్రెగ్జిట్ నేపథ్యంలో బ్రిటన్ రాణి ఎలిజబేత్ 2 భద్రత కోసం రహస్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఆందోళనల నేపథ్యంలో వచ్చే నెలలో బ్రెగ్జిట్ విషయంపై ఎలాంటి ఒప్పందం జరిగే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో రాణి ఎలిజబేత్‌తో పాటు రాచకుటుంబానికి చెందిన వారి కోసం ఈ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

మార్చి 29న 28 మంది సభ్యులు కలిగిన యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ వైదొలిగింది. అయితే దీనిపై వ్యతిరేకత కూడా పెరిగిపోతుండడంతో అక్కడి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు చేపట్టింది. మార్చి 29వ తేదీ వరకు డెడ్‌లైన్‌గా ఉన్నప్పటికీ యుకె, ఇయులు ఒక ఒప్పందానికి రావడంలో విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో లండన్‌లో కాకుండా ఒక రహస్య ప్రదేశంలో ఉండడానికి రాణి, ఆమె భర్త ప్రిన్స్ ఫిలిప్ అంగీకరించారని, అయితే ఈ విషయాన్ని బయటికి పొక్కకుండా చూడాలని నిర్ణయించినట్టు సమాచారం.



తవ్వకాల్లో మరిన్ని ఈజిప్టు మమ్మీలు ..!

కైరో: ఈజిప్టులో పురాతత్వ శాస్త్రవేత్తలు తాజాగా మరిన్ని పురాతన మమ్మీలను కనుగొన్నారు. ఇటీవల వారు ఒక పురాతన శ్మశానాన్ని గుర్తించారు. దీనిలో దాదాపు 50 మమ్మీలను వెలికితీశారు. వీటిల్లో 12 చిన్న పిల్లల శరీరాలను భద్రపర్చినవిగా పేర్కొన్నారు. ఈజిప్టులోని తూర్పు మల్లావిలో టునా ఎల్ గెబల్ అనే ఒక ప్రదేశంలో తొమ్మిది మీటర్ల లోతైన గదులను కనుగొన్నారు. వీటిల్లో ఈ మమ్మీలను గుర్తించారు. ఇవి రోమన్ లేదా బైజాన్టియన్ కాలం నాటివిగా భావిస్తారు. 50 మమ్మీల్లో 40 పూర్తిగా వెలికితీశారు. ఈ విషయాన్ని ఈజిప్టు పురావస్తు విభాగం సుప్రీం కౌన్సిల్ సెక్రటరీ జనరల్ ముస్తఫా వజీరీ పేర్కొన్నారు.

కొన్ని మమ్మీలపై నాటి భాషలో రాసిన విశేషాలు ఉన్నాయి. ఈజిప్షియన్ కాలంలో దీనిని సాధారణ ప్రజలు వినియోగించేవారని పేర్కొన్నారు. ఈ మమ్మీలను చాలా వరకు కుండల్లో భద్రపర్చారు. మిన్యా విశ్వవిద్యాలయం నేతృత్వంలో చేపట్టిన ఈ సంయుక్త కార్యక్రమంలో తొలిసారి ఈ మమ్మీలను కనుగొన్నారు.

యూకే ప్లాంట్‌కు పెట్టుబడుల విరమణ

లండన్ : యూకేలో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనను నిస్సాన్ రద్దు చేసుకుంది. జపాన్‌కు చెందిన కార్ల తయారీదారు నిస్సాన్ ఇంగ్లాండ్‌లో ఎక్స్ –ట్రయల్ ఎస్‌యువి ప్లాంట్‌ను నెలకొల్పాలని నిర్ణయించింది. అయితే బ్రెగ్జిట్ విషయంలో యుకె నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో రద్దు చేసుకున్నారు. యుకెకు, ఇయుకు మధ్య సంబంధాల్లో నెలకొన్న అనిశ్చితి కూడా ఇందుకు కారణమని నిస్సాన్ యూరోప్ ఛైర్మన్ గియాన్లుకా డి ఫిచ్చి ఒక ప్రకటనలో తెలిపారు.



చలికి తట్టుకోలేక 12 మంది మృతి..

వాషింగ్టన్: అమెరికాను చలి పులి వణికిస్తూనే ఉంది. పలు రాష్ట్రాలు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలతో గడ్డకట్టుకుపోతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచు కారణంగా చలికి తాళలేక 12 మందికి పైగా మృత్యువాత పడ్డారు. డెట్రాయిట్లో కాలువలన్నీ గడ్డకట్టుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో జలపాతాలు కూడా గడ్డకట్టాయి.

మరో 24 గంటలు మైనస్ 29 డిగ్రీల నుంచి మైనస్ 46 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా పాఠశాలలు, వ్యాపారాలు మూతపడ్డాయి. విమానాలు, రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లను వెచ్చబరిచేందుకు వాడే థర్మోస్టార్ల వాడకాన్ని తగ్గించాల్సిందిగా ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. వృద్ధులు, నిరాశ్రయుల కోసం వందలాదిగా వార్మింగ్ కేంద్రాలు వెలిశాయి. కెనడాలో సైతం మైనస్ మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



వెనిజులాలో.. పోటాపోటీ ర్యాలీలు..

వెనిజులా: వెనిజులాలో ప్రతిపక్ష నాయకులు జువాన్ గుయాడియో, సోషలిస్టు నాయకుడు నికోలాస్ మధురోల నాయకత్వంలో పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. గత కొంత కాలంగా రాజకీయంగా అనిశ్చితి నెలకొన్న వెనిజులాలో ర్యాలీ సందర్భంగా ర్యాలీ సందర్భంగా జువాన్ మాట్లాడుతూ, వెనిజులాకు ఫిబ్రవరి మాసం నిర్ణయాత్మక మాసం కాబోతుందని జోస్యం చెప్పారు.



నైజీరియాలో బోకోహరామ్ నరమేధం

- 60 మంది పౌరుల ఊచకోత

లాగోస్: బోకోహరామ్ తీవ్రవాదులు దాదాపు 60 మంది సాధారణ పౌరులను చంపారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. ప్రజలను మూకుమ్మడిగా నిప్పుపెట్టి చంపారన్నది. నైజీరియాలోని రాన్ పట్టణం లోపల 11 మృతదేహాలను, పట్టణం వెలుపల 49 శవాలను గుర్తించామని తెలిపింది. మృతదేహాలకు బుల్లెట్ గాయాలూ ఉన్నాయన్నది. ఇప్పటికే 50 మంది ప్రజల ఆచూకీ తెలువడం లేదని ఆమ్నెస్టీ నైజీరియా డైరెక్టర్ ఓసాయ్ ఒజిగో పేర్కొన్నారు. నైజీరియాలో జరుగుతున్న రక్తపాతం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బోకోహరామ్ నుంచి ప్రాణ రక్షణకు ప్రజలు పక్కదేశాలకు వలసవెళ్తున్నారని, కొందరు ఇండ్లు కోల్పోయి తిండి తిప్పలు లేక సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు.

ఫిదా



అగ్గి పెట్టెలో పట్టేంత చీర నేసినందుకు!

పద్మశ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా 'మల్లేశం'. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరలను నేసి ప్రపంచాన్ని అబ్బుర పరిచిన వ్యక్తి అతడు. తను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత మల్లేశం సొంతం. ఇలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా మల్లేశం సినిమా తెరకెక్కుతుంది. రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. ఇందులో మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. చిత్రయూనిట్ సిరిసిల్ల జిల్లాలో ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేసారు. బాబు శాడిలాస్య ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. లక్ష్మణ్ ఆలే ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు.

విమర్శకుల ప్రశంసలు అందుకున్న సౌండ్ డిజైనర్ నితిన్ లుకోస్ ఈ చిత్రానికి సౌండ్ డిజైన్ చేస్తున్నారు. మార్క్ కే రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

పెద్దింటి అశోక్ కుమార్ ఈ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ప్రముఖ రచయిత గోరేటి వెంకన్న, చంద్రబోస్ ఈ చిత్రానికి పాటలు రాస్తున్నారు. వెంకట్ సిద్ధిరెడ్డి ఈ చిత్రానికి ఎగ్జిగ్యూటివ్ నిర్మాతగా కొనసాగుతున్నారు.



గరుడవేగలానే కల్కి ఓ కొత్త ఫీల్‌తో..

యాంగ్రీ స్టార్ రాజశేఖర్ కథానాయకుడుగా శివాని శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై డైనమిక్ ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్ నిర్మిస్తున్న సినిమా కల్కి. అ! సినిమాతో విమర్శకుల ప్రశంసల్ని ప్రేక్షకుల అభినందనల్ని అందుకున్న ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం రాజశేఖర్ పుట్టినరోజు కానుకగా ఈ సినిమా టీజర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జీవితా రాజశేఖర్ దంపతుల కుమార్తెలు శివానీ శివాత్మిక సినిమాటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర తదితరులు పాల్గొన్నారు. రాజశేఖర్ బర్త్‌డే కేక్ కట్ చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. గరుడవేగ తర్వాత ఏం చేయాలి అనుకుంటున్నప్పుడు ఆరేడు నెలలు కథ కోసం అన్వేషించాం. అప్పుడే కథ ఓకే చేసి, ప్రశాంత్ వర్మ డేట్స్ కోసం ఎదురు చూశాం. గరుడవేగ కి ప్రవీణ్ సత్తారుతో పని చేసేటప్పుడు ఎంత కొత్తగా ఫీల్ అయ్యానో.... కల్కికి ప్రశాంత్ వర్మ తో పని చేసేటప్పుడు అంతే కొత్తగా ఫీల్ అవుతున్నా. చాలా రోజుల విరామం తర్వాత సి కళ్యాణ్ గారి సంస్థలో నేను నటిస్తున్న చిత్రమిది. నాకు ప్రమోషన్ వచ్చినట్టు భావిస్తున్నా. కళ్యాణ్ గారు విషయం లేకపోతే సినిమా చేయరు. కథ నచ్చడమే సినిమా విజయంలో ఓ మెట్టు ఎక్కినట్టు. పుట్టినరోజు నాడు కూడా షూటింగ్ చేస్తున్నాం. లోకంలో పని దొరకడం చాలా కష్టం నాకు పని కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. జీవితం అన్నది చాలా తక్కువ రోజులు. అంతా సంతోషంగా అందరితో మంచిగా జీవితాన్ని ముందుకు సాగించాలి అని కోరుకుంటున్నా' అన్నారు. నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ–"మా హీరోకి పుట్టినరోజు శుభాకాంక్షలు. సూపర్ డూపర్ హిట్ గరుడవేగ తర్వాత... డిఫరెంట్ సినిమా చేయాలనే ఉద్దేశంతో, విభిన్నమైన కథ తో చేస్తున్న చిత్రమిది. 1980 నేపథ్యంలో కథ సాగుతుంది. ఇంకా 30 పర్సెంట్ షూటింగ్ బ్యాలెన్స్ ఉంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో మిగతా షూటింగ్ పూర్తిచేసి మంచి తేది చూసి చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. శేషు తర్వాత రాజశేఖర్ గారితో నేను చేస్తున్న చిత్రమిది. నా సంస్థలో పనిచేయడం ప్రమోషన్ అని ఆయన అన్నారు" అన్నారు.



తాగి డ్రైవింగ్ చేయొద్దు.. కనెక్టయ్యింది!!

'అక్కడొకడుంటాడు' చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తోందని చిత్రబృందం వెల్లడించింది. శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రామ్ కార్తిక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక హీరోహీరోయిన్లుగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో లైట్ హౌస్ సినీమ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్ లోని ఫిలిం చాంబర్ లో జరిగిన సక్సెస్ మీట్‌లోటైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ చక్కని సమీక్షలు రావడం ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. డ్రంకన్ డ్రైవ్ పైన సందేశం అందరికీ నచ్చిందని అన్నారు. థియేటర్ల పరంగా సి.కళ్యాణ్ సాయానికి ధన్యవాదాలు తెలిపారు. నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గ చిత్రమిదని దర్శకుడు శ్రీపాద విశ్వక్ తెలిపారుఉ. నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మా బేనర్లో చేసిన మొదటి ప్రయత్నానికి విమర్శకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అన్నారు.



చెడ్డీ గ్యాంగ్ హల్ చల్

రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'చెడ్డీ గ్యాంగ్'. కనగాల రమేష్ చౌదరి దర్శకుడు. శ్రీనివాసరెడ్డి ముఖ్యపాత్రధారి. అమర్, ప్రదీప్వర్మ, ఉదయ్, అభి, సి.టి., ఖాదర్, లక్ష్మి, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ ఇతర తారాగణం. ఈ సినిమా టీజర్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. పద్మాలయ మల్లయ్య, సెన్సార్ సభ్యులు ఎంఎస్ రెడ్డి, గీత రచయిత లక్ష్మణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శకుడు రమేష్ చౌదరి మాట్లాడుతూ –"30ఏళ్లుగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో డైరెక్టర్‌గా పని చేశాను. ఈ సినిమాతో దర్శకుడిగా మారాను. పదిమంది సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళ్లి అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారనేదే ఈ చిత్రం కథాంశం. సింగిల్ లైన్‌లో విక్కీరాజ్ కి కథ చెప్పాను. కేరళ వెళ్లి ఓకే చేశాక.. ఈ సినిమా మొదలైంది. 125 రోజులు షూటింగ్ తీశాం" అన్నారు.



లక్ష కోటి 100 కోట్లు షేర్

టాలీవుడ్ బాక్సాఫీస్ ఇంతింతై..



వందేళ్ల భారతీయ సినిమా హిస్టరీలో టాలీవుడ్ చరిత్ర పెద్దదే. దాదాపు 85 ఏళ్లు పైగా తెలుగు సినీపరిశ్రమ ఇంతింతై అన్న చందంగా ఎదుగుతూనే ఉంది. ఇప్పటికి మన పరిశ్రమ ఎదిగిన తీరు అసమానం. బాక్సాఫీస్ లెక్కల్ని కొలమానంగా భావిస్తే.. లక్ష షేర్ మొదలు.. కోటి షేర్ క్లబ్, అటుపై 50కోట్ల షేర్ క్లబ్.. 100కోట్ల షేర్.. అంటూ ఇప్పటికి ఒక రేంజ్‌ను టచ్ చేసింది. బాహుబలి సిరీస్ ఘనవిజయం అనంతరం నాన్ బాహుబలి కేటగిరీ సినిమాలు అద్భుతంగా వసూళ్లు తెస్తున్నాయి. రంగస్థలం, భరత్ అనే నేను వంటి బ్లాక్ బస్టర్లు 100కోట్ల షేర్ వసూలు చేశాయి. ఎంత దూరం అయినా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది.. అటుపై ఎంత ఎత్తుకైనా ఎదిగేస్తామని నిరూపణ అయ్యింది.

టాలీవుడ్ బాక్సాఫీస్ చరిత్రను పరిశీలిస్తే.. తొలిగా 1933లో రిలీజైన 'సతీ సావిత్రి' లక్ష షేర్ అందుకుంది. త్యాగయ్య 25లక్షల షేర్, పాతాళ భైరవి 50లక్షల షేర్ అందుకున్నాయి. మాయా బజార్‌తో తొలిగా కోటి షేర్ దక్కింది. 25 కోట్ల షేర్ అందుకున్న తొలి సినిమా ఇంద్ర. ఇటీవలి సినిమాలు 100 కోట్ల షేర్, 200కోట్ల గ్రాస్ క్లబ్ లో చేరిపోతున్నాయ్. మునుముందు అంతకుమించి రికార్డులు నెలకొల్పే చిత్రాలు టాలీవుడ్ లో రానున్నాయి.

సతీ సావిత్రి మొదలు..

టాలీవుడ్ 85ఏళ్ల చరిత్రలో బాక్సాఫీస్ షేర్ వివరాలు పరిశీలిస్తే.. సతీ సావిత్రి(1933) చిత్రం టాలీవుడ్ లో తొలి లక్ష రూపాయల షేర్స్ అందుకుంది. ఆ తర్వాత త్యాగయ్య (1946) చిత్రం 25 లక్షల లాభాలు అందుకున్న మూవీగా రికార్డులకెక్కింది.

మాయా బజార్‌తో కోటి

పాతాళ భైరవి(1951) 50లక్షల షేర్స్ అందుకున్న తొలి చిత్రం, అయితే మాయ బజార్ (1957) కోటి రూపాయల షేర్స్ అందించిన మొట్ట మొదటి తెలుగు సినిమాగా రికార్డులకెక్కింది. లవకుశ (1963) 1.25కోట్లు వసూలు చేసింది. దసరా బుల్లోడు (1971) 1.5 కోట్ల షేర్, అల్లూరి సీతారామరాజు(1974) 2 కోట్ల షేర్, అడవి రాముడు (1977) 3.25 కోట్ల షేర్, ప్రేమాభిషేకం (1981): 4 కోట్ల షేర్, యముడికి మొగుడు(1988) 5 కోట్ల షేర్, చంటి (1992) 9 కోట్ల షేర్స్, ఘరానా మొగుడు (1992) 10 కోట్ల షేర్, పెద రాయుడు (1995)12 కోట్ల షేర్, సమరసింహారెడ్డి (1999) 15 కోట్ల షేర్, నువ్వే కావాలి (2000) 19.5 కోట్ల షేర్, నరసింహ నాయుడు(2001) 20 కోట్ల లాభం అందించిన చిత్రం..గా నిలిచాయి.

ఇంద్ర నుంచి కొత్త మలుపు

ఇంద్ర(2002) 25 కోట్ల షేర్స్ తో సంచలనం సృష్టించి టాలీవుడ్ దశ దిశ తిప్పేసింది. మధ్యలో 50 కోట్ల షేర్ సాధించిన సినిమాలెన్నో. ఇటీవల రంగస్థలం (2018) 120 కోట్ల షేర్ (వరల్ వైడ్), భరత్ అనే నేను (2018) 121 కోట్ల షేర్ (వరల్ వైడ్) వసూలు చేసి సంచలనం సృష్టించాయి.

భవిష్యత్‌పై భారీ అంచనాలు

మునుముందు ఎస్.ఎస్.రాజమౌళి సహా పలువురు దర్శకులు తెరకెక్కిస్తున్న భారీ చిత్రాలు టాలీవుడ్ షేర్ రేంజును నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళతాయన్న అంచనాలు ఏర్పడ్డాయి. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఆర్.ఆర్.ఆర్, ప్రభాస్–సుజీత్–యువి క్రియేషన్స్ సాహో, చిరంజీవి–సురేందర్ రెడ్డి–రామ్ చరణ్‌ల సైరా, మహేష్ మహర్షి వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలకు తెర తీస్తాయో చూడాలి.





హాలీవుడ్ రేంజ్ హారర్ థ్రిల్లర్ 'అమావాస్య'

సచిన్‌జోషి, నర్గిస్ ఫక్రి నాయకానాయికలుగా వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకం పై తెరకెక్కుతున్న సినిమా 1920– ఈవిల్ రిటర్న్స్, రాగిని యంయంఎస్, అలోన్ లాంటి సూపర్‌హిట్ చిత్రాల దర్శకుడు భూషణ్ పటేల్ దర్శకత్వంలో రైనా సచిన్‌జోషి, దీపెన్ ఆమిన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 8న ప్రపంచవ్యాప్తంగా సినిమా రిలీజవుతోంది. ప్రముఖ నిర్మాత సి కళ్యాణ్ మాట్లాడుతూ నాకు హర్రర్ జోనర్ అంటే చాలా ఇష్టం. నేను ఇప్పటి వరకు చాలా హారర్ సినిమాలు నిర్మించాను. హారర్ జోనర్ ఎప్పుడూ విజయం సాధిస్తుంది. ఈ సినిమాలో సచిన్ చాలా బాగా కనపడుతున్నారు. సచిన్ మంచి నటుడు. తనకు చాలా వ్యాపారాలు ఉన్న సినిమా పై తనకు ఉన్న ఫ్యాషన్ తో నటిస్తున్నారు. ఆయన భార్య రైనా సచిన్ జోషి గారు నిర్మాతగా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. తప్పక విజయం సాధించే చిత్రమిది.. అన్నారు. సచిన్ జోషి మాట్లాడుతూ –" హారర్ సినిమా చేయాలని ఎదురు చూస్తున్న సమయంలో భూషణ్ పటేల్ నాకు ఈ స్క్రిప్ట్ గురించి చెప్పారు. నా గత చిత్రాలకు ఇది పూర్తి భిన్నమైన సినిమా. అమావాస్య ఓ క్లాసిక్ హారర్ మూవీ. తెలుగులో హారర్ చిత్రాలకు మంచి ఆదరణ దొరుకుతున్న సమయంలో మంచి కాన్సెప్టుతో సినిమా చేయడం ఆనందంగా ఉంది. అధునాతన వి.ఎఫ్.ఎక్స్ వర్క్‌ను ఉపయోగించాం. సినిమాను రెండు భాషల్లో చిత్రీకరించాం. ఎందుకంటే తెలుగు సినిమాకు నా తొలిప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుంది. ఈ చిత్రంలో నేను కరణ్ అనే పాత్రలో కనపడతాను. హాలీవుడ్ స్థాయిలో హారర్ చిత్రాన్ని అందించాలని ఛాలెంజింగ్‌గా భావించి ఈ సినిమా చేశాం..అన్నారు.



క్రికెటర్‌తో ఎఫైర్?

యంగ్ క్రికెటర్ కె.ఎల్.రాహుల్ తో బెంగళూరు బ్యూటీ నిధి అగర్వాల్ ఎఫైర్ గురించి చాలాకాలంగా వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. అయితే తమ మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని నిధి అగర్వాల్ తెలిపింది. ఇక టాలీవుడ్ లో తన డెబ్యూ గురించి మాట్లాడుతూ .. ఇరువురు అక్కినేని హీరోల సరసన నటించడం ఆనందాన్నిచ్చిందని, మిస్టర్ మజ్ను విజయం తనలో ఉత్సాహం నింపిందని తెలిపింది. తదుపరి ఈ భామ స్పీడ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఇస్మార్ట్ శంకర్ లో అవకాశం అందుకున్న సంగతి తెలిసిందే. రామ్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. తదుపరి నిధి అగర్వాల్ బాలీవుడ్ లో నూ పలు చిత్రాల్లో నటించనుందిట.



గులాబీ పెదాలకు..

కుంకుపువ్వు కలిపిన మిల్క్ క్రీమ్‌ను పెదాలకు వాడితే, నల్లని పెదవులను గులాబీ రంగులోకి మార్చుతాయి. రోజులో ఎన్ని సార్లైనా దీన్ని ఉపయోగించుకోవచ్చు. స్ట్రాబెర్రీ, రాస్బ్రెర్రీల జ్యూస్‌ను పెదవులకు రాసుకుంటే పెదవులు నాజూగ్గా తయారవుతాయి. రాస్బ్రెర్రీ, తేనె, కలబంద రసాలను పేస్ట్‌లా కలిపి పెదాలకు రాసుకొని 10 నిమిషాల పాటు ఉంచి, పొడి బట్టతో తుడిచేయాలి. తర్వాత లిప్‌బామ్ వాడితే మంచి ఫలితం ఉంటుంది. తాజా మంచు గడ్డలను పెదాలకు రాయడం వలన పెదాలకు తేమని అందించడమే కాకుండా, హైడ్రేటేడ్‌గా ఉంచుతాయి.

ఉద్వేగాన్ని అదుపు చేయండిలా..

అందరికీ భావోద్వేగాలు వుండటం సహజం. అవి సందర్భాలను బట్టి ఒక్కొక్కటి ఒక్కో విధంగా బయటకు వస్తూ వుంటాయి. సంతోషపు భావోద్వేగాలు ఆరోగ్యానికి చాలావరకు మంచి చేస్తాయి కాబట్టి వాటి గురించి చర్చించుకోవాల్సిన అవసరం అంతగా లేదు. కానీ కోపం లాంటి భావోద్వేగం ఆరోగ్యానికి హానికరం. మనుషులు మానసికంగా కృంగిపోతున్న సమయంలోనే కోపం ఎక్కువగా వస్తుంది. అలా కాకకుండా ప్రతిచిన్న విషయాలకు కోపాద్రిక్తులైతే మాత్రం ఆరోగ్యానికి హానికరమైన సంకేతాలుగా చెప్పకోవచ్చు.



కోపాన్ని చాలావరకు వదిలేస్తేనే మంచి, లోపలే అణుచుకుంటే మాత్రం ఆరోగ్యానికి విషపూరితంగా మారిపోతుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా కోపం ఏదోఒకరకంగా హానికరమైన సంకేతంగానే నిలుస్తుంది. అటువంటి సమయాల్లో కోపాన్నే అదుపులో వుంచుకుంటే చాలా మంచిది. మరి ఈ కోపాన్ని అదుపులో వుంచే హెల్తీ మార్గాలేంటో ఒకసారి తెలుసుకుందాం...

ఒత్తిడితో వచ్చే ఆవేశం..

సహజంగా కోపం అనేది కొన్ని కారణాల వల్ల వస్తుంది కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ఇంట్లో వున్నవారితో వాగ్వాదానికి దిగడం లాంటి ఇతర కారణాల వుండొచ్చు. అలాంటి సమయాల్లో కోపం వస్తుందనిపిస్తే, వాటికి కూడా దూరం పాటిస్తేనే మంచిది. కోపం వచ్చే సమయంఠ వెంటనే బయటకువెళ్లి, కోపాన్ని వదిలేసి ప్రశాంతంగా ఊపరి పీల్చుకోవాలి. ఎందుకంటే శరీరంలో ఎక్కువ ఆక్సిజన్ చేరి కోపాన్ని చాలావరకు తగ్గించి, మెదడులో వుండే ఒత్తిడి(స్ట్రెస్)ను తగ్గించి శాంతపరుస్తుంది.

కోపాన్ని కూడా వ్యక్తపరచాలి..

కొంతమంది భావోద్వేగాలను వ్యక్తపరచకుండా తమ మనసులోనే దాచుకుంటారు. ఎవరైనా ఎప్పుడూ అసంతృప్తికి గురిచేస్తుంటే వారికి స్ట్రెయిట్‌గా సమాధానం చెప్పడానికి భయపడుతుంటారు. అలాగే మనసులో వున్న కోరికలను, బాధను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడరు. అలాకాకుండా.. మనసులో వున్న భావోద్వేగాలను ఎప్పటికప్పుడు ఇతరులతో, బంధువులతో, స్నేహితులతో పంచుకుంటేనే మంచిది. అలాగే ఎవరైనా సహనాన్ని పరీక్షించి, అసహనానికి గురిచేసే వారికి స్ట్రెయిట్‌గా సమాధానం చెప్పేయాలి. అలా చేయకపోతే మానసిక ఒత్తిడికి లోనయి, ఎక్కువ కోపానికి గురవుతారు.



కోపం వస్తే, బయటికి వచ్చేసెయ్యాలి..

ఇంట్లో తల్లిదండ్రులతో లేదా భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు వివాదాలు చోటు చేసుకోవడం సహజమే. ఆ సమయంలో ఎక్కువ కోపానికి గురవ్వకుండా, మనసులో వున్న అన్ని భావేద్వేగాలను చంపుకోవాలి. ప్రతి దానికి కోపం తెచ్చుకుంటే అధిక స్ట్రెస్‌కు లోనయి అనారోగ్య పరిస్థితికి గురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి కోపాద్రిక్తులైన పరిస్థితుల్లో వెంటనే బయటకు వచ్చేసి స్నేహితులతో కలిసిపోయి ప్రశాంతమైన వాతావరణానికి చేరుకుంటే మంచిది. వారితో గడిపిన సంతోష ఘడియలు, అల్లరి చేష్టలు గుర్తు చేసుకుంటే, మనసులో వుండే కోపం పూర్తిగా తొలగిపోయి మెదడులో వుండే మొత్తం స్ట్రెస్ తగ్గిపోతుంది.

కోపంలో డైరీ రాసేయండి..

ఎవరైనా కొంతమంది నచ్చని కొన్ని విషయాలను చెప్తే వెంటనే కోపంగా రియాక్ట్ అవుతుంటారు. అలాగే తొందరపాటు నిర్ణయాలతో తప్పుడు పనులు కూడా చేస్తుంటారు. వెంటనే రియాక్ట్ కాకుండా కొద్దిసేపటివరకు కూల్‌గా ఆలోచించిన తర్వాత స్పందిస్తే మంచిది. ఆలోచించేంత సమయం లేకపోతే వెంటనే నచ్చిన పనిని అప్పటికప్పుడు నిర్వహిస్తే కోపం తగ్గే అవకాశాలు చాలా వుంటాయి. ఎక్కువ కోపానికి గురైనప్పుడు తమ భావోద్వేగాలను ఇతరుల మీద ప్రదర్శించకుండా వాటిని ఒక డైరీలోనో లేదా సోషల్ నెట్ వర్కింగ్ బ్లాగుల్లో రాసుకుంటుంటే కోపం తగ్గే అవకాశం ఉంటుంది.

ధ్యానం ప్రధానం..

ప్రతిరోజూ ధ్యానం చేస్తే భావోద్వేగాల విషయంలో శక్తివంతమైన పట్టు సాధించడానికి దోహదపడుతుంది. ధ్యానం చేయడం వల్ల మెదడు చాలా ప్రశాంతంగా వుంటుంది. అలాగే వెంటనే కోపం రాకుండా ఉంచుతుంది ధ్యానం. దీంతో మానసికంగా ఎటువంటి ఒత్తిళ్లు వుండవు. శరీరం కూడా ప్రశాంతంగా వుంటూ, ఆరోగ్యంగా వుండటానికి సహాయపడుతుంది. కాబట్టి ప్రతిరోజూ సమయానుకూలంగా ధ్యానం చేస్తే చాలా మంచిది.





'చిటికె'లో సాధ్యం..!

- చపాతీ పిండిని పాలు లేదా గోరువెచ్చని నీళ్ళు లేదా కాస్త నూనె కలిపి గంటపాటు నానబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- బియ్యం, తృణ ధాన్యాలను నిల్వ ఉంచిన డబ్బాలో నాలుగు పసుపు కొమ్ములు లేదా వెల్లుల్లి రేఖలు వేస్తే పురుగు పట్టకుండా ఉంటాయి.
- పదార్థాలు మాడిపోయి పెనం నల్లగా తయ్యరైతే దానిమీద సబ్బునీళ్ళు పోసి సన్నటి సెగ మీద ఉంచి చల్లారాక రుద్దితే శుభ్రపడుతుంది.

మాటే మంత్రం..



ఏకాగ్రతతో చేసే
ప్రతి పనీ తపస్సే..
ముందో, వెనకో దానికి
ఫలితం తప్పదు..



టమోటా రైస్



టమోటో రైస్ సౌత్ ఇండియన్ స్పెషల్ రైస్. సహజంగా ఈ రైస్ ను పండగల సమయాల్లో కూడా సింపుల్ గా , సులభంగా అవుతుందని చేసేస్తుంటారు. టమోటో రైస్ కు కాంబినేషన్ గా పపాడ్స్, రైతా వంటివి సైడ్ డిష్ గా తయారుచేసుకుంటారు. టమోటో రైస్ సింపుల్ గా రుచికరమైనది మాత్రమే కాదు, ఒక సారి టేస్ట్ చూస్తే మళ్ళీ మళ్ళీ తినాలనే కోరికను మీలో కలిగిస్తుంది. మీరు కూడా ఈ రుచికరమైన రైస్ రెసిపిని ట్రై చేయాండి.

కావలసిన పదార్ధములు

అల్లం (తొక్క తీసి అర అంగుళంలో ముక్కలుగా కట్ చేసినవి) 2 వెల్లుల్లి 4 రెబ్బలు, జీడిపప్పు 3, ఏలకులు 2, దాల్చిన చెక్క (1/2 అంగుళం ముక్కలు) 2 లవంగాలు, 6 టమోటా (సగానికి కట్ చేసినవి) 2 టమోటో (సగానికి కట్ చేసినవి) 1 నూనె 3 టేబుల్ స్పూన్లు, స్టార్ సొంపు 2 రేకులు, కల్పాసి మసాలా దినుసు (నల్ల రాయి పువ్వు) 1 స్పూన్ ఉల్లిపాయ (సన్నని మరియు పొడవైన ముక్కలుగా చేసివి) 1 కప్పు, పచ్చి మిర్చి (మద్యకు కట్ చేసిని), 2 పుదీనాఆకులు (సన్నగా తరిగినది), 1/4 కప్పు ఉప్పు: రుచికి సరిపడా, సాంబార్ పొడర్ 1 స్పూన్, రైస్ 1/2 గిన్నె, నీరు 1 గిన్నె. తయారు చేసే విధానంః 1. కుక్కర్‌లో బియ్యాన్ని తీసుకోండి. 2. సరిపడా నీరు మరియు ఉప్పు. 2 టీస్పూన్లు వేయాలి. 3. తర్వాత మూత పెట్టి, 2 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించుకోవాలి. 4. మిక్సీర్ జార్ అల్లం, వెల్లుల్లి వేసి పేస్ట్ చేసుకోవాలి. 5. తర్వాత జీడిపప్పును వేయాలి. 6. అలాగే ఏలకులు మరియు దాల్చిన చెక్క కూడా వేయాలి. 7. ఇంకా అదే జార్ లో 4 లవంగాలు మరియు 2 టమోటాలు(కట్ చేసినవి)వేసి మొత్తం మిశ్రమాన్ని మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. 8. మొత్తం మిశ్రమం మెత్తగా పేస్ట్ చేసి పక్కన పెట్టుకోవాలి. 9. వేడిచేసిన పాన్లో నూనె వేయండి. 10. తర్వాత 2 లవంగాలు మరియు దాల్చిన చెక్కను వేయాలి. 11. స్టార్ సొంపు మరియు కల్పాసి మసాలా దినుసును కూడా వేయాలి. 12. ఏలకులు మరియు ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి బాగా వేపుకోవాలి. 13. అలాగే సన్నగా తరిగిన పచ్చిమిర్చి, పుదీనా ఆకులు కూడా వేసి వేగించాలి 14. తర్వాత టమోటో ముక్కుల కూడా వేసి మొత్తం మిశ్రమాన్ని కలుపుతూ వేగించుకోవాలి. 15. ఇప్పుడు ఉప్పు వేసి మరో 2 నిముషాలు వేయించాలి. 16. ఇప్పుడు పాన్ లో ముందుగా మిక్సీ జార్ లో పేస్ట్ చేసి పెట్టుకున్న పేస్ట్ ను వేసి కలపాలి. 17. మొత్తం మిశ్రమాన్ని 5 నిముషాలు వేగించాలి, పచ్చివాసన పోయే వరకూ వేగించుకోవాలి. 18. అందులోనే కొంచెం సాంబార్ పొడిని కలిపి, 2 నిమిషాలు ఉడికించాలి. 19. తర్వాత వండిన అన్నం వేసి బాగా కలపాలి. 20. అంతే టమోటో రైస్ రెడీ మరో గిన్నెలోకి మార్చుకుని వేడి వేడిగా సర్వ్ చేయాలి.

టమోటా రసం

రసం అనేది చాలా కుటుంబాలలో రోజువారీగా తయారుచేసే సాంప్రదాయ దక్షిణ భారతీయ ఆహారంగా చెప్పవచ్చు. టమోటా రసం అనేది టమోటా మరియు భారతీయ మసాలా దినుసులతో కలిపి సుగంధ సూప్ గా తయారుచేస్తారు. దీనిని అందరు తినవచ్చు. సాధారణంగా అనారోగ్యంతో ఉన్న పిల్లలు మరియు పెద్దవారికి రసంతో భోజనం పెడతారు. ఈ రెసిపీలో పప్పుధాన్యాలు ఏమి ఉండవు. ఏది ఏమైనా రసం చిక్కదనం కోసం ఉడికించిన కందిపప్పును కలపవచ్చు. నిమ్మరసం, మిరియాలు రసం, ఉలవలు రసం వంటి అనేక రకాల రసాలను తయారుచేయవచ్చు. టమోటో రసం అనేది సాధారణంగా తయారు చేస్తారు. రసం చాలా సులభంగా తయారుచేసే ఆరోగ్యకరమైన మరియు రుచికరమైన దక్షిణ భారతీయ వంటకం. టమోటాలు 3, నీరు 3 కప్పులు, వెల్లుల్లి (తొక్క తీయకుండా) 4 రేకలు, లవంగాలు 4, జీలకర్ర 2 స్పూన్లు, ఉప్పు రుచికి సరిపడా, చింతపండు అర నిమ్మకాయ పరిమాణం రసం పొడి, 2 టేబుల్ స్పూన్లు, నూనె 2 టేబుల్ స్పూన్లు, ఆవాలు 1 స్పూన్, కరివేపాకు 810 ఇంగువ చిటికెడు, కొత్తిమీర ఆకులు (సన్నగా తరిగిన) 1కప్పు, నెయ్యి 2 స్పూన్లు. తయారు చేయు విధానంః 1. టమోటాలు తీసుకోని టమోటా పై భాగంలో కట్ చేయాలి. 2. టమోటాకు మూడు నిలువు గాట్లు పెట్టాలి. 3. టమోటాలను హెవీ హీటెడ్ పాన్ లో వేయాలి. 4. దానిలో నీరు పోసి 15 నిమిషాల పాటు మృదువుగా మారే వరకు ఉడికించాలి. 5. టమోటాలను బౌల్ లోకి తీసుకోవాలి. పాన్ లో నీటిని తరవాత ఉపయోగించాలి. 6. టమోటాలను 5 నిమిషాల పాటు చల్లారనివ్వాలి. 7. టమోటాల తొక్క తీసేసి కొంచెం మాష్ చేసి పక్కన పెట్టాలి. 8. సనికిలిలో వెల్లుల్లి వేయాలి. 9. దానిలో ఒక స్పూన్ మిరియాలు మరియు ఒక స్పూన్ జీలకర్ర వేయాలి. 10. రోకలితో కచ్చా పచ్చాగా నూరాలి. 11. పాన్ లో నీటిని రెండు నిమిషాల పాటు వేడి చేయాలి. 12. దానిలో టమోటా గుజ్జు మరియు నూరిన వెల్లుల్లి పేస్ట్ వేయాలి. 13. ఉప్పు మరియు చింతపండు వేసి 8 నుంచి 10 నిమిషాల పాటు ఉడికించాలి. 14. రసం పొడి కలపాలి. 15. రసంను బౌల్ లోకి తీసుకోవాలి. 16. తాలింపు పాన్ పొయ్యి మీద పెట్టి ఒక స్పూన్ నూనె వేయాలి. 17. దానిలో ఆవాలు మరియు ఒక స్పూన్ జీలకర్ర వేయాలి. 18. ఆ తర్వాత ఇంగువ,కరివేపాకు వేయాలి. 19. బాగా వేగనివ్వాలి. 20. వేగిన తాలింపును రసంలో పోయాలి. 21. తరిగిన కొత్తిమీర కలపాలి. 22. నెయ్యి కలపాలి. 23. ఒక బౌల్ లోకి రసంను తీసుకోని అన్నంలోకి సర్వ్ చేయాలి.



టమోటో గ్రేవీ

టమోటో గ్రేవీ రెసిపి

సాధారణంగా మనం తయారుచేసుకునే కూరలు ఎంత ప్రయత్నించినా గ్రేవీ అంతగా ఉండకపోవచ్చు. చాలా మందికి గ్రేవీ కూరలంటే మహా ఇష్టం ఉండొచ్చు. అలాంటి వారు టమోటోలను ఉపయోగించి చేసే ఈ గ్రేవీని ప్రయత్నించి చూడండి. ఈ టమోటో గ్రేవీ రిసిపి తయారుచేయడం చాలా సులభం మరియు ఈ ఇండియన్ రెసిపిని రోటీలు, బ్రెడ్, మరియు రైస్ తో సర్వ్ చేయవచ్చు. ఇలాంటి టమోటో గ్రేవీ రెసిపిని కేరళ స్టైల్‌లో ఎక్కువగా తయారు చేస్తుంటారు . అయితే ఇదే టమోటో గ్రేవీ కాస్త వెరైటీగా తయారుచేసుకుంటే సౌత్ అండ్ నార్త్ ఇండియన్స్ చపాతీ రోటీలకు కాంబినేషన్‌గా తింటారు. టమోటో గ్రేవీ రెసిపికి మరి కాస్త వెరైటీగా ఉండాలంటే టమోటో గ్రేవీకి ఉడికించిన కూరగాయ ముక్కలు. మరి మీకు నచ్చిన పద్దతిని ఎంపిక చేసుకొని వెంటనే వంటను తయారుచేయడానికి సిద్దం అయిపోండి... కావల్సిన పదార్థాలు: ఎండు మిర్చి: 4, ధనియాలు: 2టీస్పూన్లు, జీలకర్ర: అరటీస్పూన్, మిరియాలు: 1టీస్పూన్ వాము: 1/2టీస్పూన్, దాల్చిన చెక్క: కొద్దిగా లవంగాలు: 3, యాలకులు: 3, అనాసపువ్వు: 1, డ్రమ్ స్టిక్(మునక్కాడ), టమోటో కర్రీ: హెల్తీ సైడ్ డిష్ పేస్ట్ కోసం కావల్సిన పదార్థాలు: పెద్ద ఉల్లిపాయలు: 4, పచ్చిమిర్చి: 4, వెల్లుల్లి రెబ్బలు: 6, అల్లం : చిన్న ముక్క గ్రేవీకోసం. కావల్సిన పదార్థాలు: టమోటోలు 4 5, కొబ్బరి పేస్ట్ : 2 టీస్పూన్లు, బిర్యానీ ఆకులు : 2 కస్తూరి, మేథీ: అరటీస్పూన్, కారం: 1టీస్పూన్, ధనియాలపొడి : 1టీస్పూన్, పసుపు: 1/4టీస్పూన్, కరివేపాకు : రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు కొద్దిగా నూనె : సరిపడా, ఉప్పు : రుచికి తగినంత. తయారు చేయు విధానం: 1. ముందుగా మిక్సీ జార్ లో ఎండుమిర్చి, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, వాము, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, అనాసపువ్వు వేసి మసాలా పొడిని తయారుచేసుకోవాలి. 2. తర్వాత పేస్ట్ కోసం సిద్ధంగా పెట్టుకొన్న పదార్థాలను వేరే జార్ లో వేసి పేస్ట్ లా చేసి పక్కన పెట్టుకోవాలి. 3. ఇప్పుడు పాన్ లో నూనె వేడి చేసి బిర్యానీ ఆకులు, కస్తూరిమేథీ, కరివేపాకు వేసి, ఒక నిముషం వేగించుకోవాలి. 4. ఆ తర్వాత ఉల్లిపాయ పేస్ట్ వేసి అది వేగాక టమోటో ముక్కలు, కారం, ధనియాలపొడి, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి మీడియం మంట మీద వేగిస్తుంటే ఇది గ్రేవీలా తయారవుతుంది. 5. గ్రేవీలా ఉడికే సమయంలో అందులోనే కొబ్బరి పేస్ట్, ముందుగా తయారుచేసుకొన్న మసాలా పేస్ట్ వేసి బాగా కలగలిపి, 5నిముషాలు ఉడికించి 5 నిముషాల తర్వాత దింపేసుకోవాలి. 6. అవసరం అయితే కొద్దిగా నీళ్ళు పోసి కొద్దిగా పల్చగా కూడా తయారుచేసుకోవచ్చు. 7. అంతే టమోటో గ్రేవీ రెసిపి రెడీ. దీన్ని రోటీలతో కలిపి తింటే చాలా టేస్ట్ గా ఉంటుంది. వెరైటీ కావాలనుకుంటే టమోటో గ్రేవీలోనే కొన్ని రకాల కూరగాయముక్కలు జత చేసి ఉడికించుకోవచ్చు.



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	395	విజయవాడ	395
ముంబయి	450	ఢిల్లీ	412
చెన్నై	430	బెంగళూరు	425

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115

సెన్సెక్స్ +212.74 ▲
36,469



నిఫ్టీ + 62.70 ▲
10,893

రూపాయి
₹71.24
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
34,160.40
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

ఎయిర్‌సెల్ శివశంకరన్ ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ



చెన్నై: ఎయిర్‌సెల్ సంస్థ వ్యవస్థాపకుడు శివశంకరన్‌కు చెందిన చెన్నైలోని రూ.224 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. శివశంకరన్ కొంతకాలం క్రితం ఐడీబీఐ బ్యాంక్ నుంచి వ్యాపార నిమిత్తం రూ.600 కోట్ల అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని సొంత అప్పుల్ని తీర్చేందుకు వాడుకున్నాడు.

వడ్డీ చెల్లించకపోవడంతో ఐడీబీఐ పలుమార్లు నోటీసులిచ్చింది. అసలు చెల్లించాలని ఒత్తిడి చేయగా శివశంకరన్ చేతులు ఎత్తేశాడు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన ఈడీ చెన్నైలో శివశంకరన్‌కు చెందిన రూ.224 కోట్ల విలువైన స్థిర, రూ.35 లక్షల చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

చందా కొచ్చర్‌పై ఈడీ కేసు

- భర్త దీపక్‌తోపాటు, వీడియోకాన్ గ్రూప్ అధినేతపైనా ఈసీఐఆర్ నమోదు
- మనీల్యాండరింగ్ చట్టం కింద కొనసాగుతున్న దర్యాప్తు



ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చీఫ్ చందా కొచ్చర్‌పై వరుసగా కేసుల్లో కూరుకుపోతున్నారు. తాజాగా మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. చందా కొచ్చర్‌తోపాటు ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్‌తోపాటు ఇతరులపైనా ఈడీ కేసులు నమోదు చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్, వీడియాకాన్ రుణం కేసులో రూ. 1875 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. దీనికి సంబంధించి ఇటీవలే చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌తో పాటు వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. అయితే ఈ అవినీతి వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఈడీ కూడా సీబీఐ ఫిర్యాదు ఆధారంగా వారందరిపై మనీ ల్యాండరింగ్ చట్టం కింద ఆ ఎన్‌పోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)ను నమోదు చేసింది. ఈడీ నమోదు చేసిన ఈసీఐఆర్ పోలీస్ ఎఫ్ఐఆర్‌తో సమానం. ఐసీఐసీఐ బ్యాంక్ వీడియోకాన్‌కు రుణాలు జారీ చేయడంలో క్విడ్ ప్రో కో జరిగినట్టు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో స్వీకరించిన ముడుపులు ఆస్తుల కొనుగోలుకు మళ్లించారా అన్న కోణంలో విచారణ సాగుతొంది. ఈసీఐఆర్‌లో పేర్కొన్న నిందితులకు త్వరలోనే ఈడీ సమన్లు జారీ చేయనుంది. ఇదే కేసులో సీబీఐ ఇప్పటికే చందా కొచ్చర్ దంపతులతో పాటు వీడియాకాన్ చీఫ్ వేణుగోపాల్ ధూత్ ఇతరులపై చార్జిషీటు నమోదు చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే కీలక సోదాలు, దాడులు చేసిన సీబీఐ కేసు దర్యాప్తును వేగవంతం చేస్తోంది.

యూఐడీఏఐకు ఆర్థికశాఖ సహకారం అందిస్తోంది

- సీఈవో అజయ్ భూషణ్



ఢిల్లీ: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో భారత విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ)కు కేటాయింపులు తగ్గాయి. గతేడాదితో పోలిస్తే, 8.7శాతం తగ్గగా, మొత్తం రూ.1,227కోట్లు కేటాయించారు. 2018–19 సంవత్సరంలో ఈ మొత్తం రూ.1,345కోట్లుగా ఉండటం గమనార్హం. మార్చి 2019తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి గానూ గత బడ్జెట్‌లో యూఐడీఏఐకి రూ.1,375కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా, సవరించిన అంచనాలతో రూ.1,345కోట్లు అందించారు. ఈ విషయమై యూఐడీఐఏ సీఈవో అజయ్ భూషణ్ మాట్లాడుతూ.. సంస్థ అవసరాల మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందని, తదనుగుణంగా ఖర్చులుంటాయని తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించి పాత హార్డ్‌వేర్ స్థానంలో కొత్తదాన్ని తీసుకురావడం, సరికొత్త ఆలోచనలు మొదలైన వాటికి నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అదే సమయంలో యూఐడీఏఐని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. యూఐడీఏఐకి అవసరాలకు అనుగుణంగా ఆర్థికశాఖ నుంచి పూర్తి సహకారం ఉందని అజయ్ భూషణ్ పేర్కొన్నారు.

భారత క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ. 5,000 కోట్లు వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు



ముంబై: ఒక్క జనవరిలోనే భారత క్యాపిటల్ మార్కెట్ నుంచి విదేశీ ఫోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 5,000 కోట్లను వెనక్కి తీసుకున్నారు. డిపాజిటర్ల దగ్గర ఉన్న సమాచారం మేరకు రూ. 5,264 కోట్లను ఈక్విటీ మార్కెట్ నుంచి, రూ. 97 కోట్లను డెట్ మార్కెట్ నుంచి వారు వెనక్కి తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో విదేశీ ముదుపర్లు ఆచీతూచీ అడుగు వేస్తున్నారు. గడిచిన నవంబరు, డిసెంబరు నెలల్లో రూ. 17,000 కోట్లను విదేశీ ముదుపర్లు ఈక్వీటీ, డెట్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టారు. అయితే అక్టోబరులో రికార్డు స్థాయిలో రూ. 38,900 కోట్ల ఎఫ్‌పిఐలను మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు. ముడి చమురు ధరల్లో హెచ్చు తగ్గులు, డాలర్‌తో రూపాయి విలువ బలహీనపడటం, అమెరికాచైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం లాంటి పరిణామాలు ఎఫ్‌పీఐల రాకపై ప్రభావం చూపుతున్నాయి.

టాప్ అమ్మకాల్లో షామీ, ఒప్పో స్మార్ట్‌ఫోన్‌లు

ముంబై: గతేడాది టెక్నాలజీ ఇండస్ట్రీ ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. ప్రముఖ ఐఫోన్‌ల తయారీ సంస్థ యాపిల్ వ్యాపారం కూడా ఆశించిన రీతిలో వృద్ధిని నమోదు చేయలేదు. స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లలో యాపిల్, శాంసంగ్‌లకు గతేడాది అత్యంత చెత్త సంవత్సరమని ఇటీవల ఐడీసీ గణాంకాల ద్వారా వెల్లడైంది. కాగా, 2018లో 1.4 బిలియన్ల స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు జరిగాయని ఐడీసీ పేర్కొంది. వేగంగా వృద్ధి చెందుతున్న స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీలో ఈ విక్రయాలను పరిగణనలోకి తీసుకుంటే అంచనాల కన్నా 4.1శాతం తక్కువని ఐడీసీ తెలిపింది. 2014లోనే ఈ సంఖ్యను స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీ దాటింది. 2018 నాలుగో త్రైమాసికంలోనూ స్మార్ట్‌ఫోన్‌ల షిప్‌మెంట్‌ల 4.9శాతంగా నమోదైంది.

2017 నాలుగో త్రైమాసికంతో పోలిస్తే, 2018లో ఐఫోన్ ఆదాయం 15శాతం తగ్గింది. చైనాలో ఆర్థిక మందగమనం కూడా ఐఫోన్ అమ్మకాలపై పడిందని సీఈవో టిమ్‌కుమ్ తెలిపారు. దీంతోపాటు, డాలర్ బలపడటం, సబ్సిడీల తగ్గింపు, యాపిల్ బ్యాటరీ రీప్లేస్‌మెంట్‌లు కూడా అమ్మకాల తగ్గుదలకు కారణమయ్యాయి. ఇక శాంసంగ్ అమ్మకాలు 5.5శాతం తగ్గాయి. కాగా, హువావే అమ్మకాలు మాత్రం 33.6శాతం పెరగ్గా, షామీ, ఒప్పోలు విక్రయాలు కూడా వృద్ధిని నమోదు చేశాయి.

శాంసంగ్ ఎం సిరీస్‌లో రెండు కొత్త స్మార్ట్‌ఫోన్స్



న్యూఢిల్లీ: తమ వినియోగదారులకు దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ శాంసంగ్ శుభవార్త అందించింది. శాంసంగ్ ఎం సిరీస్‌లో రెండు కొత్త స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. భారత మార్కెట్‌లో మొదటి సారి ఎం సిరీస్‌లో శాంసంగ్ గెలాక్సీ ఎం10, శాంసంగ్ గెలాక్సీ ఎం20 రెండు కొత్త స్మార్ట్‌ఫోన్‌లను ప్రవేశపెట్టనున్నారు. శాంసంగ్ గెలాక్సీ ఎం10 స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ. 7,990, శాంసంగ్ గెలాక్సీ ఎం20 స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.10,990తో మొదలవుతుందని కంపెనీ తెలిపింది. ఈ రెండు స్మార్ట్‌ఫోన్స్ ఆండ్రాయిడ్ 8.1 ఓరియోతో పని చేస్తాయి. ఈ ఫోన్‌ల అమ్మకాలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, అమెజాన్ ఇండియా, శాంసంగ్ స్టోర్లలో ఫోన్లు అందుబాటులో ఉంటాయని సంస్థ పేర్కొంది.

స్పోర్ట్స

ప్రపంచకప్‌లో టీమిండియా ఫేవరేట్

- పిచ్ ఏదైనా పోటీపడే సామర్థ్యం ఉంది
- సచిన్ టెండూల్కర్



కోల్‌కత్తా: టీమిండియా జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. దీంతో టీమిండియాపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. భారత క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా టీమిండియా ప్రదర్శనపై తన దైశ శైలిలో ప్రశంసించారు. ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఫేవరేట్ అనడంలో తనకు సందేహమేమీ లేదని ఈ దిగ్గజ క్రికెటర్ అన్నారు. ప్రపంచంలోని ఏ దేశంలోనైనా, ఏ పిచ్‌పై అయినా పోటీపడే సామర్థ్యం ఉందని సచిన్ చెప్పారు. ఈ క్రమంలో టాప్ జట్లు అయిన దక్షిణాఫ్రికా (5–1), ఆస్ట్రేలియా (2–1), న్యూజిలాండ్ (4–1) లపై భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీసులను కైవసం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. టీమిండియాలో చక్కని సమన్వయం ఉందని, ఈ జట్టు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఎక్కడైనా పోటీపడగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓవరాల్‌గా టీమిండియా ప్రదర్శనలు చూస్తుంటే ప్రపంచకప్‌లో భారత్ ఫేవరెట్ అనడంలో సందేహం లేదని సచిన్ అన్నారు. ఇంగ్లాండ్ గడ్డపై త్వరగా జోరందుకోవడం ముఖ్యమని, ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ జట్టు చాలా కఠినమైన జట్టని, న్యూజిలాండ్ సైతం అలాగే కనిపిస్తోందన్నారు. ప్రస్తుత సిరీస్‌లో కివీస్ ఇబ్బంది పడినా ఆ జట్టు ప్రదర్శన చాలా బాగుందని కితాబిచ్చారు. స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్‌లు జట్టులోకి వస్తే ఆసీస్ బలపడుతుందని, కానీ వన్డేల్లో కొన్ని ఓవర్లలో మ్యాచ్‌లు మలుపు తిరుగుతాయి. అందుకే ఆ జట్టుకు 50 శాతం అవకాశమే ఉందని సచిన్ అన్నారు. అంతేకాకుండా క్రీడల్లో మహిళలు దేశానికి పేరు తీసుకొస్తున్నారని కొనియాడారు. స్వప్న బర్మన్, ద్యుతి చంద్, హిమ దాస్ మహిళల సాధికారతకు నిలువుటద్దాలని సచిన్ పేర్కొన్నారు.

ప్రో బాక్సింగ్ లీగ్ షురూ..



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ ఇంటర్నేషనల్ బాక్సింగ్ లీగ్ గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరుగనున్న ప్రొ బాక్సింగ్ లీగ్‌లో 14 మంది పురుష బాక్సర్లు, నలుగురు మహిళా బాక్సర్లు పాల్గొంటున్నారు. కజకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఆర్మేనియా, కెన్యా, థాయ్‌లాండ్, ఇరాన్ దేశాల నుంచి టాప్ బాక్సర్లు ఈ టోర్నీలో పాల్గొననున్నారు. మొదటి మ్యాచ్‌లో భారత బాక్సర్ ఫస్ట్ నాకౌట్ విక్టరీని నమోదు చేశారు. కజకిస్తాన్‌కు చెందిన అస్కర్, నర్మక బెథోవ్‌పై గెలుపొందాడు.

భారత్ నయా చరిత్ర

- కివీస్‌పై 4–1 తేడాతో వన్డే సిరీస్ కైవసం
- మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అంబటి రాయుడు
- రాణించిన కేదార్ జాదవ్, పాండ్య





వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను టీమిండియా విజయవంతంగా ముగించింది. సిరీస్‌ను 4–1 తేడాతో గెలుపొందింది. ఆఖరుదైన చివరి వన్డేలో కుర్రాళ్లు అదరగొట్టారు. వరుసగా మూడు వన్డేలు గెలిచి జోరు మీదున్న టీమిండియాకు నాలుగో వన్డేలో కివీస్ జట్టు బ్రేక్ వేసింది. ఆఖరుదైన ఐదో వన్డేలో అంబటి రాయుడు, విజయ్ శంకర్, హార్ధిక్ పాండ్యాలు విజృంభించడంతో టీమిండియా 35 పరుగులతో ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. మ్యాట్ హెన్రీ, ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్ ధాటికి టీమిండియా టాప్ ఆర్డర్ కుదేలైంది. 10 ఓవర్లలోపే నాలుగు కీలక వికెట్లు రోహిత్ (2), ధావన్ (6), శుభమన్ గిల్ (7), ధోనీ (1) కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నాలుగో వన్డే మళ్లీ సీన్ రిపీట్ అవుతుందని అందరూ భావించారు. కానీ ఈ క్రమంలో టీమిండియా కుర్రాళ్లు అంబటి రాయుడు (90; 113 బంతుల్లో 8x4, 4x6), విజయ్ శంకర్ (45; 64 బంతుల్లో 4x4,1x6) బాది టీమిండియాకు ఊరట కలిగించారు. ఒకటి, రెండు పరుగులు తీస్తూ క్రీజులో నిలదొక్కుకుని అడపా దడపా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వికెట్ పడకుండా వీరిద్దరూ చక్కటి భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఐదో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. అర్ధ శతకానికి చేరువైన శంకర్ అనవసర పరుగుకు ప్రయత్నించి సమన్వయ లోపంతో 116 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కేదార్ జాదవ్ (34; 45 బంతుల్లో 3x4) తో కలిసి అంబటి రాయుడు ఆరో వికెట్‌కు 74 పరుగల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ దశలో 90 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రాయుడును హెన్రీ ఔట్ చేయడంతో తృటిలో సెంచరీని చేజార్చుకున్నాడు. 13 పరుగుల వ్యవధిలో కేదార్ జాదవ్ మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో 34 పరుగుల వద్ద బౌల్డ్ అయ్యాడు. దీంతో స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో యువ ఆల్‌రౌండర్ హార్ధిక్ పాండ్య (45; 22 బంతుల్లో 2 ఫోర్లు4, 5 సిక్సర్లు 6) తో కివీస్ బౌలర్లపై పంజా ఝులిపించాడు. కివీస్ బౌలర్ టాడ్ ఆస్లే వేసిన 47వ ఓవర్‌లో ఏకంగా మూడు వరుస సిక్స్‌లు బాది స్కోరును పరుగులు పెట్టించాడు. దీంతో జట్టు స్కోరు 250 పరుగులు దాటింది. కివీస్ బౌలర్లపై రెచ్చిపోయి ఆడుతున్న అతడిని నీషమ్ ఔట్ చేశాడు. అనంతరం భువనేశ్వర్, షమీలు రెండు వరుస బంతుల్లో ఔటవ్వడంతో 252 పరుగుల టార్గెట్‌ను కివీస్‌కు నిర్దేశించింది.





బౌలర్ల సమష్టి దెబ్బ


252 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన కివీస్ ఎప్పటిలాగానే ఆరంభంలో తడబడింది. 18 పరుగుల వద్ద ఓపెనర్ నికోలస్ (8) షమి బౌలింగ్ ఔటయ్యాడు. మరో ఓపెనర్ కొలిన్ మన్రో (24; 19 బంతుల్లో 2x4, 1x6) తో కాసేపు విజృంభించాడు. ఈ దశలో షమీ 10వ ఓవర్‌లో మన్రో బౌల్డ్ అయ్యాడు. ఈ క్రమంలో కివీస్ సారథి కేన్ విలియమ్సన్ (39; 73 బంతుల్లో 3x4), టామ్ లేథమ్ (37; 73 బంతుల్లో 3x4) లు కలిసి నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించి చక్కటి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ దశలో క్రీజులో పాతుకుపోయిన విలియమ్ సన్‌ను జాదవ్ కీలక సమయంలో ఔట్ చేసి కివీస్ జోరుకు బ్రేక్ వేశాడు. ఐదో వన్డేలో కివీస్ హిట్టర్ రాస్ టేలర్ (1) విఫలమయ్యాడు. దీంతో కివీస్ జట్టు 30 ఓవర్లు ముగిసే సమయానికి 135/6 స్కోరును చేసింది. ఈ క్రమంలో జేమ్స్ నీషమ్ (44; 32 బంతుల్లో 4x4, 4 x6) లతో స్కోరు బోర్డును కాసేపు పరుగులు పెట్టించాడు. తన బ్యాటింగ్‌తో భారత బౌలర్లపై దాడి చేశాడు. క్రీజు బయట నిలబడి ఆడుతున్న అతడిని ధోనీ చాకచక్యంతో రనౌట్ చేశాడు. దీంతో కివీస్ జోరుకు బ్రేక్ పడింది. చివరలో మిచెల్ శాంటర్న్ (22; 37 బంతుల్లో), మ్యాట్ హెన్రీ (17; 9 బంతుల్లో 1x4, 2 x6) లతో కాస్త మెరిసినా యజ్వేంద్ర చాహల్ వారి దూకుడుకు అడ్డుకట్ట వేశాడు. దీంతో 217 పరుగుల వద్ద కివీస్ కివీస్ కథ ముగిసింది. భారత బౌలర్లలో చాహల్‌కు మూడు, పాండ్య, షమీలకు రెండు వికెట్లు పడగా.. భువనేశ్వర్, జాదవ్‌లకు తలో వికెట్ దక్కింది. 90 పరుగులతో జట్టుకు కీలక ఇన్నింగ్స్ ఆడిన అంబటి రాయుడును మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మహ్మద్ షమికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కింది.

ఇంకా ఏం అడుగుతాను: రోహిత్



న్యూజిలాండ్‌తో చివరి వన్డేలో సత్తా చూపిన ఆటగాళ్లను టీమిండియా తాత్కాలిక సారథి రోహిత్ శర్మ ప్రశంసించాడు. కఠిన పరిస్థితుల్లో తమను తాము పరీక్షించు కోవాలని భావించామని వెల్లడించాడు. నాలుగో వన్డేలో భారత్ 92 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఐదో మ్యాచ్లో 18 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకున్న జట్టును అంబటి రాయుడు (90), విజయ్ శంకర్ (45), హార్దిక్ పాండ్య (22 బంతుల్లో 45), కేదార్ జాదవ్ (35) ఆదుకున్నారు. 'నాలుగు వికెట్లు చేజార్చుకున్న తర్వాత ఎవరో ఒక్కరైనా రాణించాలని కోరుకున్నాం. రాయుడు, విజయ్ శంకర్ ఆ పని చేశారు. వారిద్దరి భాగస్వామ్యం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. చివర్లో హార్దిక్, కేదార్ మెరుపులు మెరిపించారు. మేమెంతో పట్టుదల ప్రదర్శించాం. మ్యాచ్ జరుగుతున్న కొద్దీ వికెట్ ఫ్లాట్‌గా మారింది. ఒకానొక దశలో ఛేదన సులభమవుతుందని భావించాం. కానీ బౌలింగ్ విభాగం సమష్టిగా రాణించింది. కీలక సమయాల్లో బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేశారు. ఇంతకన్నా నేను వారి నుంచి ఇంకేం ఆశిస్తాను. మ్యాచ్ గెలవాలంటే జట్టు కూర్పు బాగుండాలి. ఏదేమైనప్పటికీ న్యూజిలాండ్ వచ్చి ఆతిథ్య జట్టును 41తో ఓడించడం గొప్ప గుర్తింపు' అని రోహిత్ అన్నాడు.

సిరీస్‌లో చిత్తు చేసిన ఒత్తిడి: కేన్



ఛేదనలో ఒత్తిడి తమను చిత్తుచేసిందని న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ అన్నాడు. టీమిండియాతో ఐదో వన్డేలో ఓటమి తర్వాత మీడియాతో మాట్లాడాడు. కష్టమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తమ జట్టు నిరంతరం ఒత్తిడికి గురైందని పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 252 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఒడుదొడుకులకు గురైన కివీస్ విజయానికి 35 దూరంలో నిలిచిపోయింది. 'పిచ్ చాలా భిన్నంగా ఉంది. భారత్ గెలుపునకు అవసరమైన స్కోరు చేసింది. నిజం చెప్పాలంటే కొన్ని ఎక్కువ పరుగులే చేసింది. ఛేదించడం కష్టమని తెలుసు. అనవసర సమయాల్లో వికెట్లు చేజార్చుకున్నాం. టీమిండియా మాత్రం అలా చేయలేదు. రాయుడు అద్భుతంగా ఆడి 90 పరుగులు చేశాడు. ఆ తర్వాత మాపై ఒత్తిడి పెంచారు. ఇది మాకో పాఠం. టామ్ లేథమ్, నేను మ్యాచ్‌ను ఛేదనను ముందుకు తీసుకుపోవాల్సింది. టీమిండియా మాకు పాఠం నేర్పింది. సిరీస్ విజయానికి వారు అర్హులు. సిరీస్‌లో ఒత్తిడికి తలొగ్గకుండా ముందుకు పోవాలనుకున్న ప్రతిసారీ భారత్ మరింత ఒత్తిడి పెంచింది' అని కేన్ విలియమ్సన్ అన్నాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.